www.visalaandhra.com
Dwaraka
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2015-17
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66 సంచిక : 212 | మంగళవారం 23-01-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

అంతులేని..

అసమానత..!

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అసమానతల అంతరం నానాటికీ పెరిగిపోతోంది. పేదోడు మరింత పేదోడు అవుతున్నాడు. గొప్పోడు అంతకంత గొప్పోడుగా కొట్లకు పడగలెత్తుతున్నాడు. దోపిడీ వర్గాల దోపిడీకి అంతులేకుండా పోయింది. ప్రపంచ జనాభా స్వేదం చిందించి సృష్టించిన సంపదలో 82 శాతాన్ని ధనికవర్గం కొల్లగొట్టింది. ఇక భారతదేశంలో రూ.20.91లక్షల కోట్ల సంపదను ఒక శాతం కార్పొరేట్లు కబళించారు. అంటే...73 శాతం సంపదను కొద్దిమంది ధనికులు హస్తగతం చేసుకున్నారంటే అతిశయోక్తి కాదు. ఈ విషయాన్ని ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ అనే సంస్థ తన సర్వేలో తేల్చి చెప్పింది.




పేదోడు మరింత పేదోడు

- గొప్పోడు అంతకంత పైపైకి
- భారత్‌లో తిరుగులేని ఆర్థిక దోపిడీ
- ఒకశాతం చేతిలో రూ.21 లక్షల కోట్ల సంపద
- ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ సర్వే వెల్లడి

దావోస్ : భారత్‌లో 125 కోట్ల మంది సృష్టించిన సంపదలో సింహభాగం అతి కొద్ది మంది అత్యంత ధనవంతుల గుప్పెట్లో ఉందని ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ సర్వే వెల్లడించింది. నిరుడు భారత్‌లో జరిగిన సంపద సృష్టిలో 73శాతం కేవలం ఒక్క శాతం మంది వద్దే ఉందని ఈ సర్వే స్పష్టం చేసింది. దేశంలో ఆర్థిక అసమానతలు విపరీతంగా పెరిగిపోతున్న ప్రమాదానికి ఈ గణాంకాలు అద్దం పట్టాయి. దేశంలోని 73శాతం సంపద ఒక్క శాతం మంది వద్ద ఉండటం ఆందోళన కలిగిస్తోంది. దాదాపు 67కోట్ల మంది భారతీయుల సంపద కేవలం ఒక్క శాతమే పెరగడం గమనార్హం. ప్రపంచవ్యాప్తంగా చూస్తే పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. నిరుడు ప్రపంచవ్యాప్తంగా సృష్టించిన మొత్తం సంపదలో 82శాతం కేవలం ఒక్క శాతం మంది వద్దకు చేరిందని సర్వే తెలిపింది. సుమారు 3.7బిలియన్ల మంది ప్రజల సంపాదనలో ఏమాత్రం వృద్ధి లేదట. ప్రపంచవ్యాప్తంగా పది దేశాల్లోని లక్షా 20 వేల మంది అభిప్రాయాలను ఈ సర్వే సేకరించింది. ఈ ఆక్స్‌ఫామ్ సర్వేకు చాలా ప్రాధాన్యం ఉంది. ప్రతి ఏడాది విడుదలయ్యే ఈ సర్వేపై వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్‌లోనూ చర్చిస్తారు. దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థికవేత్తల సదస్సులో ఆక్స్‌ఫామ్ సర్వేను నిశితంగా పరిశీలిస్తారు. ప్రపంచాధినేతలు తమ చర్చల్లో ఆర్థిక, లింగ అసమానతల గురించి ప్రధానంగా మాట్లాడనున్నారు. గత ఏడాది ఆక్స్‌ఫామ్ సర్వేలో భారత్‌లో ఒక్క శాతం మంది ధనికుల వద్ద దేశంలోని సంపదలో 58శాతం కేంద్రీకృతమైందని, ప్రపంచవ్యాప్తంగా 50శాతం సంపద కొందరి వద్దే పోగుపడినట్లు తేలింది. ఇలా ధనికులు మరింత ధనవంతులవుతుండగా.. పేదవాళ్లు మరింత పేదవాళ్లుగా మారుతున్నారు. సర్వే ప్రకారం.. భారత్‌లోని ఒక్క శాతం ధనికుల సంపద 2017లో రూ.20.9లక్షల కోట్లు పెరిగింది. ఇది దాదాపుగా ఓ ఏడాది కేంద్ర బడ్జెట్‌తో సమానం. 2017లో భారత్‌లో లక్షాధికారుల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2010 నుంచి భారత్‌లో బిలియనీర్ల సంపద ఏడాదికి సగటున 13శాతం పెరిగిందట. గతేడాది భారత్‌లోని

- మిగతా 2 లో





• హోదా ఉద్యమం

తీవ్రతరం

- కేంద్రం వైఖరి ఆక్షేపణీయం
- పార్లమెంట్ స్తంభించేలా పోరాటాలు
- అఖిలపక్షాల ఆధ్వర్యంలో ఆఖరి పోరాటం
- ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ కె. రామకృష్ణ

విశాలాంధ్ర -అమరావతి : ప్రత్యేక హోదా నినాదం హోరెత్తుతోంది. కేంద్రంపై మరింతగా వత్తిడి పెంచేందుకు రాజకీయ పార్టీలన్నీ ఉద్యమ బాట పడుతున్నాయి. రాష్ట్ర ప్రజల గొంతుకులై గళం విప్పేందుకు సన్నద్ధమయ్యాయి. విభజన చట్టంలోని ఫలాలను సాధించేందుకు నడుం బిగించాయి.. పోరాట ప్రణాళిక రూపొందించి హోదా పోరు సాగించాలని నిర్ణయించాయి. భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందించేందుకు అత్యవసర సమావేశం నిర్వహించారు. విజయవాడ గాంధీనగర్ ప్రెస్ క్లబ్‌లో ఏపీ ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమితి నగర కన్వీనర్ దోనేపూడి శంకర్ సమావేశానికి అధ్యక్షత వహించారు.

ఏపీ ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ కె.రామకృష్ణ మాట్లాడుతూ ప్రధాని మోడీ నుంచి ఏ రాష్ట్ర ముఖ్యమంత్రికి జరగని అవమానం ఏపీ సీఎం చంద్రబాబు చవి చూస్తున్నారని అన్నారు. కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వటానికి ఇష్టపడని కేంద్ర వైఖరిని ముఖ్యమంత్రి ఎందుకు నిరసించటం లేదని ప్రశ్నించారు. చంద్రబాబుకి

- మిగతా 2 లో

నిర్మాణాత్మక రాజకీయాలే

- గొడవలు పెట్టుకునే ఉద్దేశంలేదు
- బలం ఆధారంగా రెండు రాష్ట్రాల్లో పోటీ
- 27న అనంతపురం నుంచి యాత్ర
- జనసేన అధినేత పవన్‌కళ్యాణ్



విశాలాంధ్ర ప్రతినిధి - కరీంనగర్/హైదరాబాద్ : ప్రభుత్వాలతో గొడవలు పెట్టుకునే ఉద్దేశమేదీ తనకు లేదని, నిర్మాణాత్మక రాజకీయాలు మాత్రమే తాను చేస్తానని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. సోమవారం కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానంతరం కరీంనగర్ చేరుకున్న ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వాలతో గొడవలు పెట్టుకునే ఉద్దేశమేదీ తనకు లేదని చెప్పారు. ప్రభుత్వాలను గౌరవించాల్సిన అవసరం ఉందని, రాజకీయ అస్థిరత కోసం తానెప్పుడూ మాట్లాడనని తెలిపారు. తానెప్పుడూ సునిశితంగా ఆలోచిస్తానని, సమస్యలకు ఎప్పుడూ గొడవలు పరిష్కారం కాదని అన్నారు. గొడవలతో ప్రజలకు ఇబ్బందులు కలిగే పని తాను చేయనని, నిర్మాణాత్మక రాజకీయాలు మాత్రమే చేస్తానని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. తాను వేసే ప్రతి అడుగు నిర్మాణాత్మకంగా ఉంటుందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ పోటీ చేస్తామని తెలిపారు. సీట్లు, ఓట్లు కోసం ఆలోచించడంలేదని, కేవలం సమస్యలపైనే దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలకు రెండు, మూడు నెలల ముందు పార్టీ బలం ఆధారంగా రెండు రాష్ట్రాలలో ఎన్ని

- మిగతా 2 లో

రేపు చలో పెదగొట్టిపాడుకు రెడీ

దళితులపై దాడి, సాంఘిక బహిష్కరణ దారుణం

ప్రభుత్వం అడ్డుకుంటే దీటుగా ఉద్యమిస్తాం

రామకృష్ణ, మధు హెచ్చరిక

3లో





జ్యూరిచ్‌కి మోడీ

న్యూఢిల్లీ : ప్రపంచ ఆర్థిక ఫోరం(డబ్ల్యూఈఎఫ్)లో పాల్గొనేందుకు దావోస్ బయలుదేరి వెళ్లిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సోమవారం జ్యూరిచ్ చేరుకున్నారు. ఇటీవల బయటి ప్రపంచంతో భారత సంబంధాలు రాజకీయంగా, ఆర్థిక, భద్రత, ఇతర రంగాలను, ప్రజలను కలుపుతూ వాస్తవమైన, సమర్ధవంతమైన బహుళ పరిణామాలు చోటుచేసుకున్నాయని వివరించారు. 'అంతర్జాతీయ సమాజంతో భారతదేశ భవిష్యత్ కార్యకలాపాల కోసం దావోస్‌లో నా ఆలోచనలను పంచుకోవాలని ఎదురు చూస్తున్నా' అని తెలిపారు. మంగళవారం డబ్ల్యూఈఎఫ్ సదస్సు ప్రారంభ సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించనున్న మోడీ మాట్లాడుతూ దావోస్‌లో స్వీడిష్ ప్రధాన మంత్రి స్టీఫన్ లోఫ్వెన్, స్విస్ అధ్యక్షుడు అలైన్ బెర్సెట్‌లతో వేర్వేరు ద్వైపాక్షిక సమావేశాలను కూడా జరపనున్నట్లు ఆ ప్రకటనలో వివరించారు. 'భవిష్యత్ ఆర్థిక కార్యకలాపాల బలోపేతానికి, ఈ దేశాలతో మా సంబంధాల వృద్ధికి ఈ ద్వైపాక్షిక సంబంధాలు ఊపునిస్తాయని విశ్వాసం వ్యక్తం చేస్తున్నా' అని చెప్పారు.





నరేంద్ర మోడీ బ్లాక్ మెయిలర్

- స్వతంత్ర వ్యవస్థలన్నింటిని లోబర్చుకుంటున్నారు
- ఎదురు తిరిగితే జైలు • అనుకూలమైతే అందలం
- బీజేపీది హోల్‌సేల్ వ్యాపారం
- నందిగామ బహిరంగసభలో నారాయణ విమర్శ

11లో

- ముందుకొచ్చిన పయొనీరింగ్ వెంచర్స్
- జ్యూరిచ్‌తో పరస్పర ఒప్పందం
- కుప్పంలో ఎయిర్‌పోర్టుకు చంద్రబాబు హామీ

పండ్లు, పాడి పరిశ్రమలకు

రూ.5 వేల కోట్ల పెట్టుబడులు

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : పండు, పాడిపరిశ్రమ అభివృద్ధికి రూ.5 వేల కోట్ల పెట్టుబడి పెట్టడానికి జ్యూరిచ్ అంగీకరించారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు జ్యూరిచ్‌తో సోమవారం ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆంధ్రప్రదేశ్, జ్యూరిచ్ అధికారులు సిస్టర్ స్టేట్ ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ ఒప్పందం వల్ల పర్యావరణ, సాంకేతికత, జీవశాస్త్రాలు, పట్టణ, ప్రాంతీయాభివృద్ధి రంగాల్లో పరస్పరం సహకరించుకుంటాయి. పండ్ల తోటలు, పాడిపరిశ్రమ రంగాల్లో రూ.5 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు

- మిగతా 2 లో



ఇదీ లోకం!



పట్నంలో బ్యాంకు సేవలు ఉండీ ఉపయోగం లేదు పెద్దాయనా!

ప్రాథమిక హక్కులపై బీజేపీ దాడి

- హిందూ తీవ్రవాద గ్రూపుల అరాచకం
- మైనార్టీలపై హింసాకాండ
- అమెరికా ఎన్‌జీవో నివేదిక విశ్లేషణ

భారతదేశంలోని పాలక బీజేపీ బహిరంగంగా హిందూ ఆధిపత్యాన్ని విస్తృతం చేస్తూ, జాతీయ ఉన్మాదాన్ని అనుసరిస్తోందని న్యూయార్క్ స్థావరంగా పనిచేసే హ్యూమన్‌రైట్స్ వాచ్ అనే ఎన్‌జీవో సంస్థ 2018 నివేదికలో పేర్కొంది. భారతదేశ ప్రజలందరి ప్రాథమిక హక్కులను ఫణంగా పెట్టి ఈ చర్యలకు పాల్పడుతోందని ఎన్‌జీవో తెలిపింది. మతమైనార్టీలు, అణగారిన వర్గాలు, కేంద్రప్రభుత్వాన్ని విమర్శిస్తున్నవారిని లక్ష్యంగా పెట్టుకొని బీజేపీకి మద్దతిస్తున్న హిందూ తీవ్రవాద గ్రూపులు విజిలెంట్ దాడులకు, హింసాకాండకు పాల్పడుతున్నాయని నివేదిక తెలిపింది.





న్యూయార్క్ : విజిలెంటు గ్రూపులు ప్రత్యేకించి గోరక్షణ పేరుతో ముప్పుగా పరిణమించాయి. అనేక హిందూ తీవ్రవాద గ్రూపులు ముస్లింలు ఇతర మైనార్టీల పైన పలుమార్లు దాడులు జరిపాయి. మాంసంకోసం గోవులను విక్రయిస్తున్నారని, కొనుగోలు చేస్తున్నారని, లేదా చంపివేస్తున్నారని వచ్చే వదంతులను నమ్మి వారిపై దాడులు సాగిస్తున్నారు. దాడులు సాగించేవారిపైన చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు బదులుగా పోలీసులు తరచుగా గోవధ నిషేధ చట్టాన్ని అడ్డంపెట్టుకొని బాధితులపైనే కేసులు నమోదు చేస్తున్నారు. 2017లో ఇలాంటి దాడులు 38 నమోదయ్యాయి. ఈ దాడుల్లో 10 మంది చనిపోయారు. తరచుగా మత మైనార్టీలు, ఇతర అణగారిన గ్రూపులపైనా జరిగే దాడులను నివారించేందుకు బాధితులను

- మిగతా 2 లో

హోదా ఇస్తే

బీజేపీతో దోస్తీ

- తిరుపతిలో జగన్ ప్రకటన
- న్యూస్ 18కి ఇంటర్వ్యూ



విశాలాంధ్ర బ్యూరో - తిరుపతి : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా మంజూరు చేస్తే బీజేపీతో పొత్తుపెట్టుకునేందుకు తాను సిద్ధంగా ఉన్నానని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ఇక్కడ న్యూస్ 18 విలేకరితో మాట్లాడుతూ అనేక అంశాలను ప్రస్తావించారు. రాష్ట్రంలో నిర్వహిస్తున్న పాదయాత్రలో భాగంగా తిరుపతిలో జరిగిన భారీ బహిరంగసభ అనంతరం విలేకరులతో జగన్ మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొనేందుకు వెళ్లిన సమయంలో జగన్ ఈ ప్రకటన చేయడం విశేషం. చంద్రబాబు అబద్ధాలరాజు అని విమర్శించారు. అమరావతి ప్రాజెక్టు పెద్ద కుంభకోణం. అమరావతి నగరాన్ని గురించి ప్రపంచమంతా తప్పెట వేస్తున్నారు. నాలుగేళ్లు గడిచినా అమరావతిలో ఏమీ లేకపోయినా పెట్టుబడులు

- మిగతా 2 లో

ఫ్రాన్స్ జైళ్ల దిగ్బంధం నేడు



పారిస్ : ఫ్రాన్స్ అంతటా జైలుగార్డులు సోమవారం జైళ్లను దిగ్బంధం చేయాలని నిర్ణయించారు. భద్రతా చర్యలను మెరుగుపరచాలని, వేతనాలను పెంపొందించాలని రెండు వారాలుగా వీరు సమ్మె చేస్తున్నారు. ఫ్రాన్స్ న్యాయశాఖామంత్రి నికోల్ బెల్లోబెట్ మాట్లాడుతూ తాను సమ్మెను పరిష్కరించేందుకు యూనియన్ నాయకులతో మాట్లాడతానని అన్నారు. చర్చలకు ముందు సమ్మెను విరమించాలని ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను గతవారం యూనియన్లు తిరస్కరించాయి. పారిస్ శివార్లలోగల ఫ్రెస్నెస్ జైళ్లతో సహా అన్ని జైళ్లకు భద్రతా చర్యలను పెంచాలని గార్డులు డిమాండ్ చేస్తున్నారు. జైళ్ల దిగ్బంధాన్ని ఆపివేసి చర్చలకు రావాలని న్యాయమంత్రిత్వశాఖ కోరింది. అనేక జైళ్లలో జరిగిన ఘర్షణల్లో పలువురు గార్డులు గాయపడటంతో సమ్మె అనివార్యమైందని యూనియన్ నాయకులు తెలిపారు. గతంలోను జైళ్లకు వెళ్లే దారుల్లో టైర్లువేసి అడ్డుకున్నారు. గతవారం పారిస్ వెలుపలగల జైలులో ఘర్షణ జరిగి ముగ్గురు జైలు అధికారులు గాయపడ్డారు. ఆదివారం కూడా కలాయిస్ పట్టణానికి సమీపంలోగల జైలులో ఇద్దరు అధికారులు గాయపడ్డారు. సిబ్బందిపైన ఇలా ఖైదీలు దాడిచేస్తుంటే తమ విధులను ఎలా నిర్వహించాలని గార్డులు ప్రశ్నిస్తున్నారు. మరో 1100 గార్డులను నియమిస్తామని గత నాలుగేళ్లుగా ప్రతిపాదన చేస్తున్నారేగాని అది ఆచరణలోకి రాలేదు. ప్రస్తుతం 188 జైళ్లలో 28వేల మంది జైలుగార్డులు పనిచేస్తున్నారు. 78వేల మంది ఖైదీలున్నారు.

చైనా నేవీకి ఎలక్ట్రానిక్ యుద్ధ విమానం

బీజింగ్ : చైనా నిర్మించిన కొత్త తరహా ఎలక్ట్రానిక్ యుద్ధ విమానాన్ని నావికాదళాలకు అందించారు. దక్షిణ, తూర్పు సముద్ర జలాల్లో, ఇంకా ఇతర ప్రాంతాల్లో చైనా నావికాదళాల పోరాటానికి ఈ యుద్ధ విమానం మరింత సామర్థ్యాన్ని సమకూరుస్తుంది. చైనా పీపుల్స్ ఆర్మీ, నౌకాదళానికి చెందిన దక్షిణ చైనా సముద్ర ప్రాంత నౌకలకు హెచ్-6జి బాంబర్‌ను అమర్చి దాడుల విన్యాసాలను ఇటీవల నిర్వహించారు. ఎలక్ట్రానిక్ పరికరాలతో ఆధునిక యుద్ధ విమానాన్ని నిర్మించేందుకు పదేళ్లు పట్టింది. ఎలక్ట్రానిక్ యుద్ధ విమానాలలో బాంబర్ కీలకమైన పాత్ర నిర్వహిస్తుంది. ఇటీవల జరిగిన విన్యాసాలలో ఈ అంశం రుజువైంది. శత్రువులు ఎలక్ట్రానిక్ జామింగ్ సాధనాలను వినియోగించకుండా ఈ ఎలక్ట్రానిక్ యుద్ధ విమానం అడ్డుకుంటుందని ఉదాహరణకు రాడార్ సంకేతాలను కూడా ఇది అడ్డుకోగలదని తెలుస్తోంది.

విశాలాంధ్ర ప్రపంచం

చైనా జలాల్లోకి అమెరికా నౌక అక్రమ ప్రవేశం



బీజింగ్ : చైనా జలాల్లోకి అమెరికాకు చెందిన గైడెడ్ క్షిపణి విధ్వంసక హోపర్ అక్రమంగా ప్రవేశించి విన్యాసాలు నిర్వహించింది. చైనా ప్రభుత్వ అనుమతిలేకుండా ఈ నౌక ప్రవేశించింది. హోపర్ యుద్ధనౌకను చైనా గుర్తించి హెచ్చరించడంతో అది చైనా జలాల్లోంచి వెళ్లిపోయింది. అత్యంత నిర్లక్ష్యంగా రెచ్చగొట్టేవిధంగా అమెరికానౌకా విభాగం ఈ చర్యకు పూనుకోవడం సరైందికాదని చైనా వ్యాఖ్యానించింది. అమెరికా 218 జాతీయ రక్షణ వ్యూహాన్ని విడుదల చేసిన సందర్భంగా ఈ రెచ్చగొట్టే చర్యను చూడవలసివుంటుందని చైనా వ్యాఖ్యానించింది. వ్యూహాత్మక పోటీదారులకు, రివిజనిస్టు శక్తులకు వ్యతిరేకంగా రూపొందించిన దుందుడుకువాద వ్యూహం ఇదని చైనా పేర్కొంది. అయితే చైనా దక్షిణ సముద్ర ప్రాంతాన్ని సైనికీకరణ ప్రాంతంగా మార్చుతున్నదని కొంతమంది అమెరికా అధికారులు ఆరోపించారు. హంగ్‌యాన్ దీవి దానిని అనుకునివున్న నదీజలాల ప్రాంతంపై చైనా సార్వభౌమాధికారాన్ని ఎవరూ ప్రశ్నించే వీలులేదు. అమెరికా యుద్ధనౌకలు దక్షిణతీర సముద్ర జలాల్లోకి ప్రవేశించడం చైనా సార్వభౌమాధికారానికి, భద్రతా ప్రయోజనాలకు హాని కలిగిస్తుందని, చైనా నౌకల రక్షణకు ముప్పుగా పరిణమిస్తుందని చైనా అధికార వర్గాలు పేర్కొన్నాయి. సాధారణ అంతర్జాతీయ సంబంధాల మౌలిక సూత్రాలను అమెరికా ఉల్లంఘించిందని, రెండు దేశాలు సైన్యాల మధ్య సంబంధాలకు హాని చేస్తుందని చైనా పేర్కొంది. నౌకాయాన స్వేచ్ఛ పేరుతో బలాన్ని చూపడం అవుతుంది. దక్షిణచైనా సముద్ర ప్రాంతంతో సంబంధంగల అందరి ప్రయోజనాలకు ఈ చర్యలు వ్యతిరేకంగా ఉన్నాయి. దక్షిణ చైనా సముద్ర ప్రాంతంలో పరిస్థితి మేలుగానే ఉంది. ఉదాహరణకి చైనా ఆసియన్ దేశాలు ఆ ప్రాంతంలో ప్రవర్తనా నియమావళిని అనుసరిస్తున్నాయి. ఆ ప్రాంతాన్ని శాంతి, స్నేహం, సహకారం అందరికీ ప్రయోజనం కలిగించే శాంతియుత ప్రాంతంగా రూపొందించాలని చైనా ఆసియన్ దేశాలతో కలిసి పనిచేస్తున్నది. ఆ ప్రాంతంలో అలజడి సృష్టించేందుకు అమెరికా నిర్ణయించడం దక్షిణ చైనా సముద్రాన్ని సైనికీకరణ చేయడం వెనుక ఎవరు ఉన్నదీ స్పష్టమవుతున్నది. సముద్రయానానికి వీలుగా ఫిలిప్పీన్స్‌తో సంప్రదింపుల యంత్రాంగాన్ని తాము ఏర్పాటు చేశామని చైనా పేర్కొంది. 2018లో సంయుక్త నౌకావిన్యాసాల నిర్వహణకు ఆసియన్ దేశాలు, చైనా ఇప్పటికే నిర్ణయించుకున్నాయి. ఈనేపథ్యంలో అమెరికా నిర్లక్ష్య ప్రవర్తన తీవ్ర ప్రతిఘటనను ఎదర్కొంటుందని చైనా పేర్కొంది.

రాజ్యాంగ సమీక్ష అవశ్యం : జిన్‌పింగ్



బీజింగ్ : చైనా రాజ్యాంగం సమీక్ష అవశ్యమని అదేశ అధ్యక్షుడు జిన్‌పింగ్ అన్నారు. చైనా కమ్యూనిస్టు పార్టీ రాజకీయ చరిత్రలో అలాగే దేశ చరిత్రలో రాజ్యాంగ సమీక్ష ఎంతో ప్రాధాన్యతకలిగిన అంశమని ఆయన చెప్పారు. ఇక్కడ జరిగిన కమ్యూనిస్టేతర పార్టీల ప్రతినిధులతో జరిగిన సింపోజియంలో ఆయన మాట్లాడారు. చైనా కమ్యూనిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ మొత్తం పరిస్థితిని చైనా లక్షణాలతో కూడిన సోషలిజం అభివృద్ధి ఆధారంగా రాజ్యాంగాన్ని సమీక్షించాలనేది అత్యంత ముఖ్యమైన రాజకీయ నిర్ణయం. చట్టం ఆధారిత పరిపాలన, ఆధునిక చైనా వ్యవస్థ, పాలనా సామర్థ్యం పెంపునకు రాజ్యాంగ సమీక్ష ముఖ్యమైన కార్యక్రమం అని జిన్‌పింగ్ పేర్కొన్నారు. కమ్యూనిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ రాజ్యాంగ సమీక్ష కోసం చేసిన ప్రతిపాదనను ప్రతినిధులంతా ఆమోదించారు. రాజ్యాంగం అమలు, అజమాయిషీ, రాజ్యాంగ అధికార పరిరక్షణ, రాజ్యాంగం, చట్టం అమలు చేయడంలో ప్రతినిధులు పలు సూచనలు అందించారు. రాజ్యాంగాన్ని సమీక్షించేముందు సంప్రదింపులు జరపాలని పార్టీ సెంట్రల్ కమిటీ సూచించినట్టు జిన్‌పింగ్ పేర్కొన్నారు. కమ్యూనిస్టేతర పార్టీలు అభిప్రాయాలకు, సూచనలకు విలువ ఇస్తామని, అలాగే చైనా పారిశ్రామిక సమాఖ్య, వాణిజ్యమండలి సూచనలను పరిగణలోకి తీసుకొని ముఖ్యమైన పత్రాలను విడుదల చేస్తామని జిన్‌పింగ్ అన్నారు. చైనా రాజ్యాంగ వ్యవస్థను అభివృద్ధిపరచడంలో కమ్యూనిస్టేతర పార్టీలు, యునైటెడ్ ఫ్రంట్ గణనీయమైన సహకారం అందించిందని ఆయన వెల్లడించారు. చట్టం అమలులోను, రాజ్యాంగానికి కట్టుబడి ఉండటంలోను, ఏకాభిప్రాయ సాధనలోను ప్రజలను చైతన్యం చేయవలసిందిగా ప్రతినిధులను కోరారు.

నేడు ద్రవ్యబిల్లుకు ఆమోదం



వాషింగ్టన్ : డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ఎలాంటి కార్యకలాపాలు లేకుండా నిలిచిపోవడానికి కారణమైన ద్రవ్యబిల్లుకు సోమవారం సెనేట్ ఆమోదం తెలియజేస్తుందని సెనేట్‌లో మెజార్టీ నాయకుడు మిట్‌మెక్‌నల్ ఆదివారం రాత్రి తెలియజేశారు. ప్రభుత్వం తిరిగి పనిచేయడానికి వీలుగా సెనేట్ ఈ బిల్లును ఆమోదిస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం తిరిగి పనిచేయడం ప్రారంభిస్తే దేశంలోకి వచ్చిన పిల్లలను తిరిగి వారి సొంత దేశాలకు పంపించడానికి సంబంధించిన అంశంపైన చర్చించేందుకు, తీర్మానం చేసేందుకు వీలు కలుగుతుందని ఆయన చెప్పారు. వలసలపై చర్చలు ప్రారంభించినప్పుడు అది సవరణగా ఉంటుందని అన్ని పక్షాలకు ఉపయోగపడు తుందని మెక్‌నల్ చెప్పారు. అయితే డెమొక్రటిక్ నాయకుడు చెక్‌షుమర్ మాట్లాడుతూ ప్రభుత్వం తిరిగి పనిచేసేందుకు ద్రవ్య బిల్లును ఆమోదించడానికి సంబంధించి ఇంకా ఇక ఒప్పందానికి రావలసివుందని అన్నారు. ప్రభుత్వం స్తంభించిపోవడంవల్ల దాని పరిణామాలు ఎలా ఉన్నాయనే అంశం సోమవారం మరింత స్పష్టమవుతాయని ఆయన చెప్పారు.

పెన్స్ ఇజ్రాయిల్ పర్యటన



జెరూసలెం : అమెరికా ఉపాధ్యక్షుడు మైక్‌పెన్స్ ఇజ్రాయిల్‌లో పర్యటిస్తున్నారు. ఇజ్రాయిల్ ప్రధాన మంత్రి బెంజిమన్ నెతన్యాహుతో సోమవారం ఆయన చర్చలు జరపను న్నారు. నెతన్యాహు పెన్స్‌కు స్వాగతం పలికి తన కార్యాలయానికి తీసుకు వెళ్లారు. అక్కడ ఇజ్రాయిల్ సైనిక వందనం స్వీకరించారు. జెరూసలెంను ఇజ్రాయిల్ రాజధానిగా గత డిసెంబర్ 6వ తేదీన గుర్తిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన చేసిన తరువాత అమెరికా నుంచి అత్యున్నతస్థాయినేత ఇజ్రాయిల్‌లో పర్యటించడం ఇదే ప్రథమం. అమెరికా రాయబార కార్యాలయాన్ని జెరూసలెంకు మార్చే పనిని ప్రారంభిస్తామని వైట్‌హౌస్ తెలిపింది. ట్రంప్ చేసిన ప్రకటనపట్ల ప్రపంచవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేక వ్యక్తమయ్యింది. అనేక దశాబ్దాలుగా అమెరికా అనుసరిస్తున్న విధానానికి వ్యతిరేకంగా ట్రంప్ ప్రకటన ఉంది. ఐక్యరాజ్యసమితి సైతం ట్రంప్ ప్రకటనపై వ్యతిరేకత వ్యక్తం చేసింది. పాలస్తీనాకు అనుకూలంగా 54 అరబ్ తదితర దేశాలు అమెరికా చర్యను తీవ్రంగా ఖండించాయి. టెలీఅవీవ్‌నుంచి రాయబార కార్యాలయాన్ని జెరూసలెంకు తరలించడానికి మూడేళ్లు పడుతుందని అమెరికా అధికారులు తెలిపారు. అయితే ఈ అంశంపై నెతన్యాహు మాట్లాడుతూ ఏడాదిలోగా రాయబార కార్యాలయాన్ని మార్చేందుకు తాత్కాలిక ఏర్పాటు జరిగే అవకాశం ఉందని అన్నారు.

జర్మనీలో సంకీర్ణంపై చర్చలు నేడు

బెర్లిన్ : జర్మనీలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుపై సోమవారం లోతైన చర్చలు జరగనున్నాయి. గత సెప్టెంబరులో జర్మనీ పార్లమెంటు ఎన్నికలు జరిగాయి. పాలక సీడీయు పార్టీతో సహా ఏ పార్టీకి మెజారిటీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే సీట్లు రాలేదు. దీంతో గతంలోవలె సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ఛాన్స్‌లర్ ఏంజిలా మర్కెల్ చేస్తున్న ప్రయత్నాలు ఇంతవరకు ఫలించలేదు. అయితే మర్కెల్‌తో కలిసి సంకీర్ణ ప్రభుత్వంలో పనిచేసేందుకు గతంలో తిరస్కరించిన ఎస్‌పిడి పార్టీ ప్రస్తుతం అనుకూలంగా ఉన్నది. అలాగే మరో పార్టీ సిఎస్‌యుతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు ఈ చర్చలు ఉద్దేశించాయి. సంకీర్ణ ప్రభుత్వం నెలకొల్పేందుకు ఒక దశలో ఆయా పార్టీలు ముందుకు రాకపోవడంతో మళ్లీ ఎన్నికలు జరపవలసి వస్తుందని భావించారు. తాజా పరిస్థితి మారి సంకీర్ణానికి సూచనలు ఏర్పడ్డాయి. ఫిబ్రవరి 12వ తేదీనాటికి చర్చలు పూర్తిచేసి ప్రభుత్వం ఏర్పడేందుకు కృషి చేయాలని మర్కెల్ నిర్ణయించారు. ఎస్‌పిడి నాయకుడు మార్టిన్‌షుల్జ్ సిడియు, సిఎస్‌యు, ఎఫ్‌డిపి పార్టీలతో చర్చలు జరిపి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుకు సానుకూలత ప్రకటించారు. ఈసారి జరిగిన ఎన్నికల్లో పచ్చిమితవాద ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ పార్టీ 94 సీట్లు గెలుచుకుని పార్లమెంటులో బలమైన ప్రతిపక్షంగా పనిచేయనున్నది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత జర్మనీ రాజకీయ చరిత్రలో పచ్చి మితవాదులు బలపడుతున్నారని చెప్పేందుకు ఇది స్పష్టమైన సూచన.

అసమానత..!

(మొదటిపేజీ తరువాయి)

కోటీశ్వర్లు రూ.4,89,100 కోట్లు సంపాదించి నట్టు ఈ సర్వే అంచనా వేసింది. ఈ మొత్తం 85 శాతం రాష్ట్రాలు విద్య, ఆరోగ్యానికి కేటాయించే బడ్జెట్‌తో సమానం కావడం గమనార్హం. గతేడాది సర్వేలోనూ ఇలాంటి ఫలితాలే వెలువడ్డాయి. దేశంలోని మొత్తం సంపదలో 58 శాతం కేవలం ఒక్క శాతం సంపన్నుల దగ్గరే ఉన్నట్లు ఆ సర్వే తేల్చింది. ప్రపంచ సగటు 50 శాతంతో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. అంతేకాదు గతేడాది దేశంలోని బిలియనీర్ల సంఖ్య మరో 17 పెరిగి 101కి చేరడం గమనార్హం. 2000 సంవత్సరంలో దేశంలో బిలియనీర్ల సంఖ్య కేవలం 9 గా ఉండేది. సంపన్నులు ఇంకా సంపన్నులు అవుతున్నా.. దేశంలో కింది స్థాయిలో కష్టపడి పనిచేసే సగటు వేతన జీవి ఆదాయంలో మాత్రం ఎలాంటి మార్పు లేదని ఈ సర్వే స్పష్టంచేసింది. ఉదాహరణకు దేశంలోని ఓ బట్టల ఫ్యాక్టరీలో కిందిస్థాయిలో పనిచేసే వ్యక్తి కనీస వేతనం.. అదే కంపెనీలో పనిచేసే అత్యున్నత అధికారి కనీస వేతనంతో సమం కావాలంటే 941 ఏళ్లు పడుతుందని ఈ సర్వేలో తేలింది.

పాక్ కన్నా వెనుకబడిన భారత్

ఇంక్లుసివ్ డవలప్‌మెంట్ ఇండెక్స్(సమ్మిళిత అభివృద్ధి సూచీ) ఆధారంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో భారత్ 62వ స్థానంలో నిలిచింది. చైనా, పాకిస్థాన్ కంటే ఈ ఇండెక్స్‌లో భారత్ దిగజారటం గమనార్హం. చైనా 26వ స్థానంలో నిలిస్తే...పాకిస్థాన్ 44వ స్థానంలో నిలిచింది. ఆర్థిక వృద్ధి, అభివృద్ధి, అంతర్‌గ్రహణం అనే అంశాలను ప్రధానంగా తీసుకుని 103 దేశాల ఆర్థిక స్థితిని మదింపు చేశారు. 29 దేశాలు ఆర్థికంగా అభివృద్ధి చెందగా, 74 దేశాలు అభివృద్ధి చెందుతున్న దేశాలుగా గుర్తించారు. గడిచిన ఐదేళ్లల్లో ఆయా దేశాల ఇన్‌క్లూసివ్ డెవలప్‌మెంట్ గ్రోత్ స్కోర్ ఆధారంగా ఆయా దేశాలను ఐదు కేటగిరిల్లో విభజించారు. చిన్న చిన్న ఆర్థిక వ్యవస్థలు కలిగిన యూరోపియన్ దేశాలు ఇండెక్స్‌లో అగ్రస్థానాన నిలిచాయి. ఆస్ట్రేలియా ఒక్కటే టాప్‌టెన్‌లో 9వ స్థానంలో నాన్ యూరోపిన్ దేశంగా నిలిచింది. జీ7 దేశాలు జర్మనీ 12, కెనడ 17, ఫ్రాన్స్ 18, బ్రిటన్ 21, అమెరికా 23, జపాన్ 24, ఇటలీ 27 స్థానాల్లో నిలిచాయి. టాప్ ఫైవ్ ఎమర్జింగ్ కంట్రీస్‌గా లిథుయానియా, హంగెరీ, అజర్‌బైజాన్, లాట్వియా, పోలెండ్ నిలిచాయి. బ్రిక్స్ దేశాలకు మిశ్రమ ఫలితాలు దక్కాయి. రాష్యా 19, చైనా 26, బ్రెజిల్ 37, ఇండియా 62, సౌత్ ఆఫ్రికా 69వ స్థానంలో నిలిచాయి. ఇండియా అంతర్‌గ్రహణంలో 72వ స్థానం, ఆర్థిక వృద్ధి, అభివృద్ధిలో 66వ స్థానం, ఇంటర్ జనరేషనల్ ఈక్విటీలో 44వ స్థానంలో నిలిచింది.

బీజేపీ దాడి

(మొదటిపేజీ తరువాయి)

రక్షించేందుకు ప్రభుత్వ అధికారులు ఇష్టపడటం లేదని రుజువైందని హ్యూమన్ రైట్స్ వాచ్ దక్షిణాసియా డైరెక్టర్ మీనాక్షి గంగూలీ తెలిపారు. భవిష్యత్‌లో దాడులు జరగకుండా హింసాకాండకు బాధ్యులైనవారిని శిక్షించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆమె తెలిపారు. ఆధార్ హయాంలో భారతదేశ ప్రజల వ్యక్తిగత గోప్యతా అంశాలపై నివేదిక తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. వ్యక్తిగత గోప్యత తప్పనిసరైన ప్రాథమిక హక్కు అని భావప్రకటనా స్వేచ్ఛగా పరిగణించాలని సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన తర్వాత కూడా ప్రభుత్వ అధికారులు హక్కుల కార్యకర్తలను, విద్యావేత్తలను, జర్నలిస్టులను హింసిస్తున్నారు. స్వీయ నియంత్రణ పాటించాలని జర్నలిస్టులు, మీడియా సంస్థలపైనా ఒత్తిడి చేస్తూ చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బెదిరిస్తున్నారు. అవినీతి ఆరోపణలపై ఏకపక్షంగా దర్యాప్తుకు పూనుకుంటున్నారు. లైంగికదాడులకు సంబంధించి చట్టాలు సవరించి ఐదేళ్లు గడచినప్పటికీ మహిళలపై అటువంటి నేరాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. హ్యూమన్స్ రైట్స్ వాచ్ 643 పేజీలతో 28వ ప్రపంచ నివేదికను తాజాగా విడుదల చేసింది. ఈ సంస్థ 90కి పైగా దేశాల్లో పనిచేస్తోంది.

నిర్మాణాత్మక రాజకీయాలే

(మొదటిపేజీ తరువాయి)

సీట్లకు పోటీచేయాలనేది నిర్ణయిస్తామని చెప్పారు. ఏ పార్టీతో పొత్తు ఉండదని స్పష్టం చేశారు. బీజేపీతో కలవాలని గతంలో కోరగా సున్నితంగా తిరస్కరించినట్టు చెప్పారు. తన స్థాయిని బట్టి పోటీచేస్తాను తప్ప ఇతరుల కోసం పోటీలో నిలువబోనని తెలిపారు. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీల్చే అవసరం ఏమాత్రం లేదని అన్నారు. ప్రస్తుతం పార్టీ సంస్థాగత నిర్మాణ దశలో ఉందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలో సున్నితమైన అంశాలు అనేకం ఉన్నాయని, వాటిపై అధ్యయనం చేస్తున్నట్టు తెలిపారు. ప్రతి అంశాన్ని రాజకీయ కోణంతో చూడబోనని, బాధ్యతతో ముందుకు వెళతానని చెప్పారు. సేవ చేసే వారికి తమ పార్టీలో గుర్తింపు ఉంటుందని చెప్పారు. అనేక దశాబ్దాల పోరాటాల ఫలితంగా తెలంగాణ సిద్ధించిందని చెప్పారు. కేవలం నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పేందుకే ముఖ్యమంత్రి కేసీఆర్‌ని కలిసినట్టు చెప్పారు.

ఈ నెల 27 నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాలో తన పర్యటన ప్రారంభమవుతుందని తెలిపారు. జిల్లాలో రెండు మూడు రోజులు పర్యటన ఉంటుందన్నారు. ఆ తర్వాత ఒంగోలులో ఫ్లోరోసిస్, కిడ్నీ బాధితులను కలుస్తామన్నారు. అనంతరం విశాఖ జిల్లా ఏజెన్సీ ప్రాంతాల్లోనూ, కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రాన్ని పరిశీలిస్తానని చెప్పారు. అనంతపురం జిల్లా పర్యటన తర్వాత ఆయా పర్యటనలకు సంబంధించిన తేదీలను ఖరారు చేస్తానని తెలిపారు. 2009 ఎన్నికల ప్రచారానికి వచ్చినప్పుడు విద్యుత్ తీగలు తగిలి ప్రమాదం జరిగిందని, ఆంజనేయస్వామి దయ వల్ల అప్పుడు బయటపడ్డానని చెప్పారు. సంపూర్ణ రాజకీయ జీవితంలోకి రావాలనుకున్నప్పుడు ఆంజనేయస్వామిని దర్శించుకోవాలని అనుకున్నానని, అందుకే స్వామి వారిని దర్శించుకున్నానని చెప్పారు. స్వామిని నమ్మితే అసాధ్యాలు కూడా సుసాధ్యం అవుతాయన్న నమ్మకం తనకు ఉందని చెప్పారు. కార్యకర్తలతో ఆలోచించి ఏయే సమస్యలపై ఎలా ముందుకెళ్లాలనే విషయంపై చర్చిస్తామని చెప్పారు. ఉదయం హైదరాబాద్‌లోని తన నివాసం నుంచి ప్రశాసన్‌నగర్‌లోని జనసేన కార్యాలయానికి చేరుకున్న పవన్‌కు కార్యకర్తలు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. ఆయనకు మద్దతుగా జనసేన కార్యకర్తలు పెద్దఎత్తున నినాదాలు చేశారు. అక్కడి నుంచి తన ప్రజా యాత్రను ప్రారంభించారు. పవన్ వెంట పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు సుమారు 50 వాహనాల్లో బయలుదేరారు. యాత్రకు బయలుదేరిన పవన్ కల్యాణ్‌కు ఆయన భార్య అన్నా లెజ్నేవా తిలకం దిద్ది, హారతి ఇచ్చారు. రష్యన్ జాతీయురాలైన లెజ్నేవా.. తెలుగుదనం ఉట్టిపడేలా దుస్తులు ధరించి, హిందూ సంప్రదాయబద్ధంగా భర్తను రాజకీయ యాత్రకు సాగనంపారు. ఈ సందర్భంగా జనసేన సోషల్ మీడియాకు సంబంధించి 'వీర మహిళ పేరుతో ఏర్పాటైన విభాగాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించి, వీరమహిళా బృందానికి శుభాభినందనలు తెలిపారు. పవన్ యాత్రకు బయలుదేరనున్న నేపథ్యంలో హైదరాబాద్‌లోని ఆయన ఇంటివద్ద హడావిడి కనిపించింది. పెద్ద సంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. ప్రజారాజ్యం పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన పవన్.. ఆ పార్టీ కాంగ్రెస్‌లో విలీనం కావడంతో 2014 ఎన్నికలకు ముందు సొంతగా జనసేన పార్టీని ఏర్పాటుచేసి బీజేపీ, తెలుగుదేశం పార్టీలకు మద్దతు ఇవ్వడం తెలిసిందే. గడిచిన నాలుగేళ్లుగా అడపాదడపా కార్యక్రమాలు నిర్వహించిన పవన్, తాజాగా యాత్రకు తెరలేపారు. సమస్యలను అధ్యయనం చేసి, అవగాహన పెంచుకోవడం కోసమే యాత్ర చేస్తున్నట్లు చెప్పుకున్నారు. తన కార్యక్షేత్రం ఏపీనే అని గతంలో వ్యాఖ్యానించిన ఆయన.. కెసిఆర్‌ను కలిసిన తెలంగాణ నుంచి యాత్రను ప్రారంభించడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమైంది.

బీజేపీతో దోస్తీ

(మొదటిపేజీ తరువాయి)

పెట్టడానికి అక్కడకు రండి అని పిలుస్తున్నారు. ఇది భూమిని లాక్కునే కుంభకోణం అని విమర్శించారు. పార్లమెంటుకు జరిగే తదుపరి ఎన్నికల్లో బీజేపీతో పొత్తుపెట్టుకునే అవకాశం ఉందా అని ప్రశ్నించగా... రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తే ప్రధాని మోడీతో కలిసి నడిచేందుకు తాను సిద్ధమేనని అన్నారు. ప్రధాని అనుకుంటే నిమిషంలో చేయగలరు. రాష్ట్రంలో ఎన్నికల వ్యూహాన్ని గురించి ప్రశ్నించగా కాంగ్రెస్, బీజేపీలు అసంబద్ధమైన పార్టీలుగా ఉన్నాయని, వాటికి ఆదరణ లేదనీ తమ ప్రధాన లక్ష్యం చంద్రబాబేనని అన్నారు. తనపై గల అవినీతి కేసులన్నీ రాజకీయ ఉద్దేశంతో పెట్టినవేనని అన్నారు. కేసుల వెనుక కాంగ్రెస్ ఉందన్నారు.

పెట్టుబడులు

(మొదటిపేజీ తరువాయి)

పయొనీరింగ్ సంస్థ ముందుకు వచ్చింది. అంతకుముందు చంద్రబాబు జ్యూరిచ్ ప్రభుత్వ ఆర్థిక వ్యవహారాల మంత్రి కార్మెన్ వాకెర్ స్పా, ఆర్థిక వ్యవహారాల ఉపమంత్రి బ్యూన్ సాటర్, ప్రభుత్వ ప్రాజెక్టు మేనేజర్ కొరిన్ వ్యేర్‌తో భేటీ అయ్యారు. టెక్నాలజీ, ఇన్నోవేషన్ అంశాలలో జ్యూరిచ్ ఎంతో పటిష్టంగా ఉన్నట్లు చంద్రబాబుకి కార్మెన్ వాకెర్ వివరించారు. విద్యారంగానికి తాము పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నట్లు చెప్పారు. అత్యుత్తమ జీవన ప్రమాణాలకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. దావోస్ పర్యటనకు వెళ్లిన సీఎం చంద్రబాబుకు జ్యూరిచ్‌లో ఘనస్వాగతం లభించింది. పర్యటనలో తొలి రోజున చంద్రబాబు పయొనీరింగ్ వెంచర్స్ చైర్మన్ రోన్ పాల్, చీఫ్ ఇన్వెస్టర్ ఆఫీసర్ సందీప్ రాజ్‌తో ద్వైపాక్షిక సమావేశంలో పాల్గొన్నారు. చంద్రబాబు మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో అత్యధిక దిగుబడుల సాధనకు టెక్నాలజీని వినియోగిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం 40 లక్షల ఎకరాల్లో ఉన్న ఉద్యాన పంటల సాగును కోటి ఎకరాలకు విస్తరించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. కొన్ని జిల్లాల్లో కరవు ప్రభావం ఉన్నప్పటికీ వ్యవసాయరంగంలో వృద్ధిరేటు పెరిగిందన్నారు. వర్షపాతం తక్కువ ఉన్నందున రెయిన్ గన్‌లు, మొబైల్ ఇరిగేషన్ వంటి రక్షణ చర్యలతో వ్యవసాయ రంగంలో రెండంకెల వృద్ధి సాధించినట్లు చంద్రబాబు చెప్పారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు దేశంలోనే తొలిసారిగా సెన్సార్లు, డ్రోన్‌లను వినియోగిస్తున్నట్లు చెప్పారు. ప్రతికూల పరిస్థితిల్లోనూ ఉద్యానరంగం 30 శాతం వృద్ధిరేటును నమోదు చేసినట్లు చెప్పారు. ఆక్వా రంగంలో చేపట్టిన చర్యల వల్ల దేశంలోనే ప్రథమస్థానంలో ఉన్నట్లు పయొనీరింగ్ వెంచర్స్ ప్రతినిధులకు వివరించారు. క్లస్టర్ల వారీగా ఉద్యాన రంగంలో పంటల సాగును ప్రోత్సహించటంతోపాటు పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామని, పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక రాయితీలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆహార శుద్ధి రంగంలో పెట్టుబడులు పెట్టే అంశాన్ని పరిశీలించాలని చంద్రబాబు పయొనీరింగ్ సంస్థను కోరారు. కుప్పంలో ఆహార శుద్ధి రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉంటే, అక్కడే చిన్న విమానాశ్రయాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ రంగంలో పెట్టుబడులపై పయొనీరింగ్ సంస్థతో సంప్రతింపులు జరిపే బాధ్యతను పరిశ్రమలశాఖ కార్యదర్శికి చంద్రబాబు అప్పగించారు. పయొనీరింగ్ వెంచర్స్ చైర్మన్ రోన్ పాల్ మాట్లాడుతూ పండ్ల తోటలు, పాడి పరిశ్రమ రంగాల్లో అగ్రగామిగా ఉన్న తమ సంస్థ ఏపీలో రూ.5 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఇప్పటికే కుప్పం, మహారాష్ట్రలోని నాందేడ్ ప్రాంతాల్లో రూ.వెయ్యి కోట్ల పెట్టుబడులు పెట్టినట్లు తెలిపారు.

పండ్లతోటల సాగు, కూరగాయల సాగుకు భారీగా పెట్టుబడులకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు రోన్ చెప్పారు. జ్యూరిచ్‌తో జరిగిన లెటర్ ఆఫ్ ఇండెంట్ సమావేశంలో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు, జ్యూరిచ్ ఆర్థిక వ్యవహారాల మంత్రి కార్మెన్, ఉప మంత్రి బ్యూన్ పాల్గొన్నారు. దావోస్ పర్యటనలో చంద్రబాబు వెంట ప్రభుత్వ సలహాదారు డాక్టర్ పరకాల ప్రభాకర్, ఐటీ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి నారా లోకేష్, సీఎం ముఖ్య కార్యదరద్శి జి.సాయిప్రసాద్, ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్, ఏపీ ఆర్థికాభివృద్ధి సంస్థ సీఈఓ జాస్తి కృష్ణ కిశోర్, పరిశ్రమలశాఖ కార్యదర్శి సాల్మన్ ఆరోఖ్యరాజ్, వ్యవసాయ సలహాదారు టీ విజయ్‌కుమార్ ఉన్నారు.

తీవ్రతరం (మొదటిపేజీ తరువాయి)

దమ్ము, ధైర్యం ఉంటే రాష్ట్ర విభజన బిల్లులోని సంక్షేమ ఫలాలపై కేంద్రాన్ని నిలదీయాలన్నారు. పోరాడితే సాధించలేనిది ఏమీలేదన్నారు. కేంద్రాన్ని అడగలేని చంద్రబాబు సుప్రీం కోర్టుకు మాత్రం మోడీని కాదని వెళ్లగలరా అని ఎద్దేవా చేశారు. రాష్ట్ర పునర్‌వ్యవస్థీకరణలోని అంశాలు ఏమిటి, రాష్ట్రానికి కేంద్రం చేసిందేమిటి అనేది శ్వేతపత్రం విడుదల చేయాలని రామకృష్ణ డిమాండు చేశారు.

విద్యావైద్య సంస్థల కోసం 11,674 కోట్ల రూపాయలు అవసరమని కేంద్రాన్ని కోరితే రూ.421 కోట్లను మాత్రమే ఇచ్చారని అన్నారు. అలాగే లోటు బడ్జెట్ అంశంలో రూ.16 వేల కోట్లు అవసరం ఉంటే రూ.7,500 కోట్లు మాత్రమే ప్రకటించి, 4 వేల కోట్లు ఇచ్చిందని విమర్శించారు. ప్రపంచ బ్యాంకు నుంచి అప్పు తెచ్చుకొని రాజధాని, నాబార్డ్ నిధులతో పోలవరం నిర్మించుకోమని కేంద్రం చెప్పటం రాష్ట్రంపై ఉన్న ప్రేమకు అద్దం పడుతుందని వ్యాఖ్యానించారు. కేంద్రం చేయాల్సిన అభివృద్ధి పనులు కూడా చేయటం లేదని అన్నారు. ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయం అన్న వెంకయ్యనాయుడు, చంద్రబాబు నాయుడు ప్యాకేజీ పేరుతో రాష్ట్ర ప్రజలను వంచించారని మండిపడ్డారు. ప్రత్యేక హోదాలోని అంశాల కోసం కొణతాల రామకృష్ణ ఈ నెల 27న రైలులో చేపడుతున్న దీక్షకు సంపూర్ణ మద్దతు తెలియచేస్తున్నట్లు ప్రకటించారు. ప్రతిపక్ష ఎంపీలను విమర్శించటం కాదని, టీడీపీ ఎంపీలతో రాజీనామా చేయించాలన్నారు. తెలంగాణ హైకోర్టు విభజనను సాధించుకున్న ఎంపీలను చూసైనా టీడీపీ ఎంపీలు బుద్ధి తెచ్చుకోవాలని ఎద్దేవా చేశారు. బడ్జెట్ సమావేశాల సమయంలో పార్లమెంటును స్తంభింపచేసేలా అన్ని రాజకీయ పార్టీలు ఒక్కటై భారీస్థాయిలో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక హోదా కోసం చేసే ఈ పోరాటం ఆఖరి పోరాటంగా, హోదా సాధించేదిగా ఉండాలన్నారు. సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, వైఎస్సార్ కాంగ్రెస్, లోక్‌సత్తా, న్యూడెమొక్రసీ, ఆమ్ ఆద్మీ, ఇలా ప్రతి పార్టీ, ప్రజాసంఘాలు, యువజన సంఘాలు, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలను కలుపుకొని మార్చి, ఏప్రిల్ మాసంలో భారీ స్థాయిలో సమితి వేదికగా అఖిలపక్ష పోరాటాలు చేస్తామని వెల్లడించారు.

అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలను ముఖ్యమంత్రి చంద్రబాబు మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వాన్ని స్తంభింప చేసి ప్రజల ఆకాంక్ష ఢిల్లీ వినపడేలా నిరసనలు, ఆందోళనలు చేయాలని పిలుపునిచ్చారు. రాజకీయ పక్షాలన్నీ ఏకతాటిపైకి వచ్చి దశల వారీగా ఉద్యమ కార్యాచరణ రూపొందించాలని అన్నారు. హోదా సాధన సమితి చేపట్టే ప్రతి పోరాటానికి సీపీఎం సంపూర్ణ మద్దతు తెలియ చేస్తుందని స్పష్టం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మల్లాది విష్ణు మాట్లాడుతూ టీడీపీ పాలనలో రాష్ట్రం పూర్తిగా వెనకబడిపోయిందని విమర్శించారు. టీడీపీ, జనసేన, బీజేపీలు రాష్ట్ర అభివృద్ధిపై ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించారని విమర్శించారు.

ప్రధాని మోడీకి ఇచ్చిన 16 పేజీల లేఖలో హోదా అంశం లేకపోవటం చంద్రబాబు ఆడుతున్న నాటకాలకు నిదర్శనమన్నారు. హోదా సాధన కోసం అఖిలపక్షంగా ఏ పోరాటాలు చేపట్టినా కలసి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. సమష్టి కార్యాచరణతో ముందుకు వెళ్లాలని సూచించారు.

కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వలి మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఆనాడు విభజన బిల్లులో పలు అంశాలు పొందుపరచామని, కానీ నేడు బీజేపీ, టీడీపీలు కాంగ్రెస్‌ని నిందిస్తూ విభజన అంశాలను విస్మరిస్తున్నారని ఆరోపించారు. ప్రత్యేక హోదా సాధన కోసం కలసి పోరాటం చేసేందుకు కాంగ్రెస్ ఎప్పుడూ సిద్ధంగా ఉందని చెప్పారు.

న్యూడెమొక్రసీ నాయకుడు పోలారి, రామారావు, ఆమ్ ఆద్మీ నాయకుడు రాము, లోక్‌సత్తా నాయకుడు శ్రీను తదితర నాయకులు ప్రత్యేక హోదా కోసం చేసే పోరాటాలకు తమ మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని, ఏఐవైఎఫ్ నాయకుడు అఫ్సర్, ఏఐఎస్‌ఎఫ్ నాయకుడు సుబ్బారావు, పీడీఎస్‌యూ నాయకులు రామకృష్ణ, రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

తీర్మానాలు

సీపీఎం రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వరరావు అఖిలపక్ష సమావేశంలో చేసిన తీర్మానాలను వివరించారు.

- విభజన బిల్లు అమలు చేయడంలో మోడీ అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరిని తీవ్రంగా గర్హించింది.
- ప్రత్యేక హోదా అంశాన్ని ముగిసిన అధ్యాయంగా ప్రకటించడాన్ని సమితి నిరసించింది.
- వెనకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమలకు నామమాత్రపు నిధులు కేటాయించి, విశాఖ రైల్వేజోన్, కడప స్టీల్ ఫ్యాక్టరీ, పోర్టు నిర్మాణాన్ని కేంద్రం విస్మరించటాన్ని తప్పుబట్టారు.
- విద్యావైద్య సంస్థల నిర్మాణానికి రూ.11,620 కోట్ల నిధులు కేటాయించాల్సి ఉండగా 421 కోట్ల రూపాయలు మాత్రమే విడుదల చేయటం, లోటు బడ్జెట్ విషయంలో రూ.16 వేల కోట్లు అడిగితే 7,500 కోట్లు మాత్రమే ప్రకటించి, 4 వేల కోట్ల రూపాయలే ఇవ్వడాన్ని సమావేశం నిరసించింది.
- రాజధానికి ప్రపంచ బ్యాంకు రుణం, నాబార్డు నిధులతో పోలవరం ప్రాజెక్టు నిర్మించుకోమన్న కేంద్రం వైఖరిని ఖండించింది.
- సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానన్న ముఖ్యమంత్రి వైఖరిని తప్పుబట్టింది. కేంద్ర మంత్రి వర్గంలో ఉన్న ఇద్దరు మంత్రులను మంత్రి వర్గం నుంచి ఉపసంహరించుకోవాలని కోరింది.
- రాష్ట్రానికి చేసిన విభజన హామీల అమలుపై శ్వేతపత్రం విడుదల చేయాలని సమితి డిమాండు చేసింది.
- విశాఖ రైల్వే జోన్, ఉత్తరాంధ్ర ప్యాకేజీ కోసం మాజీ మంత్రి కొణతాల చేస్తున్న 48 గంటల రైలు దీక్షకు మద్దతు తెలిపింది.
- ఈ విషయాలలో పార్లమెంట్‌ని స్తంభింప చేయాలని, కలసి పోరాటం చేయాలని విజ్ఞప్తి చేసింది.

విభజన హామీల సాధన కోసం కృషి చేయండి

సీఎం చంద్రబాబుకు కేవీపీ బహిరంగ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర పునర్విభజన హామీల సాధనలో పూర్తి జాప్యం నెలకొందని, ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు మేల్కొని కృషి చేయాలని రాజ్యసభ సభ్యులు కేవీపీ రామచంద్రరావు డిమాండు చేశారు. ఈ మేరకు సోమవారం సీఎంకు ఆయన బహిరంగ లేఖ రాశారు. విభజన చట్టం ప్రకారం పోలవరం ప్రాజెక్టు పూర్తి ఖర్చులను కేంద్రమే భరించాలని సూచించారు. ఈ ప్రాజెక్టులో ప్రభుత్వం జోక్యంతోనే జాప్యం కొనసాగుతోందని, కేంద్రం ప్రవేశపెట్టబోయే చివరి బడ్జెట్టులో పోలవరం, అమరావతి రాజధానికి నిధులు కేటాయించాలని సూచించారు. రాష్ట్రం నుంచి కేంద్రానికి అఖిలపక్షాన్ని తీసుకెళ్లి, విభజన హామీల సాధన కోసం సీఎం కృషి చేయాలని కోరారు. హామీల అమలులో రాష్ట్రానికి ఇప్పటివరకూ తలెత్తిన నష్టాన్ని టీడీపీ, బీజేపీ పార్టీలు పూడ్చలేవని, ఇప్పటికైనా మేల్కొని విభజన హక్కుల సాధన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు.



పర్యాటకరంగ అభివృద్ధికి సహకరించండి

విశాలాంధ్ర-ఆళ్ళగడ్డ (కర్నూలు): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రపర్యాటకరంగ అభివృద్ధికి సహకరించాలని పర్యాటకశాఖామంత్రి భూమా అఖిలప్రియ స్పెయిన్ ప్రభుత్వాన్ని కోరినట్లు టీడీపీ కార్యాలయవర్గాలు తెలిపాయి. అంతర్జాతీయ పర్యాటక నిర్వాహకులతోపాటుగా ఆమె స్పెయిన్‌లోని మాండ్రిడ్‌లో సాంప్రదాయపద్ధతిలో చీరకట్టుతో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె ఆంధ్రప్రదేశ్ పర్యాటకరంగం గురించి వారికి వివరించారు. పర్యాటక రంగ అభివృద్ధికి సహకరిస్తే రాష్ట్రపర్యాటక రంగం దేశంలో ముందంజలో ఉండే అవకాశాలు ఉన్నాయన్నారు. దీనిపై ఆయాదేశాల ప్రతినిధులు సానుకూలంగా స్పందించినట్లు పార్టీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.



చంద్రబాబు పాలనకు చమరగీతం పాడుదాం

దళితుల సమ్మేళన సభలో జగన్

విశాలాంధ్ర - బి.ఎన్.కండ్రిగ : గత ఎన్నికల్లో వాగ్దానాలు చేసి వాగ్దానాలు నెరవేర్చని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనకు చమరగీతం పాడుదాం అంటూ ప్రతిపక్ష నేత వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి విమర్శించారు. చిత్తూరు జిల్లాలోని ప్రజా సంకల్పయాత్రలో భాగంగా బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని చల్లమాంభాపురం గ్రామం నుంచి సోమవారం & రపజాసంకల్ప యాత్ర ప్రారంభించారు. యాత్రలో భాగంగా సత్యవేడు నియోజకవర్గ దళితులతో దళిత సమ్మేళన సభను పచ్చాలమ్మ కాలని వద్ద వైకాపా నాయకులు ఏర్పాటు చేశారు. ఈ సభకు సుమారు 10 వేల మంది హాజరయ్యారు. బుచ్చినాయుడు కండ్రిగ మండలానికి చెందిన రాష్ట్ర సంయుక్త కార్యదరి&శ ఆరణి విద్యానాథరెడ్డి సుమారు 6 వేల మందికి భోజనం, తాగునీటి సౌకర్యం కల్పించారు. జగన్ పర్యటనలో ఆయన ఏర్పాట్లు చేశారు. అనంతరం వైకాపా అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత జగన్మోహన్‌రెడ్డి దళితులతో ముఖాముఖిగా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారు చంద్రబాబు చేసిన మోసాలు గురించి ఏకరువుపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలను మోసం చేసిన చంద్రబాబు నాయుడుకి చమరగీతం పాడుదాం.. సమయం ఆసన్నమైందన్నారు. ఆయన మోసం చేయడంలో పరిశోధన శాస్త్రంలో పట్టభద్రులైనారు. ఈ నాలుగేళ్లలో అరాచకాలు పెరిగిపోయాయన్నారు. స్త్రీలకు భద్రత కరువైందన్నారు. తెలుగుదేశం నాయకులు అధికారుల మీద జులుం చూపుతున్నారని దుయ్యబట్టారు. ఆయనలా నేను మోసం చేయలేను. డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పరిపాలనలో అందరికి సంక్షేమ పథకాలు అందేలా ఆయన కృషి చేశాడు. కులమతాలకు అతీతంగా ఆయన అభివృద్ధి చేపట్టారు. ఈయనగారి పాలనలో అన్ని కక్ష సాధింపు చర్యలు చేస్తున్నారు. వైకాపా పార్టీకి ఓట్లు వేసిన ప్రజలకు అభివృద్ధి శూన్యం అని విమర్శించారు. ఇంటికో ఉద్యోగం లేదు, నిరుద్యోగ భృతి లేదు. మహిళలకు పొదుపు రుణాలు మాఫీ చేయలేదు. రైతులకు సక్రమంగా రుణ మాఫీ చేయకనే రైతుల అభివృద్ధికి పాటుపడుతున్నామంటూ రైతుల వెన్నెముఖ విరుస్తున్నారు మన ముఖ్యమంత్రి. రాష్ట్ర ప్రజల కష్టాలను గుర్తించిన నేను ప్రతి కన్నీటి చుక్కకు న్యాయం చేస్తాను. అందరూ నాకు సమానమే. నన్ను ఆదరించండి. శ్రీసిటి పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాను, మీకు భరోసా ఇస్తున్నాను. మీరు మోసపోవద్దు, వెక్కిరింపబడతారు. రానున్న ఎన్నికల్లో మనం పరిపాలన కొనసాగిద్దాం, మీ కష్టాలు తీరుతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నారాయణస్వామి, దళితుల రాష్ట్ర అధ్యక్షుడు నాగార్జున, తిరుపతి ఎంపి వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు గోపియాదవ్, గోపాల్‌రెడ్డి, సుజాత సుబ్రమణ్యం, గురునాథం, సత్యవేడు, వరదయ్యపాళెం, నాగలాపురం, పిచ్చాటూరు, కెవి.బి.పురం, తొట్టంబేడు వైకాపా నాయకులు హాజరయ్యారు. రాష్ట్ర నాయకులు కూడా ఆయన వెంట ఉన్నారు.

26 నుంచి 'దళిత తేజం - తెలుగుదేశం'

విశాలాంధ్ర-అమరావతి : రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 26 నుంచి దళిత వాడల్లో 'దళిత తేజం - తెలుగుదేశం' కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొత్తపల్లి శామ్యూల్ జవహర్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా దళితులకు పార్టీని మరింత చేరువ చేయనున్నామన్నారు. దళితవాడల్లో ఉన్న ప్రతి ఇంటికీ వెళ్లి, ఎస్సీల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న పథకాలను వివరించనున్నట్లు మంత్రి తెలిపారు. సచివాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ఆశయ సాధనకు సీఎం చంద్రబాబు విశేష కృషి చేస్తున్నారన్నారు. ఏప్రిల్ 20న విజయవాడలోని పవిత్ర సంఘమం వద్ద దళిత రాష్ట్ర మహాసభతో దళిత తేజం-తెలుగుదేశం కార్యక్రమం ముగుస్తుందన్నారు. టీడీపీ ఆవిర్భావంతోనే దళితులకు రాజకీయ ప్రాధాన్యత లభించిందన్నారు. అమ్మకు వందనం కార్యక్రమంతో బీఆర్.అంబేద్కర్ ను స్మరించుకునే అవకాశం కలిగిందన్నారు. మహిళలకు, దళితులకు ప్రాధాన్యత ఇవ్వాలంటూ బీఆర్.అంబేద్కర్ ఆనాడు హిందూ కోడ్ బిల్లు పెట్టగా, అది వీగిపోయిందని ,1983లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తరవాత అంబేద్కర్ ఆశయసాధనలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు మహిళలకు ఆస్తిలో సమాన హక్కులు కల్పించారన్నారు. మహిళలకు రాజకీయాల్లో 33 శాతం మేర రిజర్వేషన్లను సీఎం చంద్రబాబు కల్పించారన్నారు. పార్లమెంట్‌లో బీఆర్. అంబే ద్కర్ చిత్రపటం పెట్టడంలోనూ, ఆయనకు భారతరత్న ఇవ్వడంలోనూ టీడీపీ పాత్ర మరువ లేనిదన్నారు. అమరావతిలో 125 అడుగుల డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని స్మృతివనం పేరుతో సీఎం చంద్రబాబు ఏర్పాటు చేస్తున్నారన్నారు.

రేపు 'చలో పెదగొట్టిపాడు'కు రెడీ

- దళితులపై దాడి, సాంఘిక బహిష్కరణ దారుణం
- వామపక్ష, దళిత సంఘాల నాయకుల ముందస్తు అరెస్టులు దారుణం
- ప్రభుత్వం అడ్డుకుంటే దీటుగా ఉద్యమిస్తాం
- సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, పి.మధు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : గుంటూరు జిల్లా పెద గొట్టిపాడులో దళితులపై దాడులు, సాంఘిక బహిష్కరణల్ని నిరసిస్తూ ఈ నెల 24న చలో పెదగొట్టిపాడుకు వామపక్ష, దళిత సంఘాలు ఐక్యంగా సిద్ధమయ్యాయని సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, పి.మధు వెల్లడించారు.

సోమవారం విజయవాడ గవర్నరుపేటలోని సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్‌తో కలిసి వారిద్దరూ విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. సీపీఐ నేత రామకృష్ణ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై దాడులు పెరిగిపోతున్నాయని వాపోయారు. గరగపర్రు సంఘటనలో ఆ ప్రాంతానికి చెందిన టీడీపీ నేత రాజు పాత్ర ఉందని ప్రభుత్వానికి తెలిసినా ఇంతవరకూ ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఇటీవల కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గంలో దళితులపై పెత్తందారులు దాడులకు పాల్పడి సాంఘిక బహిష్కరణకు గురిచేశారని పేర్కొన్నారు. దాడులకు గురైన దళితులకు సంఘీభావం తెలిపేందుకుగాను వామపక్ష, దళిత సంఘాలు చేపట్టిన చలో పెదగొట్టిపాడును అడ్డుకునే చర్యల్లో భాగంగా ప్రభుత్వం పోలీసులతో ముందస్తు అరెస్టులకు దిగుతోందని, ఇవి రాజ్యాంగ విరుద్ధమని ఎద్దేవా చేశారు. శాంతియుతంగా తాము పెదగొట్టిపాడుకు వెళతామని, అడ్డుకుంటే అందుకు ధీటుగా లక్షలాది మందితో ఉద్యమిస్తామని అన్నారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదులో జాప్యం తగదన్నారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు మాట్లాడుతూ ఈ నెల ఒకటో తేదీన పెదగొట్టిపాడు దళితులపై ఆ గ్రామ పెత్తందారులు దాడులకు పాల్పడ్డారని, అప్పటి నుంచి సాంఘిక బహిష్కరణ అమలు చేస్తున్నారని చెప్పారు. దాడుల్లో గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండగా, ఒకరి కాలు తొలగించాలని వైద్యులు సూచించారని చెప్పారు. గ్రామంలో పెద్దఎత్తున పోలీసు పికెటింగ్‌లు నిర్వహిస్తూ దళితుల్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వాపోయారు. దళిత యువకుల విద్యుత్తు, సైకిల్ షాపుల కొనసాగింపునకు ఆటంకం సృష్టిస్తున్నారని చెప్పారు. దళితులకు పెత్తందారులు కౌలుకిచ్చిన భూమిని వెనక్కి తీసుకుంటామంటూ బెదిరింపునకు పాల్పడుతున్నారని వివరించారు. తాము తలపెట్టిన కార్యక్రమానికి ప్రభుత్వం ఆటంకం సృష్టిస్తే సహించబోమని, అందుకు ధీటుగా ఢిల్లీ, కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలతోపాటు ఏపీలోని 13 జిల్లాల నుంచి పెద్దఎత్తున గుంటూరుకు జనసమీకరణ చేపడతామని ప్రకటించారు. ఒంగోలులో దళితుల భూముల్లో పెద్దఎత్తున మట్టి తవ్వకాలతో పెత్తందారులు సొమ్ము చేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

దళితుల ఆత్మగౌరవంపై దాడి : మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్

మోడీ, చంద్రబాబు ప్రభుత్వాల హయాంలో దళితుల ఆత్మగౌరవంపై దాడులు కొనసాగుతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ ఎద్దేవా చేశారు. పెదగొట్టిపాడులో దళిత విద్యావంతుల్ని భయాందోళనకు గురిచేస్తూ గ్రామాల నుంచి తరిమివేసే చర్యలకు పాల్పడుతున్నారని వాపోయారు. చలో పెదగొట్టిపాడుకు పిలుపునివ్వడంతో ప్రభుత్వం కుట్ర పూరితంగా పోలీసులతో వామపక్ష, దళిత ఉద్యమకారుల్ని ముందస్తు అరెస్టు చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు.

రాష్ట్రాభివృద్ధిపై మోడీ, చంద్రబాబు సర్కార్ల వివక్ష

పీసీసీ అధికార ప్రతినిధి కొలనుకొండ శివాజీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రాభివృద్ధిపై ప్రధాని మోడీ, చంద్రబాబు సర్కారు వివక్షత చూపుతున్నాయని పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొలనుకొండ శివాజీ విమర్శించారు. విజయవాడ పీసీసీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నవ్యాంధ్రకు ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజన చట్టం హామీలను అమలు చేయకుండా మోడీ తీవ్ర అన్యాయానికి పాల్పడుతున్నారని ఆగ్రహం వెలిబుచ్చారు. చంద్రబాబు బలహీనతలే రాష్ట్రంపై మోడీ వివక్షత చూపడానికి కారణాలుగా నిలుస్తున్నాయని వివరించారు. రాబోయే ఎన్నికల్లో ఈ రెండు పార్టీలకు ప్రజలు బుద్ధిచెప్పడం తథ్యమన్నారు. ఈ సమావేశంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి నరహరిశెట్టి నరసింహారావు, విజయవాడ కాంగ్రెస్ ఎస్సీసెల్ చైర్మన్ పొదిలి చంటిబాబు పాల్గొన్నారు. తొలుత స్వాతంత్ర్య సమరయోధులు అయ్యదేవర కాళేశ్వరరావు జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి కాంగ్రెస్ నేతలు పూలమాలలేసి నివాళులర్పించారు.

పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-గుంటూరు జిల్లా పరిషత్ : రాష్ట్రంలో బీటీ విత్తనాలతో పత్తి పంట పండించి నష్టపోయిన రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు డిమాండు చేశారు. పత్తి పంట వేసి నష్టపోయిన రైతాంగానికి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండు చేస్తూ సోమవారం సీపీఐ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సమితిల సంయుక్త ఆధ్వర్యంలో గుంటూరు కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పాల్గొన్న ముప్పాళ్ళ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 15 లక్షల ఎకరాల్లో రైతాంగం బీటీ పత్తి విత్తనం విత్తారన్నారు. ముఖ్యంగా గుంటూరు జిల్లాలో మాన్‌శాంటో బీటీ-2 పత్తి విత్తనాలను విత్తిన రైతులు పూర్తిగా నష్టపోయారని అన్నారు. పంట ఏపుగానే పెరిగింది. కాయలు బాగానే కాశాయని, గులాబిరంగు పురుగు ఆశించి పత్తి నాశనమైపోయిం దన్నారు. అయితే పురుగును నిరోధించే శక్తి బీటీ-2 విత్తనాలలో లేకపోయినందున, పురుగు పత్తి కాయలలోకి చేరి కాయలను కబళించిందన్నారు. దీంతో ఎకరాకు 15 క్వింటాళ్ళ వరకు వస్తుందను కున్న దిగుబడి కేవలం 2 నుంచి 3 క్వింటాళ్ళకు మాత్ర మే పరిమితమైందన్నారు. వ్యవసాయ శాఖ పురుగును నివారించటానికి పలు రకాల మందులు వాడించి రైతాంగం పెట్టుబడిని మరింత పెంచింద న్నారు. దీంతో రైతులు ఎకరాకు రూ.50 వేల వరకు పెట్టుబడి పెట్టవలసి వచ్చింద న్నారు. కూలీ ఖర్చులకు కూడా రాక పెట్టుబడి తీర్చలేక రైతులు మరింత అప్పుల్లో కూరుకు పోయి కొట్టుమిట్టాడుతుంటే ప్రభుత్వ చోద్యం చూస్తోందన్నారు. ప్రభుత్వం ఒక బృందాన్ని ఏర్పాటు చేయాలని, ఆ బృందం రాష్ట్రమంతా పర్యటించి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.15 వేలు పరిహారం, క్రాఫ్ ఇన్సూరెన్స్ వర్తింప చేసేలా మాన్ శాంటో కంపెనీ, రాష్ట్ర ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్ మాట్లాడుతూ గులాబి రంగు పురుగు నివారించటానికి బీటీ-2 పత్తి విత్తనం వాడాలని మాన్‌శాంటో కంపెనీ రైతులను నమ్మించిందని, కాని ఆ విత్తనాలతో పురుగు నివారణ కాకపోగా మరింత పెరిగిపోయి పత్తి కాయలను పూర్తిగా కబళించిందన్నారు. దీంతో గుడ్డి పత్తి అయ్యి రేటు లభించక రాష్ట్ర వ్యాప్తంగా రైతాంగం పూర్తిగా నష్టపోయారన్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం పత్తి సాగు అంచనా వేసి అక్కడ రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చిందని, అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా పత్తి రైతులను ఆదుకొని, మాన్‌శాంటో కంపెనీపై క్రిమినల్ కేసులు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకునేది తెలుగుదేశమే ప్రభుత్వమే అని చెబుతోందని, కానీ ఆచరణలో మాత్రం విత్తన కంపెనీలను ఆదుకుంటుందన్నారు. నకిలీ విత్తనాలు అరికట్టడానికి చట్టాలు చేస్తామని చెబుతున్న ప్రభుత్వం నకిలీ విత్తనాలు అమ్మిన కంపెనీలపై ఏమి చర్యలు తీసుకుందో చెప్పాలన్నారు. పత్తి నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించకపోతే రాబోయే శాసన మండలి సమావేశాల్లో తమ ఆందోళన తెలియజేస్తామన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ పత్తి పంట వేసి రైతాంగం నష్టపోయిందని ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళితే స్పందించకపోగా చోద్యం చూస్తున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించాలని లేనియెడల రైతుల ఆగ్రహం చవిచూస్తారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తొలుత కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రదర్శనగా జిల్లా పరిషత్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం మీ కోసం కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కోన శశిధర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు మేకపోతుల శ్రీనివాసరెడ్డి, ముసునూరి రమేష్‌బాబు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెలుగూరి రాధాకృష్ణ మూర్తి, రైతు సంఘం నాయకులు పచ్చల సాంబశివరావు, కాబోతు ఈశ్వరరావు, సీపీఐ జిల్లా నాయకులు పులి సాంబశివరావు, సీపీఐ నాయకులు వేమూరి సుబ్బారావు, బి.వెంకటేశ్వరెడ్డి పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు, కె.వి.వి.ప్రసాద్, జంగాల అజయ్‌కుమార్



ప్రదర్శనగా వస్తున్న సీపీఐ, రైతు సంఘం నాయకులు



ఎమ్మెల్సీ యండపల్లిని అనర్హుడుగా ప్రకటించండి

విశాలాంధ్ర-అమరావతి : చిత్తూరు, నెల్లూరు, ఒంగోలు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులరెడ్డిని అనర్హుడుగా ప్రకటించాలంటూ టీడీపీ ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి సోమవారం శాసనమండలి కార్యదర్శి సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. అధికారులపై దౌర్జన్యం చేశారన్న కేసులోఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులురెడ్డికి ఈ నెల 12న గూడూరు కోర్టు శిక్ష విధించింది. శిక్ష పడినవారు ప్రజా ప్రాతినిధ్య చట్టం 8 ప్రకారం అనర్హులని, అందువల్ల యండపల్లి ఎమ్మెల్సీగా కొనసాగకుండా ఆయనపై వేటువేయాలని వారు కార్యదర్శికి ఇచ్చిన ఫిర్యాదులో కోరారు. న్యాయస్థానాలలో శిక్ష పడిన పలువురు ప్రజా ప్రతినిధుల కేసులను కూడా ఆ ఫిర్యాదులో ఉదహరించారు. దాణా కేసులో లాలూ ప్రసాద్‌యాదవ్, ఎంబీబీఎస్ సీట్ల స్కామ్ కేసులో రషీద్, రాజ్యసభ సభ్యులుగా మరో ఐదుగురు కూడా ఈ తరహాలోనే పదవులు కోల్పోయారని యండపల్లిపై ఎమ్మెల్సీగా పోటీ చేసి ఓడిపోయిన పట్టాభి రామిరెడ్డి, మరికొంతమంది నాయకులు పేర్కొన్నారు.

అరచేతిలో 'మన అమరావతి'

సమగ్ర సమాచారం కోసం సీఆర్‌డీఏ యాప్

విశాలాంధ్ర-అమరావతి : రాజధాని అమరావతి నిర్మాణా నికి భూములు ఇచ్చిన రైతులు సమగ్ర సమాచారం తెలుసుకునేందుకు ఏపీ సీఆర్‌డీఏ 'మన అమరావతి' పేరుతో ఒక యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. రాజధాని పరిధిలోకి వచ్చే 29 గ్రామాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అమరావతి ప్రాంత ప్రజలు తమకు కావాల్సిన సమాచారం పొందవచ్చు. రైతుసేవ, పౌరసేవలు, విచారణలు, సామాజిక ప్రయోజనాలు, ప్రతి స్పందన, సంప్రదింపులు యాప్‌లో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని అమరావతి ఉజ్వల భవిష్యత్తును యాప్‌లో వివరించే ఒక పేజీ ఉంచారు.

లాగిన్ అయ్యే విధానం

గూగుల్ ప్లే స్టోర్ నుంచి మన అమరావతి యాప్‌ను డౌన్ లోడ్ చేసుకోవాలి. మన అమరావతి యాప్ ఓపెన్ చేయటానికి యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌తో లాగిన్ అవ్వాలి. యాప్‌లో రిజిష్టర్ అవ్వాలి. పేరు, యూజర్ నేమ్, ఆధార్ నెంబరు, పాస్‌వర్డ్, ఫోన్ నెంబరు, ఈ-మెయిల్ ఐడీతో యాప్‌లో రిజిష్టర్ చేసుకోవాలి.

రుణమాఫీ వివరాలూ ఉన్నాయ్

రుణమాఫీ వివరాలూ యాప్‌లో ఉన్నాయి. రాజధాని ప్రాంతంలో రుణమాఫీ పొందిన గ్రామాల్లోని రైతులు వారి వివరాలు, రుణమాఫీ అర్హత.. ఎంత మొత్తం రద్దయిందనే వివరాలను రైతులు వెంటనే తెలుసుకునే వీలు ఉంది. మొదటి దశలో ఎంత మొత్తం రుణమాఫీ పొందామనే సమాచారం లభిస్తుంది.

కౌలు, పింఛన్ల వివరాలు

యాప్‌లో లాగిన్ అయ్యాక ఆధార్ నెంబర్ ఎంటర్ చేస్తే కౌలు వివరాలు ప్రత్యక్షమవుతాయి. రాజధానిలోని 29 గ్రామాల రైతులు ఈ సదుపాయం పొందటానికి వీలు ఉంది. నెల వారీగా భూమి లేని నిరుపేదలకు ఇచ్చే రూ.2500 పింఛన్‌ల వివరాలు వెంటనే లభ్యమవుతాయి



కొనుగోలు-అమ్మకాల వివరాలు

రైతులకు కేటాయించిన ప్లాట్ల విక్రయం, లీజు వంటి వివరాలు ఉంటాయి. అమ్మదలచిన, కొనదలచిన వారు నేరుగా యాప్‌లో ఉంచవచ్చు. ఇప్పటికే 50 ప్లాట్లు అమ్మకానికి ఉంచారు. జాయింట్ డెవలప్‌మెంట్ పేరుతో 8, 14 ప్లాట్లు లీజుకు అందుబాటులో ఉంచారు. ఏఏ గ్రామాల్లో ఎన్ని ప్లాట్లు అమ్మకానికి, లీజ్‌కు, జాయింట్ డెవలప్‌మెంట్‌కు ఉంచారనేది తెలుసుకోవచ్చు. లావాదేవీలు నిర్వహించుకోవచ్చు.

ప్లాట్లు, రిజిస్ట్రేషన్ కోసం..

ప్లాట్ రిజర్వేషన్ కోసం యాప్ తోడ్పడుతుంది. ఏ రోజు తమ ప్లాట్ ఏపీ సీఆర్‌డీఏ నుంచి రిజిస్టర్ చేసుకోవాలనుకుంటే అదే రోజు స్లాట్ బుక్ చేసుకోవచ్చు. సంబంధిత వివరాలు తెలుసుకోటానికి యాప్‌ను ఉపయోగించుకోవచ్చు. రాజధాని అమరావతిలో ప్లాట్ పొందిన వారు తమ ప్లాట్ కోడ్ తెలుసుకునే సౌలభ్యం ఉంది. ఆధార్ నెంబర్ ఎంటర్ చేస్తే ప్లాట్ మ్యాప్‌తో సహా మీ ప్లాట్ ఎక్కడ ఉందో తెలిసిపోతుంది.

ధ్రువీకరణ పత్రాల డౌన్‌లోడ్

యాప్ ద్వారా నమోదైతే ప్రాథమిక ధ్రువీకరణ పత్రం డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. నివాస, వాణిజ్య సంబంధిత పత్రం డౌన్‌లోడ్‌కు యాప్ పనికి వస్తుంది. గ్రామాల వారీగా సీఆర్‌డీఏ యూనిట్లు ఉన్న ప్రాంతాలకు చెందిన ఎల్.పి.ఎస్. లేఅవుట్లు యాప్ నుంచి పొందవచ్చు. ప్లాట్ల కేటాయింపు విధానం పూర్తి సమగ్ర వివరాలతో రేఖా చిత్రాలను, రైతులతో సంప్రదింపుల వివరాలను తెలుసుకునే వీలు కల్పించారు.

పౌరసేవల పేరుతో ఉన్న పేజీలో జోనల్ రెగ్యులేషన్స్, బృహత్తర ప్రణాళిక (మాస్టర్‌ప్లాన్), ఎలక్ట్రానిక్ ఎకంబరెన్సు, మీభూమి పోర్టల్‌లు పొందుపర్చారు. ప్రత్యేకించి ఆధార్ నెంబరు జత చేసి భూమికి సంబంధించిన వివరాలను తెలుసుకోవచ్చు. భూమి ఖాతాకు ఆధార్ నెంబరుతో జతచేసుకునే వీలు కల్పించారు.

ఎన్టీఆర్ క్యాంటిన్‌లు

ఎన్టీఆర్ క్యాంటిన్‌ల వివరాలు యాప్‌లోనే చూడవచ్చు తుళ్ళూరు, వెలగపూడి, ఐ.జి.సి. ఎన్టీఆర్ క్యాంటిన్‌లో అల్పాహారం, లంచ్ వివరాలు తెలుస్తాయి. క్యాంటిన్‌లో లభించే పదార్థాలు, వాటి ధరలను అరచేతిలో స్మార్ట్ ఫోన్ ద్వారా తెలుసుకోవచ్చు.

సామాజిక సేవలు

సామాజిక ప్రయోజనాలు అనే లోగోను క్లిక్ చేస్తే పింఛన్లు, ఉచిత ఆరోగ్యం, ఉపాధి శిక్షణ, ఉద్యోగం, ఉపాధి, గృహ నిర్మాణం, ఎన్టీఆర్ క్యాంటిన్ లోగోలు ఉంటాయి. పింఛన్ల సమాచారం కావాలనుకొనే వారు ఆధార్ నెంబరు ఎంటర్ చేస్తే చాలు. ఉచిత విద్య, ఆరోగ్యం పేరుతో ఉన్న పేజీలో ఉచిత విద్య, ఉచిత ఆరోగ్యపథకం వివరాలు లభిస్తాయి. శిక్షణ, ఉపాధి, ఉద్యోగం కోసం యువత హాజరుకావాలంటే యాప్‌లో ఉన్న పేజీలో తమ వివరాలు నమోదు చేసుకుంటే చాలు. ఇక అమరావతి గృహ నిర్మాణ పథకం వివరాలు కావాలంటే ఆ లోగోను క్లిక్ చేయాలి. నిరాశ్రయులైన వారు, ఇళ్లు లేని పేదలకు సొంత ఇంటి నిర్మాణం కోసం యాప్ ద్వారా సమాచారం వస్తుంది.

ఫిర్యాదులు.. పరిష్కారం

ముఖ్యంగా మన అమరావతి యాప్‌లో ఫిర్యాదులు చేయవచ్చు. ఏపీ సీఆర్‌డీఏలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా యాప్ ద్వారా గ్రీవెన్స్ పోర్టర్ నుంచి నేరుగా తమ ఇబ్బందిని తెలియజేసి పరిష్కారం పొందటానికి వీలు కలుగుతుంది.

దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన..

హెగ్డేను వెంటనే బర్తరఫ్ చేయాలి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కుల దురహంకారం,అధికార గర్వంతో దళితుల్ని శునకాలతో పోలుస్తూ వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి అనంత కుమార్ హెగ్డేను వెంటనే మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి(డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు సోమవారం డిమాండు చేశారు. మోడీ అండదండల్ని చూసుకుని మంత్రులు, నాయకులు రెచ్చిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి పదవులు పొందిన మంత్రులంతా దళితులపై ఈ తరహా వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. సమాజంలోని అందర్నీ గౌరవించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని, దళితులపై మానసికంగా, భౌతికంగా దాడులకు పాల్పడుతూ వారి ఆర్థిక మూలాలపై దెబ్బతీస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఇలాంటి వారంతా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు నమస్కరించడం వల్ల ఉపయోగమేమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు, మంత్రి ఆదినారాయణరెడ్డిలు సైతం దళితుల్ని చులకనగా మాట్లాడిన సందర్భాలున్నాయని పేర్కొన్నారు. పెద్దగొట్టిపాడు, నక్కలదిన్నె, జెర్రిపోతుపాలెం, దేవరపల్లి, గరగపర్రు తదితర ప్రాంతాల్లో దళితులపై అగ్రవర్ణాలు దాడులు, దౌర్జన్యాలకు పాల్పడ్డారని వివరించారు. దళితులంతా ఐక్యంగా ఉండి దళిత వ్యతిరేక ప్రభుత్వాలకు బుద్ధిచెప్పాలని సుబ్బారావు కోరారు.

సంపాదకీయం

అమెరికా అధ్యక్ష పీఠం అలంకరించిన ట్రంప్ సంవత్సర సంబరాల ఆనందం ద్రవ్య వినిమయ బిల్లు ఓటమితో ఆవిరైపోయి కంగుతిన్నాడు. భారతదేశ కాలమానం ప్రకారం శుక్రవారం అర్ధరాత్రి నుండి అత్యవసర సర్వీసులు మినహా ప్రభుత్వానికి చెందిన అన్ని సంస్థలు స్థంభించిపోయాయి. డెమోక్రాట్లతో జరిగిన రాజీ ప్రయత్నాలు విఫలమవడంతో ద్రవ్య వినిమయ బిల్లు అటకెక్కింది.

అమెరికా అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో యువతను, అమెరికన్లను రెచ్చగొడుతూ భారత, చైనా ఉద్యోగులు, మెక్సికన్లు, ముస్లిం దేశాలకు వ్యతిరేకంగా ట్రంప్ చేసిన జాత్యహంకార ప్రసంగాలు ముందరికాళ్లకు బంధంగా మారాయి. బరాక్ ఒబామా కాలంలో చేసిన కిందిస్థాయి ప్రజలకు, వలసదారులకు ఆరోగ్య బీమా సౌకర్యాలను కాలరాయడానికి ట్రంప్ సంకల్పించారు. ట్రంప్ ఏడాది పాలనలో జాత్యహంకారం తలకెక్కిన అరాచకవాదులు భారతీయులు, ఇతర దేశాలకు చెందిన వారిపై దాడులు చేస్తున్నా ట్రంప్ ఏమాత్రం గుణపాఠాలు తీసుకోలేదు. ప్రస్తుత ప్రతిష్టంభనకు అక్రమ వలసదారుల అంశమే రిపబ్లికన్‌లు, డెమోక్రాట్ల మధ్య రాజీ చర్చలకు అడ్డంకిగా మారింది. వలసదారుల పేరుతో ఒబామా తీసుకొచ్చిన రక్షణ బిల్లును ఎత్తివేయరాదని డెమోక్రాట్లు కోరినా ససేమిరా అని ట్రంప్ మొరాయించడంతో ద్రవ్య వినిమయ బిల్లు కొడిగట్టింది.

చట్టబద్ధత లేకుండా వలస వచ్చిన పిల్లలకు రక్షణగా ఒబామా ప్రభుత్వం చేసిన బిల్లులను ఆమోదించాలని డెమోక్రాట్లు పట్టుబట్టారు. వారికి చట్టబద్ధత కల్పించాలని, లేనట్లయితే 7 లక్షల మంది పిల్లల భవితవ్యం నాశనమవుతుందని పట్టుబట్టినా ఫలితం లేకుండా పోయింది. దానికి ప్రతిగా ఆ నిధులను మెక్సికో నుండి వలసలను ఆపడానికి గోడ కట్టాలన్న ట్రంప్ ప్రతిపాదనలను రిపబ్లికన్లు వల్లెవేయటంతో డెమోక్రాట్లు బిల్లును ఓడించారు. దీనిపై ట్రంప్ వారికి సైన్యం భద్రత, దక్షిణ సరిహద్దుల్లో మనకు ఎదురవుతున్న ప్రమాదాల కన్నా అక్రమ వలసదారులపైనే ఎక్కువ ఆందోళన ఉందని, వారు ప్రతిష్టంభనకే ప్రాధాన్యతనిచ్చారని చేసిన వ్యాఖ్య డెమోక్రాట్లను రెచ్చగొడుతున్నట్లుంది. ట్రంప్ పాలన కాలంలో జాత్యహంకార ప్రకటనలతో పెరిగిన నేరాలను ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో అప్రతిష్టపాలయ్యాడు. చివరకు తన పాలన స్థంభిస్తున్నా లక్ష్యపెట్టకుండా దావోస్‌కు పయనమవడం చూస్తే అమెరికా పరువు, ప్రతిష్టలు, ప్రజాసమస్యలు ఏమీ పట్టించుకోని అధ్యక్షుడుగా మిగిలిపోతాడు.

ట్రంప్ సర్కారు స్థంబనతో అన్ని వ్యవస్థలు పాక్షికంగా లేదా

ట్రంప్ విధానాలకు చెంపపెట్టు

పూర్తిగా ఇబ్బందుల పాలవుతాయి. అక్టోబరు 2013లో 16 రోజులు మూతపడితే ఉత్పత్తి రంగం 20 బిలియన్ డాలర్లు నష్టపోయింది. సాంవత్సరిక ఆర్థిక ప్రగతి రేటు 0.5 శాతం కోల్పోయింది. జీతాలు లేని సెలవుల కింద 8,50,000 మంది 6.6 మిలియన్ల శ్రామిక దినాలు కోల్పోయారు. పనిలేకుండా చెల్లించింది 2 బిలియన్ల డాలర్లు. ప్రైవేటు రంగంలో ఉద్యోగాలపై కూడా ఆ ప్రభావం పడింది. ద్రవ్య వినిమయ బిల్లు స్థంభించడంతో 2013లో రెండు వారాల్లో 1,20,000 ఉద్యోగాలకు గండిపడింది. మూడీస్ ఫరం రేటింగ్ అంచనా ప్రకారం ప్రజల మనోభావాలు ఉద్యోగాల సృష్టి, వినిమయ, కొన్ని రంగాలలో ఉత్పత్తి అక్టోబరులో అత్యంత నెమ్మదిగా పెరుగుదల ఉన్నట్లు సూచికలు తెలియజేశాయి.

ప్రస్తుత ప్రభుత్వ శాఖల స్థంభన ప్రభావం వందల వేల మంది ఉద్యోగులపై పడుతుందని, ప్రభుత్వ కార్యక్రమాలు నిలచిపోతాయని ట్రంప్ ఆర్థిక సలహాదారులు అంచనా వేస్తున్నారు. జాతీయ ఉత్పత్తి వారానికి 6.5 బిలియన్ డాలర్ల నష్టం జరుగుతుందని, ఆర్థికాభివృద్ధి రేటు 0.2 శాతం తగ్గుతుందని 'స్టాండర్డ్ అండ్ పూర్స్' సలహా యిచ్చింది. ఈ ప్రభావం కేవలం వాషింగ్టన్‌కే పరిమితం కాకుండా దేశం మొత్తంగా షాపింగ్ మాల్స్ నుండి జాతీయ పార్కులు, హోటల్స్, కాంట్రాక్టర్స్‌పై పడుతుందని యూఎస్ఏ ఆర్థికవేత్త బెత్‌ఆన్ బోవినో పేర్కొన్నారు. ఉద్యోగాల విషయంలో చాలా ఇబ్బందులు ఎదురవుతాయని 'గ్లోబల్ జాబ్ సెర్చ్ ఇంజన్' వ్యవస్థాపకుడు బెత్ అన్ బోవినో వ్యాఖ్యానించాడు.

అత్యంత క్లిష్ట పరిస్థితులున్నా ట్రంప్ వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సుకు దావోస్ వెళ్లాడంటే ట్రంప్ చిత్తశుద్ధిని శంకించవలసి వస్తుంది. ట్రంప్ రాజీ చర్చల్లో నిజాయితీగా లేడని, సెనేటర్ చూమర్, అతని సహచరులు విమర్శించారు. వలసవాద సమస్యల పరిష్కారానికి అవకాశాలున్నా ట్రంప్ వలసవాద వ్యతిరేక మితవాదుల ఒత్తిళ్లకు లొంగి వెనకడుగు వేశాడని దుయ్యబట్టారు. కాని ద్రవ్య వినిమయ బిల్లు ఆమోదించుకోవాలంటే డెమోక్రాట్ల మద్దతు తప్పనిసరి.

అయినా ట్రంప్ విధానాలు అమెరికా కార్పొరేట్ సంస్థలకు తలొగ్గే విధంగా ఉన్నాయి తప్ప విదేశాల నుండి వలస వచ్చి ఉద్యోగులపై చేసే దాడి, ఉద్యోగాలన్నీ అమెరికన్లకే ఫస్ట్ అన్న నినాదాలు వాగాడంబరమేనన్నది సంవత్సర పాలన రుజువు చేసింది. ఈ విధానాలు భవిష్యత్‌లో అమెరికాకు చేటు కలిగించడమేగాక ప్రజల నుండి మరింత వ్యతిరేకతను ట్రంప్ మూటగట్టుకోక తప్పదు.

చురక

అమెరికాలో వలసలకై
ఆగిపోయె వ్యయ బిల్లు
నిధులు రాక ప్రభుత్వం
నిశ్చేష్టపు జవసత్వం

అగ్రరాజ్య అధ్యక్షులు
ఐతేనేమి ట్రంపుగారు
స్వయంకృత పొరపాట్లతో
సంక్షోభాల కంపే జోరు

– వేల్పుల నారాయణ

సందర్భం

కార్యాచరణపథంలో జిన్‌పింగ్

అక్కినేని చంద్రరావు

తన 19వ మహాసభ తరువాత, చైనా కమ్యూనిస్టు పార్టీ తీసుకుంటున్న నిర్ణయాలు, పార్టీ నాయకత్వం ఇచ్చే ప్రకటనలు నూతన తరహాలో పార్టీ నిర్మాణానికి తమ కార్యాచరణను ప్రారంభించాయి. ఇతర సోషలిస్టు దేశాలలో అమలు జరుగు తున్న ఆయా పార్టీల నిర్మాణ నియంత్రణలన్నీ, వాటి స్థానిక సామాజిక, ఆర్థిక, రాజకీయ చట్రంలో భాగంగానే ఉన్నాయి. అవి మార్క్సిజం-లెనినిజం వెలుగులోనే. తమ కార్యాచరణను ఎప్పటికప్పుడు రూపొందించుకుంటూ, పార్టీ యంత్రాంగాలకు నూతన జవసత్వాలను అందిస్తూనే ఉన్నాయి. సోషలిస్టు దేశాలలో నిరంతరం జరిగే ప్రక్రియలో ఇదొక భాగం.

పెట్టుబడిదారీ దేశాలలోని కమ్యూనిస్టు, వర్కర్సు పార్టీలు కూడా మార్క్సిజం-లెనినిజం శిరోధార్యంగా తమ నిర్మాణాన్ని కొనసాగిస్తున్న అనుభవం మనకు తెలిసిందే. అయితే వివిధ దేశాలలో ఆయా పార్టీల పోరాట పటిమ, కార్యాచరణకు లోబడే పార్టీ నిర్మాణాలు ఆధారపడతాయి. ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంలో కమ్యూనిస్టు పార్టీల నిర్మాణాలు గూర్చి లెనిన్ రూపొందించిన సూత్రీకరణలే నేటికీ అమలులో ఉన్నాయి. పార్టీ నిర్మాణానికి సంబంధించిన లెనిన్ సూత్రీకరణలు సార్వత్రిక నియమాలుగానే అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం ఏనాడో గుర్తించింది. చైనా కమ్యూనిస్టు పార్టీ కూడా తన నిర్మాణంలో లెనిన్ సూత్రీకరణలనే శిరోధార్యంగా భావించి అమలుజేస్తున్నది.అయితే ఒకనాటి సోవియట్ కమ్యూనిస్టు పార్టీ కూడా ఇదే నిర్మాణ సూత్రీకరణలను తనకు అత్యంత ప్రామాణిక సూత్రాలుగా స్వీకరించింది.

రష్యాలో విప్లవం జయప్రదం కావటానికి, ఆర్థిక, సామాజికరంగంలో ప్రపంచానికి ఆ పార్టీ యిచ్చిన స్ఫూర్తికి సోషలిస్టు నిర్మాణ పునాదికి దాని పార్టీ నిర్మాణమే మొదటి గ్యారంటీ. అయితే లెనిన్ నిర్మాణ సూత్రీకరణల నుండి అది ఎప్పుడు ప్రక్కమార్గం పట్టిందో, దాని పతనాన్ని కొనితెచ్చు కుంది. పెట్టుబడి దారీ విధానంపైనను, ఫాసిజంపైనా అది సాధించిన విజయాల పరంపర, దాన్ని "ప్రపంచశాంతి రక్షకుడి"గా ప్రపంచం కీర్తించింది. ఈ కీర్తిని నిలుపుకోలేక పోవటం, దాని నిర్మాణ బలహీనతే. అయితే ప్రపంచానికి తెలియకుండా దీన్ని కప్పిపెట్టటం అన్నిటికీ మించిన బలహీనత.నమ్మశక్యం కాని దాని పతనానికి కారణాలు అనేకం ఉండి ఉండవచ్చు. దాచిపెట్టుకున్న బలహీనతలు, ఆధిపత్యం కేంద్రీ కృతం, ఏకపక్ష ప్రజాస్వామ్యం, అర్హతలేని స్థానాలు పొందటం, పదవీ వ్యామోహం, ధనవ్యామోహం, యింకా చెప్పాలంటే నాయకత్వం యావత్తు పార్టీ యంత్రాంగానికి, ప్రజలకు, పార్టీ సిద్ధాంతానికి దూరంగా జరిగితే జరిగే విపత్తులే యివన్నీ. ఇది హఠాత్తుగా జరిగిన పరిణామంగా మాత్రం భావించటానికి వీల్లేని సంఘటన. కేవలం పార్టీ నిర్మాణం, తన నియమాలనుండి దారి తప్పటమే.

సోవియట్ పతనం గడిచిన చరిత్రగా మరుగునపడే విషయం కాదు. మార్క్సిజం-లెనినిజం ముగిసిపోయిన శకంగా, దాని వ్యతిరేకశక్తుల "గాలి ప్రచారానికి" యిది అవకాశంగా దొరికింది. ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమానికి యిదొక సవాలుగా ఎదురయింది. దీన్ని స్వీకరించటంలో రష్యన్ కమ్యూనిస్టు పార్టీయే ప్రధాన బాధ్యత తీసుకోవాలి. సోవియట్ పతనానికి ముందు తరువాత జరిగిన దాని నిర్మాణ రాహిత్యపోకడలన్నీ పునరావృతం కాకుండా అది తనంత తానుగా, "ఆత్మవిమర్శ" చేసుకోవాల్సిందే. ప్రపంచం యావత్తు ముఖ్యంగా కమ్యూనిస్టులు, ఒకనాటి సోవియట్ అభిమానులు దీన్ని అవసరంగా భావిస్తున్నారు. అది తిరిగి తన ప్రాభవం పొందాలన్నదే వారి వాంఛ. యిది నెరవేరే దిశగా ఆలోచిం చాలి. ఇటీవల సోవియట్ యువ మహిళ ఇవానో మాలెంకో తన గ్రంథం 'సోవియట్స్‌కా' (1500 పేజీలు) ద్వారా ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమానికి గొప్ప స్ఫూర్తినిచ్చే సందేశాన్ని పంపింది. రష్యా ప్రజలు ఏం కోల్పోయారో దాన్ని తిరిగి పొందాలన్నదే ఆమె గ్రంథ ప్రయత్నం. లోపాలు ఎక్కడ జరిగాయో, వాటిని సవరించుకోవటానికి ప్రజలు కూడా పూనుకుంటారన్న విషయాన్ని కమ్యూనిస్టులు ఇలాంటి సందర్భాల్లో గమనంలోకి తీసుకోవాలి. జారుల బందిఖానాలో మగ్గిన ప్రజానీకం, మరొక



బందిఖానాను మాత్రం కోరుకోరు. ఏ సోషలిస్టు వ్యవస్థ తమకు రక్షణనిచ్చిందో దానికొరకు, మళ్ళీ ప్రయత్నాలు ప్రారంభిస్తారు. ఈ ప్రయత్నాలను ముందుకు నెట్టటమే, రష్యా కమ్యూనిస్టుల ప్రధాన కర్తవ్యం. దీనికి ప్రజాకార్యాచరణే సిసలైన మార్గంగా నేటి ప్రపంచానుభవం చెబుతున్నది. లెనిన్ నిర్మాణ సూత్రాలకు మాత్రం ఈక్రమంలో మినహాయింపు ఉండకూడదు. 1917లో ప్రారంభమయిన ప్రపంచ సోషలిస్టు విప్లవ విజయం, దాని 1990 నాటి పరా జయాన్ని అధిగమించాలి. ఏది కార్యాచరణకు అనవసరమో, ఏది పనికిరాదో దాన్ని మినహాయించుకుంటూ రావాలి.

జిన్‌పింగ్ చెబుతున్న "కార్యాచరణలేని మాటల మినహాయింపులు" అన్నీ పాత అనుభవాలను గూర్చి చేస్తున్న హెచ్చరికలే. కమ్యూనిస్టు పార్టీలకు భవిష్యత్ నిర్మాణాలు. లెనిన్ సూత్రీకరణల పరిధిలోనే నూతన అవకాశాలను అందిపుచ్చు కోవాలన్నదే నేటి చైనా కమ్యూనిస్టు పార్టీ తన ప్రధాన కర్తవ్యంగా ఆచరణలో పెట్టింది.రాజకీయ, ఆర్థిక, సామాజిక సైద్ధాంతిక రంగాల్లో అది దేశంలోనూ, బయటకూడా నిరంతరం పోరాటం చేస్తూనే ఉన్నది. ప్రాథమిక దశలో ఉన్న సోషలిస్టు ఆర్థిక వ్యవస్థను పెట్టుబడిదారీ విధానంతో సమన్వయపర్చటం, అది సాహ సమైన ప్రక్రియ అయినప్పటికీ, అది చైనా భౌతిక (మానవ) అవసరాలకు అనివార్యంగా ముందుకు వచ్చింది. ఈ కఠిన మయిన మార్గాన్ని అమలు చేయటంలో సోషలిస్టు ఆర్థిక క్రమాన్ని రక్షించటానికి చైనా నాయకత్వం ప్రధానంగా ఎంచు కున్న ఆయుధం మార్క్సిజం-లెనినిజం సిద్ధాంతవరవడి. చైనాకు ఏ సమయంలో ఏది అవసరమో దాన్ని నిర్ణయించు కొని, సోషలిస్టు క్రమాన్ని ముందుకు నెట్టటమే తన వ్యూహంగా సి.పి.సి. నిర్ధారించింది.

దీనికి ఎదురయ్యే రెండు ప్రమాదాలను చైనా బాహాటం గానే చెబుతున్నది. 1) సోషలిస్టు ఆర్థిక విధానాన్ని- పెట్టుబడిదారీ విధానంతో సమన్వయం చేయాల్సిరావటం వల్ల, పెట్టుబడిదారీ కంపెనీలు వాటి సహజ రుగ్మతల ద్వారా చైనా ప్రజానీకాన్ని, పార్టీ యంత్రాంగాన్ని, ప్రభుత్వాన్ని ప్రభావితం చేసే ఎత్తుగడల ప్రమాదం. 2) దాదాపు 8 కోట్ల 80 లక్షల మంది పార్టీ సభ్యులు, 140 కోట్ల మంది ప్రజానీకం, వాటి నిర్మాణాల్లో చోటుచేసుకునే స్వార్థపూరిత వ్యక్తులు, శక్తుల ప్రమాదం.

ఎదురుగా కనబడుతున్న వాస్తవ పరిస్థితిని, ఏమాత్రం మినహాయించకుండా, సందేహించకుండా, ఎప్పుడైతే చైనా నాయకత్వం బాహాటంగా చెప్పిందో, అప్పుడే అది తన సోషలిస్టు ఆర్థిక క్రమంలో మొదటి విజయానికి ముందడుగు వేసినట్లే. కీ.పూ. 10వ శతాబ్దంనాటి చైనా యుద్ధతంత్ర రాజ నీతిజ్ఞుడు సున్-జు చెప్పినట్లు "ఎదురుగా ఉన్న ప్రమాదాన్ని సరిగా అంచనా వేసినవాడే విజయానికి మార్గం వేయగలడు".

తన పార్టీ నిర్మాణానికి సంబంధించి, చైనా నాయకత్వం వద్ద దాపరికానికి అవకాశంలేదు. సి.పి.సి. 19వ మహాసభ దీనికి మరింతగా అద్దం పట్టింది. చైనా ఎదుర్కొంటున్న ఈ రెండు ప్రమాదాలను అధిగమించటానికి చైనా కమ్యూనిస్టు పార్టీ చేపట్టిన ప్రధానకర్తవ్యం, అది అన్ని రంగాల్లోనూ ప్రజాప్రాతి నిధ్యాన్ని, ప్రజా నిఘాను పెంచింది. ప్రభుత్వం, పార్టీ వీటి యంత్రాంగాలన్నింటిని ప్రజా పర్యవేక్షణకు సంగమం చేసింది. చివరకు పార్టీ సభ్యుడిగా నమోదు కాబడేవారు ముందుగా వారివారి ప్రాంతాల్లో ప్రజా మోదాన్ని కూడా పొందాల్సిన అవసరాన్ని అది అన్ని పార్టీశాఖలకు నిర్దేశించింది. లెనిన్ సూత్రీకరణలను ఆమోదించే పార్టీ సభ్యుడు ముందుగా సమాజం అతని విలువలను గుర్తించాల్సి ఉంటుంది. పార్టీ నిర్మాణాన్ని నిరంతరం కట్టుదిట్టంగా నడపటానికి చైనా తన రాజ్యాంగంలో "భద్రతా చట్టాలను" తీసుకురావటంలో అది ఏమాత్రం వెనుకాడలేదు.

జిన్‌పింగ్ చెబుతున్న అత్యంత ప్రామాణికమయిన విషయం ఏమిటంటే, "చైనా సోషలిజం, కోట్లాది చైనా ప్రజలు వారి భవిష్యత్తు, చైనా కమ్యూనిస్టు పార్టీమీద, దాని నైతిక ప్రమాణాలు, నిబద్ధత దాని నాయకత్వం మీద ఆధారపడి ఉంది. మార్క్సిజం-లెనినిజం వెలుగులో అది నడుస్తున్నది. మానవుడి ప్రాథమిక అవసరాలయిన తిండి, బట్ట, వసతి, పని, విద్య, వైద్యం లాంటి వాటిని చైనాలో యిస్తున్నట్లుగా ప్రపంచంలోని అన్ని దేశాలలోనూ యిది నెరవేరాలన్న ఆకాంక్షతో "మానవ సంక్షేమం" కేంద్రంగా చైనా కమ్యూనిస్టు పార్టీ నడవాలి". ప్రపంచ జనాభాలో మొదటి స్థానంలోనూ, ఆర్థిక రంగంలో రెండవ శక్తిగానూ నడుస్తున్న చైనాలో కమ్యూనిస్టు పార్టీ నడక ఏమాత్రం గాడితప్పినా ప్రపంచ వ్యవస్థల భవిష్యత్తు ప్రమాదంలో పడినట్లే. చైనా పార్టీ నాయకత్వం ఆలోచనలన్నీ "మానవాళి భవిష్యత్తు" కేంద్రంగానే నడుస్తుండడం లెనినిస్టు పార్టీ నిర్మాణ సూత్రాలకు పదును పెట్టటమే.ఏ దేశ కమ్యూనిస్టుపార్టీ అయినప్పటికీ పార్టీ నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యతను యివ్వాలన్నదే జిన్‌పింగ్ సూచన. అధికారం ఉన్నా లేకపోయినా అది లెనిన్ వరవడినుండి పక్కకు మళ్ళితే మళ్ళీ అవకాశాన్ని దక్కించుకోవాలంటే అది దశాబ్దాల తరబడి నడుస్తూ వెళ్ళాల్సి ఉంటుంది. మార్క్సిజానికి చేరువుగా ఉండే శాస్త్రవిజ్ఞానం అభివృద్ధి చెందిన నేటి దశ కమూనిస్టులకే సొంతం కావాల్సి ఉంది. ఈ వాస్తవానికి చేరువ కావాలంటే కమ్యూనిస్టులు అశాస్త్రీయ పోకడలను వాటి నిర్మాణంలో మినహాయించాలి. భారతదేశంలో కమ్యూనిస్టులకు ఇది మరింత అవసరం కావచ్చు. కార్యాచరణ ఒక్కటే దీనికి మార్గం. మార్గంలో మినహాయింపుల అవసరం ఎప్పుడూ ఉంటుంది.

వి-మెయిల్

పథకాలు పక్కన బెట్టి ఉపాధి కల్పించండి

డెబ్బై వసంతాలు దాటిన స్వతంత్ర భారతంలో నిరుద్యోగం వేళ్ళూనుకున్న మహావృక్షంలా పెరిగిపోవ డానికి పాలక వర్గాల నిర్లక్ష్యమే కారణం. ఉత్పత్తి, ఉపాధి కల్పనల పట్ల నిర్లక్ష్య ధోరణి నిరుద్యోగ భారతావనికి నిలువెత్తు ఆవిష్కరణ చేసింది. అన్ని వృత్తుల్లోనూ, ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు మెరుగుపరచి ప్రైవేటీకరణ దిశగా వెళ్ళకుండా సంస్థలు నిలబడే విధంగా రాయితీలు కల్పించి, ఆర్థిక పునాదులను పటిష్టం చేసి ఉద్యోగావ కాశాలను పెంపొందించాలి. సహేతుకమైన కారణా లపై దృష్టిపెట్టకుండా ప్రతి ఐదేళ్ళ కొకసారి వచ్చే ఎన్నికల సమయంలో ఖజానాకు గుదిబండల్లాంటి ఉచిత పథకాలను ప్రకటించి, క్షేత్రస్థాయి అమలులో చేతులెత్తేసి పథకాలు లబ్ధి పొందడం కోసమే ఈ ఐదేళ్ళు ప్రజలందరినీ ఆశగా తమవద్దకు తిప్పుకుంటూ మళ్ళీ ఎన్నికల రణ క్షేత్రానికి తీసుకెళ్తున్నారు. నోటుకు వోటేసి నోరు మెదపలేని స్థితిలో ఎక్కువశాతం ఓటర్లు ఉంటున్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు రావడం, తప్పని సరిగా ఓటేయాలని చెప్పడంలో ఉన్న శ్రద్ధ వారికి ఉద్యోగ హక్కులు కల్పించడంలో లేదు. గ్రామీణ ప్రాంతాల్లో కుంటుబడి పోతున్న చేనేత రంగానికి సరైన ప్రోత్సాహకాలు లేవు. వ్యవసాయ రంగం ఇతరత్రా కుల వృత్తులకు వందశాతం ప్రోత్సాహకాలు ప్రకటించి వాటి ఉత్పత్తుల అమ్మకంలో దళారీలను నియంత్రించి యువతకు భాగస్వామ్యం కల్పిస్తే చాలామందికి ఉపాధి లభిస్తుంది. రిజర్వేషన్ల ప్రాతిపదికే కొలమానంగా కాకుండా ఆర్థికంగా వెనుకబడిన వారిని కూడా గుర్తించి ఉపాధి కల్పించాలి. ప్రతియేటా పథకాల జోరు పెంచుకుంటూ బడ్జెట్‌లో అంకెల గారడీ చేసి అంతా ఉచితమంటే కష్టపడే యువత కరువైపోతుంది. పథకాలు పొందలేని తటస్థుల పరిస్థితి ఏమిటి? యువతకు శ్రమపడే తత్వం కలగాలంటే పథకాలలో వారికి కొంతవరకు మాత్రమే భాగస్వామ్యం కల్పించాలి. పెద్దరికం కాకుండా పేదరికం మాత్రమే పథకాలను పొందగలగాలి. ఒక వైపు ఉద్యోగార్హత వయస్సు పెంచుతూ, రిటైర్‌మెంట్ వయస్సు తగ్గించడం, 45 సంవత్సరాలకే పెన్షన్లు ప్రకటించే ఆలోచన లాంటివాటితో వారు నిబద్ధతతో ఉద్యోగం ఎంతకాలం చేస్తారు. మన దేశంలో తయారవుతున్న మెరికల్లాంటి విద్యార్థులు ఇక్కడ ఉపాధి అవకాశాలు లేక, సరైన జీతాలు లేక విదేశాల దారి పడుతున్నారు. వారి తల్లితండ్రులు ఒంటరితనం బారిన పడుతున్నారు. జనాభా లెక్కలు వేసినట్లు, లేక ఓటర్ల లిస్టు తయారు చేసినట్లే కనీస డిగ్రీ కలిగిన విద్యార్థులను ప్రతి ఇంట్లోను గుర్తించి వారికి గుర్తింపు కార్డులను జారీచేసి, కనీస ఉపాధికల్పించే బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలి. రాజకీయాల్లో అతి చిన్న ఎన్నికల్లో గెలిచినా వెంటనే పదవికోసం ఆరాటపడుతన్న సందర్భం చూస్తున్నాం. కానీ చదువుకున్న వాళ్ళు ఎన్ని సంవత్సరాలు పెద్దలకు భారంగా మిగిలినా పట్టించుకునే వాళ్ళే లేరు. పార్టీలైతే మార్చుకోవచ్చు కానీ చదువుకున్న సర్టిఫికెట్లు మార్చుకోలేరుకదా? సంవత్సరాల తరబడి ఆర్డినెన్స్‌లు తీసుకు రాకుండా అనేక శాఖల్లో ఉన్న ఖాళీలను భర్తీచేయడం, ఖజానాకు భారమైన పథకాలను క్రమేణా తగ్గించేయడం చేయాలి. కాలం చెల్లిన కమీటీలు ఇచ్చే రిపోర్టుల ఆధారంగా పరిపాలన సాగడం ప్రజలందరికీ న్యాయం జరగదు. ఫీజు రీయింబర్సెన్స్, నిరుద్యోగ భృతి, అనేక రకాలైన రుణ మాఫీలు, రకరకాల సబ్సిడీలు, ఇవన్నీ ప్రభుత్వానికి గుదిబండలు. అనేక రకాల రిజర్వేషన్లు, పథకాల వల్ల లబ్ధిపొంది ఆర్థికాభివృద్ధి సాధించి, ప్రతి ఇంట్లో ఇద్దరు ముగ్గురు ఉద్యోగస్థులు ఉన్న చాలామంది సంవత్సరాల తరబడి ప్రభుత్వ పథకాలను అనుభవిస్తూనే ఉన్నారు. దాన్ని అరికట్టలేక పోవడం పెద్ద వైఫల్యం. అగ్రకులాలుగా చెప్పుకునే ఎంతోమంది అన్నమో రామచంద్రా అంటున్న కేకలను కూడా పట్టించుకోవాలి. నేటికి కార్డుకు నోచుకోనివాళ్ళు కూడా ఎంతో మంది ఉన్నారు. చౌక డిపోలన్నిటిని మూలవేసి మాల్స్‌కు మాలవేశారు. ఏ వ్యవస్థలో ఏ మార్పుతీసుకొచ్చినా మంచిదే కానీ ప్రజలకు ఉపయోగపడని మార్పులు ప్రయోజనంలేదు. పథకాల ఫ్రీ సంస్కృతి మాత్రం భవిష్యత్తు వ్యవస్థకు మంచిది కాదు. ప్రభుత్వం యువతను భాగస్వామ్యం చేయడమంటే వాళ్ళను పార్టీ మీటింగులకు, సభలకు తరలించడం కాదు. ప్రభుత్వ ఆదాయంలో వారికి ఉద్యోగరూపంలో వాటా కల్పించడం. పాలకులకు చిత్తశుద్ధి ఉంటే ఇది ఏమంత కష్టం కాదు. అధికారమే పరమావధి అనుకున్న సంస్కృతి వేళ్ళూనుకున్న నేటి వ్యవస్థలో ఎవరి సలహాలకు, సూచనలకు పెద్ద విలువలేక పోవడం దురదృష్టం. ఏది ఏమైనా యువతరాన్ని ఉద్యోగ భద్రతతో సరైన మార్గంలో నడిపించే పాలకులు కరువైతే భవిష్యత్తులో అభివృద్ధి దిశగా అడుగులు ముందుకు పడవనేది నగ్నసత్యం.

– జోస్యుల వేణుగోపాల్

కమలం దగా..పగా..!

బి.బాబు బహదూర్

పెద్ద పెద్ద శోకాలు వినిపించి ఏడూళ్ల సూరిగాడు ఉలిక్కిపడి లేచాడు.

'చావు..చావు' ఫకీర్‌గాడు అరుస్తున్నాడు.

"దుర్గని కొడుతున్నట్టున్నాడు",అనుకుని ఉదుటున లేచి ఫకీర్‌గాడి గుడిశె దగ్గరకు సూరిగాడు పరుగుతీశాడు. అప్పటికే దుర్గ సోయలేకుండా పడిపోయింది.

"అరే ఆగరా... చంపేస్తావా"? అంటూ ఫకీర్‌గాడిని పక్కకు తోశాడు.

"చంపాలా పాతరేయాలా"?ఫకీర్‌గాడు రొప్పుతున్నాడు. కుండపక్కన చెంబులో నీళ్లతీసుకుని దుర్గ ముఖం మీద సూరిగాడు చల్లాడు. కాసేపటికి లేచి ఫకీర్‌గాడి వైపు భయంభయంగా చూస్తోంది. సూరిగాడి వెనక్కి నక్కింది. మళ్లీ తన్నటానికి ఫకీర్‌గాడు కాలెత్తాడు. సూరిగాడు ఆగలేక పోయాడు.

"ఏంరా తమాషాగా ఉందా? ఇంటి ఆడదాన్ని ఇష్టమొచ్చినట్టు కొడితే చూస్తు ఊరుకుంటామా? తాట తీసేస్తా, జాగ్రత్త"? సూరిగాడు కళ్లురిమాడు.

అది కాదండి..ఇది ఇది...ఫకీర్‌గాడు పటపట పళ్లు కొరికాడు.

"చాల్లే... అసలేం జరిగింది"? సూరిగాడు అడిగాడు. ఫకీర్‌గాడు మాట్లాడలేదు.

"నువ్వన్నా చెప్పు" దుర్గవైపు సూరిగాడు చూశాడు. దుర్గ ముక్కు చీదింది. కాసేపు ఎవరూ మాట్లాడలేదు. ఫకీర్‌గాడు తాగలేదు. అయినా ఎందుకు గొడవ పడుతున్నాడో సూరిగాడికి అర్థం కాలేదు. "దుర్గ ఏదైనా పొరబాటు చేసిందేమో" అని మనసులో అనుకున్నాడు.

"ఏమైందిరా? ఈ మధ్య బాగానే ఉన్నారుగా? చిలకాగోరింకల్లా సినిమాలు గట్రా చూసొచ్చారుగా? పనికి వెళ్తున్నారు. చేతిలో డబ్బులు బాగానే ఆడుతున్నాయిగా, పిల్లల్ని కాన్వెంట్‌లో చదివిస్తున్నారు. బైకు కొన్నావ్. ఇంట్లో కలర్ టీవీ... అంతా మంచిగానే ఉందని అనుకుంటేంటే ఈ రచ్చేందిరా" సూరిగాడు అడిగాడు.

"అంతా దీనివల్లే ..అష్టకష్టాలొచ్చాయ్" ఫకీర్‌గాడు అరిచాడు.

ఎందుకురా అలా అరుస్తావ్..విషయం చెప్పు, సూరిగాడు సూటిగా చూశాడు.

"ఇదివరకే నయం. సాయంత్రానికి వందో నూటయాబయో తెచ్చుకుని, ఓ యాభై సారా తాగి తొంగునేటోడ్ని" ఫకీర్‌గాడు అన్నాడు.

"ఇప్పుడేమైంది, సుఖంగా ఉంటున్నారుగా...రేపో మాపో డాబా కట్టుకుంటే..ఈ గుడిశె బతుకూ ఉండదు", సూరిగాడు అనునయించాడు.

"డాబా కాదు, ఘోరీ కట్టుకోవాలా"? ఫకీర్‌గాడు తలకొట్టుకున్నాడు.

అరే నీబాధేంటో చెప్పరా? సూరిగాడు

"ఏముందండి, ఊళ్లో పనుల్లేవ్. ఇద్దరం బెజవాడలో తాపీ పనిలో కుదిరాం. ఇద్దరికి పన్నెండొందలు వస్తున్నాయి. రోజు బస్సులో వెళ్తుంటే, పని టైముకి వెళ్లలేకపోతున్నామని వాయిదాల్లో ఈ స్కూటరు కొన్నా. దీని వారం వారం మూడొందలు ఆయిల్ ఖర్చు. కానీ పనికి తొందరగా వెళ్తున్నాం కదా అని సరిపెట్టుకున్నా. పిల్లగాళ్లని బోర్డు స్కూల్లో చదివిద్దాం అంటే ఇది వినలే. కాన్వెంట్‌లో చేర్పామా.. నెల ఫీజులే కాదు, టర్మ్ ఫీజులంటా, స్పోర్ట్స్ ఫీజులంట. వాళ్లిష్టం ఆ ఫీజు...ఈ ఫీజు అని పిండేస్తున్నారు. అదేమంటే కాన్వెంటు చదువులంతే అంటున్నారు. ఇక సినిమా చూద్దామంటే టూరింగ్ టాకీసులన్నీ మూసేశారు. సిటీలో ఐమ్యాక్స్ హాళ్లకి వెళ్లాలి. టిక్కెట్లు ఒక్కొక్కళ్లకి నూటయాబై అంట. ఈ మోతేం మోస్తాంలే... నెలకు రెండొందలు కేబులోడికి కడితే ఇంటిల్లిపాది బోల్డన్ని సినిమాలు చూడొచ్చని టీవీ కూడా వాయిదాల్లో తెచ్చా. ఇక్కడే నా కొంప కూలింది. ఇంట్లో టీవీ, స్కూటరు ఉన్నోళ్లకి రేషన్ ఇవ్వరంట. అది సరే ఇది టీవీల్లో వార్తలు చూసి నన్ను తిక్క తిక్క ప్రశ్నలు అడుగుతోంది. అసలే బతుకు బస్టాండవుతుందని నేను కంగారు పడుతున్నా. ఇవ్వాళ నైంటీకి వంద అప్పు పుట్టలేదు. అదేమంటే నీకేరా..రోజుకు పన్నెండదలు సంపాదిస్తున్నావ్. మాకంటే నువ్వే గొప్పోడువని ఊళ్లో దెప్పి పొడుస్తున్నారు. మందులేక మనసు పాడైపోయి ఇంటికొస్తే, ఇది .. ఎక్కడలేని ప్రశ్నలతో విసిగిస్తోంది". ఫకీర్‌గాడు గోడకు ఆనుకున్నాడు.



ఏడూళ్ల సూరిగాడు

"ఏం దుర్గ ఏమడిగావ్" సూరిగాడు అడిగాడు.

"రాష్ట్రానికి ప్రత్యేక హోదా రాకపోతే... పిల్లలకి ఉద్యోగాలు రావటగా, మనం కష్టపడి చదివిస్తున్నాం, పిల్లలేమైపోతారో, మనలా కూలిపనికి వెళ్లలేరు" దుర్గ మళ్లీ ముక్కు చీదింది.

"జెను హోదాకు సమానంగా ఏం, ప్యాకేజీ ఇస్తామన్నారు భయమెందుకు"? ఫకీరుగాడు అందుకున్నాడు.

"ఏం ప్యాకేజీ... ఇంతవరకూ లోటు బడ్జెట్టే తీర్చలేదు. ఇంకో ఏడాదిలో ఎలక్షన్‌లు వచేస్తాయి" నిష్టూరంగా దుర్గ సూరిగాడి వైపు చూసింది. ఔనన్నట్టు సూరిగాడు తలూపాడు.

"ఆర్థికంగా చాలా బాధల్లో ఉన్నాం, విశ్వవ్యాప్త రాజధాని నిర్మించుకోవాలి. యువతకు ఉపాధి కల్పించాలి. పరిశ్రమలు రావాలి. అందుకు ప్రత్యేకహోదా లేకున్నా రాష్ట్రాన్ని అభివృద్ధిలోకి తీసుకుపోతున్నాం. రెండంకెల వృద్ధి సాధించాం. అందరూ సహకరిస్తే అందరి కళ్లల్లో ఆనందం చూస్తా అని సీఎం అంటున్నాడు. అసలు ఈయనవల్లే ప్రత్యేక హోదా రావటంలేదు. ఇంతగా అభివృద్ధి చెందితే ఆర్థిక సాయం ఎలా చేస్తారు. అలా అడుక్కోవటం మంచిదేనా" దుర్గ అడిగింది.

"నన్నేం చేయమంటావే. ఈయనేమో మోడీని నిలదీయలేడు. పోలవరం, పట్టిసీమ, ఏదోక సదస్సు జరిపి కమిషన్లతో కాలం గడిపేత్తాడు. ఇక జగనేమో... తక్షణమే సీఎం అయిపోవాలి. బుగ్గకారు ఎక్కాలి. కేసుల్లోంచి బయట పడాలి. అందుకే కేంద్రాన్ని పల్లెత్తి మాటనడు. ఇదిగో వచ్చేశా..నిలదీత్తాను, నిగ్గదీత్తాను, అంటే పవనన్న మైకుల ముందు ఊగిపోతాడు. ఏదోక కొత్త సమస్య తెరమీదకు తీసుకొచ్చి మళ్లీ షూటింగ్‌లకు వెళ్లిపోతాడు. ప్రత్యేక హోదా బిక్షం కాదన్నాడు. ఆ ఉద్యమాన్ని వదిలేశాడు. కనీసం పోరాడుతున్న కమ్యూనిస్టులకూ మద్దతు తెలపడు". ఫకీర్‌గాడు విసుకున్నాడు.

వీళ్లిద్దరి వాదనలు వింటూ సూరిగాడు ముసిముసిగా నవ్వుకున్నాడు.

"అరే ఈ సమస్య కేవలం మీ కుటుంబానిదే కాదు. ఐదుకోట్ల ఆంధ్రులది. ప్రత్యేక హోదా విషయంలో బీజేపీ దగా చేసినమాట వాస్తవమే. టీడీపీ, వైసీపీ గోడమీద పిల్లుల్లా నాటకాలాడుతున్నాయి. ఈ సమస్య నుంచి తప్పించుకుని నిన్నా మొన్న అజ్ఞాతవాసిగా రోడ్డున పడి...జనాన్ని ఆకట్టుకుని బీజేపీకి సాయం చేసే ప్యాకేజీతో జనసేనాని కొండగట్టుకు దండెత్తాడు. కానీ పార్టీలన్నీ ఏకం కావాలంటే...ప్రజల్లోనే మార్పు రావాలి. ప్రత్యేక హోదా కోసం సీపీఐ అకుంటితదీక్షతో ముందుకు నడుస్తోంది. కనీసం ఈ జెండా నీడలోనైనా సమైక్య పోరుకు నడవక పోతే..యువత భవిత భగ్నం కావటం తథ్యం", సూరిగాడు లేచి గుడిశెలోంచి బయటకు వచ్చాడు.

Dwaraka

విశాలాంధ్ర

బతుకు
The Life

మంగళవారం
23 జనవరి 2018

రచయితలకు సూచన

'బతుకు' పేజీలో ప్రచురణకు పంపే రచనలు, వార్తా కథనాలను ఇక నుంచి ఈ దిగువ ఈ మెయిల్ చిరునామాకు పంపగలరని మనవి.

batuku@visalaandhra.com

ఇక మిగిలింది....
గిన్నీస్ రికార్డే!



కౌరవులు ఎంతమంది అంటే....100 మంది అని ఠక్కున సమాధానం చెబుతారు....మరి వెంటనే వారి పేర్లు చెప్పమంటే మాత్రం నీళ్ళు నములుతారు ఎవరైనా సరే! మరి నూరుగురి పేర్లు గుర్తుపెట్టుకోవడం అంటే మాటలా! ఈ పేర్లు అన్నీ గుక్కతిప్పకోకుండా ఎవరైనా చెప్పేస్తే ఔరా అనకుండా ఉండగలమా! వాళ్ళ గురించి తెలుసుకోవాలని కుతూహలం కలగదూ! ఒక్క కౌరవుల పేర్లే కాదు జ్ఞాపకశక్తిలో రికార్డుల మోత మోగిస్తున్నాడు తొమ్మిదేళ్ళ బుడతడు కోరాడ భరత్ చంద్ర. బాల మేధావిగా గుర్తింపు పొందిన భరత్ చంద్ర తాజాగా చాంపియన్ బుక్ ఆఫ్ రికార్డుల్లోనూ స్థానం సంపాదించాడు. ఈ బాలుడు తన మేధస్సుతో కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రజా ప్రతినిధులనే కాదు రికార్డుల నిర్వాహకులనూ అబ్బురపడేలా చేస్తున్నాడు. తన ప్రజ్ఞతో అన్ని వర్గాల ప్రజల నుంచీ అభినందనలు అందుకుంటున్నాడు.



కేంద్రమంత్రి అశోక్ చేతుల మీదుగా

భరత్ చంద్ర ఉండేది విజయనగరం మండలం గాజులరేగ గ్రామం. కోరాడ రమణ, హేమలత అతని తల్లిదండ్రులు. పట్టణంలోని ఒక ప్రైవేట్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్నాడు. అపారమైన జ్ఞాపకశక్తి అతని సొంతం. ఈ ప్రజ్ఞతోనే రికార్డుల మీద రికార్డులు సృష్టిస్తున్నాడు. ఇక అతని ఖాతాలో మిగిలింది గిన్నిస్ రికార్డే అంటే అతిశయోక్తి కాదంటున్నారు అతని గురించి తెలిసినవాళ్ళు. ఈ కుమారుడికి అద్భుతమైన జ్ఞాపకశక్తి ఉందనే విషయాన్ని మూడేళ్ల ప్రాయంలోనే గ్రహించిన తల్లిదండ్రులు అనేక అంశాలపై శిక్షణ కల్పించి తీర్చిదిద్దారు. వందమంది కౌరువుల పేర్లు, 118 కెమికల్ ఎలిమెంట్స్ మరియూ వాటి సింబల్స్, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి 2014లో గెలుపొందిన 175 మంది ఎమ్మెల్యేల పేర్లు- వారి నియోజకవర్గాల పేర్లు, రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న పార్లమెంట్ సభ్యుల పేర్లు, వారి నియోజక వర్గాలపేర్లు, మంత్రులు వారి శాఖలు, ఏపీ ముఖ్యమంత్రులు, గవర్నర్లు, మనదేశ ప్రధాన మంత్రులు, రాష్ట్రపతుల పేర్లు, ఫ్యామస్ ఫాదర్స్, యూఎన్ఒ, ప్రముఖ రచయితలు వారి రచనలు, ఇండియా బేసిక్ డాటా, వరల్డ్ బేసిక్ డాటా, ఇండియా సూపర్‌లేటివ్స్, కంట్రీ క్యాపిటల్స్, కంట్రీస్ ఎంబ్లెమ్స్, అబ్రివేషన్స్, వండర్స్ ఆఫ్‌ద వరల్డ్, ప్లానెట్స్ నేమ్స్, సముద్రాలపేర్లు, నదులు, అవి ఉండే నగరాల పేర్లు, భారత రత్న అవార్డు గ్రహీతల పేర్లు, దాదా సాహెబ్ పాల్కె అవార్డు గ్రహీతలు, 29 రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్య మంత్రుల పేర్లు, ప్రముఖుల ఆటో బయోగ్రఫీస్, ప్రముఖ వ్యక్తుల నినాదాలు, రామాయణ, భాగవతం, భారతం వంటి 80 రకాలైన అంశాలలో భరత్ చంద్ర అనేక ప్రశ్నలకు అలవోకగా సమాధానం చెబుతూ రికార్డులను తిరగరాస్తున్నాడు, అనేక వేదికలపై తనకే సాధ్యమైన విజయాలను సొంతం చేసుకున్నాడు.



"చాంపియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్"ను అందుకుంటున్న భరత్‌చంద్ర



జ్ఞాణపీఠ్ అవార్డు గ్రహీత సినారె చేతుల మీదుగా

అడ్డుపడుతున్న ఆర్థిక పరిస్థితి

భరత్‌చంద్ర తండ్రి రమణ ప్రైవేట్ కంపెనీలో చిరుద్యోగి. అంతంతమాత్రం ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. ఇలాంటి పరిస్థితిలో ప్రతిభావంతుడైన తన కుమారుడిని మరింత మెరుగ్గా తీర్చిదిద్దడానికి అనేక ఆర్థిక కష్టాలను ఎదుర్కొంటున్నారు. భరత్ చంద్ర చెల్లి వినీలా అన్న బాటల్లోనే పోటీల్లో పాల్గొంటోంది. భరత్‌చంద్రకు గిన్నిస్ రికార్డు పోటీలలో పాల్గొనే అవకాశం వచ్చినా కూడా వారి ఆర్థిక స్థోమతే ఇందుకు అడ్డుగా మారింది. దీంతో అ అవకాశాన్ని చేజార్చుకోవాల్సి వచ్చిందని భరత్‌చంద్ర తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుమారుడిని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకొని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దాలని వారు కోరుతున్నారు. గిన్నిస్ రికార్డు పోటీలు నిర్వహణ కోసం లక్షలాది రూపాయలు వ్యయం అవుతుందని, దాన్ని భరించే స్థాయి తమ చిన్న కుటుంబానికి లేదని వాపోయారు. ప్రభుత్వం ఆసరా కల్పిస్తే గిన్నిస్ రికార్డును సాధిస్తానని భరత్‌చంద్ర చెబుతున్నాడు.

వండర్ బుక్ ఆఫ్ రికార్డ్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డు, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్, సూపర్ క్విజ్ రికార్డ్, మిరాకిల్ వరల్డ్ రికార్డ్, లిటిల్ బుక్ ఆఫ్ రికార్డ్, స్టేట్ బుక్ ఆఫ్ రికార్డ్, స్టార్ వరల్డ్ రికార్డ్, ఇండియాస్ వరల్డ్ రికార్డ్, గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్, అసిస్ట్ వరల్డ్ రికార్డ్, గోల్డెన్ స్టార్ వరల్డ్ రికార్డ్, మార్వెలెస్ వరల్డ్ రికార్డ్, భారత్ వరల్డ్ రికార్డ్, వజ్రా వరల్డ్ రికార్డ్, కల్చరల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ వంటి 18 సరికొత్త రికార్డులను నెల కొల్పాడు. రెండు నెలల క్రితం (గత ఏడాది నవంబరులో) చాంపియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు ప్రతినిధులు ఆన్‌లైన్‌లో ఇంటర్వ్యూ నిర్వహించారు. ఇందులో దేశ వ్యాప్తంగా ఉన్న మేధావులు పాల్గొన్నారు. ఈ పోటీలో భరత్ చంద్ర చెప్పిన సమాధానాలకు నిర్వాహకులే ముగ్ధులయ్యారు. భరత్ చంద్ర ప్రతిభను గుర్తించి వారి రికార్డుల్లో స్థానం కల్పించినట్లు నిర్వహకులు వెల్లడించారు.

భరత్‌కు మూడు అవార్డులూ వచ్చాయి. బాల విజ్ఞాన రత్న(భారత్ ఆర్ట్స్ అకాడమీ చే రవీంద్ర భార తిలో), ఆంధ్ర బాలరత్న (విశాఖలో కళాభారతిలో అర్పిత ఇంటర్నేషనల్ సంస్థచే), జాతీయ బాల ప్రతిభ రత్న అవార్డు(విజయనగరంలోని బండారు బాలనంద సంస్థచే)లను అందుకున్నాడు.

- గంగుల వెంకట శివప్రసాద్,
విజయనగరం

ప్రకృతి పరచిన అందం చిల్కీగఢ్



రాలిపడిన పండుటాకులు, దుప్పటిలా పరచుకొన్న ధూళికణాలతో మెలికలు తిరిగిన అడవితోవ... అటూఇటూ ఆకాశాన్ని కప్పివేస్తూ పందిరిలా అల్లుకొన్న పత్రసమూహాలూ.. దట్టంగా ఏపుగా ఎదిగిన టేకు, మద్ది, కదంబ వృక్షాలూ.. కొమ్మల్ని వేలాడే వానరమూకలూ, కుహూరవాలతో ముంచెత్తే పక్షిజాతులూ... ఎప్పుడూ కలిసి ఉండే ప్రియసఖిలా అడవితోవను అంటి పెట్టుకొని ప్రవహించే ధులుంగ్ నది...ఈ ప్రకృతి అందాల దృశ్యమే చిల్కీగఢ్. పశ్చిమ బెంగాల్‌లోని మిడ్నపూర్ జిల్లాలో బీహార్ సరిహద్దున ఉన్న చిల్కీగఢ్ వన సౌందర్యం వర్ణనాతీతం. ఝూర్‌గ్రామం చేరువలో ఉన్న ఈ పర్యాటక కేంద్రం నిత్యం సందర్శకులతో సందడిగా కనిపిస్తుంది.

ప్రకృతి సౌందర్యంతోపాటు చారిత్రక ప్రాధాన్యం కలిగిన చిల్కీగఢ్‌కు పెద్దసంఖ్యలో సందర్శకులు వస్తుంటారు. కొందరు అడవి అందాల్ని పరిశీలించి పులకిస్తే.. మరికొందరు శతాబ్దాల నాటి రాజభవంతులు, ఆలయాల్ని చూసి తన్మయులవుతారు. వంగదేశంలో ఉత్కళ సంప్రదాయం ఆవిష్కృతమైన చారిత్రక ఘట్టాల్ని గుర్తుచేసుకుంటారు.

ఉత్కళ(ఒరిస్సా) పాలకుడు విశ్వరూప్ త్రిపాఠీ..హుస్సేన్ షా దండయాత్రలను ఎదుర్కొనలేక పారిపోయి వంగదేశానికి చేరాడు. చిల్కీగఢ్‌లో తలదాచుకున్నాడు. థాల్‌భూమ్‌లో రాజధాని ఏర్పాటుచేసి చిల్కీగఢ్ సామ్రాజ్యాన్ని స్థాపించాడు. ఇక్కడ కూడా అతను ఎదురుదెబ్బతిన్నాడు. అతని సైనికాధికారి సామంత్ వంశజుడి చేతిలో వెన్నుపోటుకు గురయ్యాడు. దీంతో సామంత్ వంశంలో అనేక తరాలవారు థాల్‌భూమ్ సింహాసనాన్ని అధిష్ఠించి చిల్కీగఢ్‌ను పాలించారు. ఈ వంశంలో చివరివాడైన గోపీనాథ్ మార్తాగజ్‌సింగ్ చిల్కీగఢ్ కోనసీమలో కనకదుర్గ ఆలయాన్ని నిర్మించాడు. ఈయన తర్వాత అల్లుడు ధాల్‌బల్‌దేవ్ సింహాసనాన్ని అధిష్ఠించాడు. అక్కడి నుంచి ధాల్‌బల్‌దేవ్ వంశజులు చాలాకాలం చిల్కీగఢ్‌ను ఏలారు. ఈయన వంశీకులు నేటికీ చిల్కీగఢ్‌లో ఉన్నారు. వారిలో ప్రముఖుడైన నారాయణ్ చంద్రదేవ్ ధాల్‌బల్‌దేవ్ యాభై ఏళ్ల కిందట చిల్కీగఢ్‌లోని కనకదుర్గ ఆలయాన్ని పునరుద్ధరించారు. అందులో అపహరణకు గురైన స్వర్ణ ప్రతిమ స్థానంలో దేవితాలూకు శిలామూర్తిని ప్రతిష్ఠించారు. చిల్కీగఢ్ వన సౌందర్యాన్ని పెంపొందించేందుకు స్థానికులందరూ కలిసి ప్రత్యేక కృషిచేశారు. ఆ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దారు. ఈ వనంలో మూడు వందల అరవై అయిదు తెగలకు చెందిన వృక్షాలతోపాటు, రకరకాల పక్షి, వానర జాతులూ ఉన్నాయి. ఇక్కడి వృక్షాల్లో అనేక జాతులు ఔషధ విలువలు కలిగినవి కావడం విశేషం. ఏడాదిలో అన్ని రుతువుల్లోనూ ఆమని విరబూసే ఈ ప్రాంతం ప్రకృతి సౌందర్యానికి ప్రతిరూపమే!







పురి విప్పి ఆనందంగా ఆడే నెమలి నాట్యం చూసి ఉంటారు. మరి వాటి పోరాటాన్ని ఎప్పుడైనా చూశారా? లేదంటే ఇప్పుడు చూడండి. ఇక్కడ జరుగుతోంది అదే. ఈ పోరాటంలో గెలిచేది నువ్వానేనా? అన్నట్టుగా మయూరాలు పోట్లాడుకుంటున్న దృశ్యమూ అబ్బురంగానే ఉంది కదా! ఇంతకీ ఈ దృశ్యం ఎక్కడిదో తెలుసా...దేశరాజధాని ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లోది.

రోజూ...దానిమ్మ!



దానిమ్మపండులో ఎన్ని గింజలు ఉంటాయో చెప్పగలరా? చెప్పలేం కదా! అలాగే, ఈ పండు వల్ల కలిగే ఆరోగ్య లాభాలూ అపారం! ఎంత చెప్పుకున్నా ఇంకా మిగిలే ఉంటాయి. అదే దీని ప్రత్యేకత. ఈ పండు చాలా పురాతనమైనది. దీనిని చైనీస్ ఆపిల్ అని కూడా పిలుస్తుంటారు. దానిమ్మలో తీపి, పులుపు రెండు రకాలు ఉన్నాయి. దానిమ్మ పండే కాదు పూలు, చెట్టు బెరడు అన్నీ ఔషధాలుగా పనిచేస్తాయి. వీటిని ఎక్కువగా ఆయుర్వేదంలో ఉపయోగిస్తారు. ఈ పండులో పీచుశక్తి ఎక్కువ. ఇది ఉదర సంబంధ వ్యాధులను నివారిస్తుంది. నేడు ప్రజలను ఎక్కువగా పీడిస్తున్న కేన్సర్ వ్యాధి రాకుండా అడ్డుకుంటుంది. భాస్వరం, కాల్షియం, ఐరన్, విటమిన్ బీ, విటమిన్ సీ ఇందులో పుష్కలంగా ఉన్నాయి. రోజూ ఒక దానిమ్మ పండు తింటే కేన్సర్ దరిచేరదు. దానిమ్మరసంలో తేనె కలిపి ఉదయం భోజనం తర్వాత తాగితే రక్త వృద్ధి కలుగుతుంది. గర్భకోశ దోషం ఉన్న మహిళలకు ఇది మంచి మందులా పనిచేస్తుంది.



జరిగిన కథ

ఎం.ఏ. అంటే ప్యాసయి ఆ పరదా కాలేజీలో నాల్గేళ్ళు పనిచేస్తే మాత్రం ప్రపంచం ఎట్లా తెలుస్తుందీ - నాలుగు దక్కాముక్కీలు తినాలి - కాస్త సాఫీతేరాలి కాని! బొత్తిగా సత్యకాలం అవుతే ఎట్లా...యీ మాట బాచిగాడు పుడితే...ఏమిటి మన యిష్టం యేమిటి! ఎల్లాగేనా ఆడపిల్ల అంటే తల్లిదగ్గరే చనుం - తండ్రికేం అధికారం వుండదు. మగపిల్లాడనగానే తండ్రిదే పైచెయ్యి అవుతుంది - అవాలికూడా. మగపిల్లలకి తర్ఫీదు చెయ్యడం యెంత చదువుకున్న ఆడవాళ్ళకేనా తెలీదు. ఆ ప్రపంచకమే వేరు - ఆ సరదాలు - ఆ భావాలు - ఆ కోరికలూ - ఆ వాంఛలూనూ. ఏదైనా ప్రయోజకుడై వో యింటివాడై కుటుంబ సాంప్రదాయం నిలబెడుతూ డబ్బు సంపాదించి వో హోదా - వోతాహతూ - పెళ్ళాం పిల్లలూ - "నా" అని నిలబెట్టేవాడు మొగాడేగా - ఎన్నికబుర్లు చెప్పినా బాచిగాడికి ఓనమాలదగ్గిర నుంచి నేనే స్వయంగా చదువు చెప్తా.

(నిన్నటి సంచిక తరువాయి)

తర్డుఫారం వరకూ యింటిదగ్గరే చెప్పిస్తా. స్కూళ్ళలో సహం కాలం వృధానేకదా! పన్నెండేళ్ళకే స్కూలు ఫైనలు పేసు చెయ్యించెయ్యాలి. ఆ తరువాత దేవుడు మేలుచేస్తే గబ్‌గబ్‌ని బియ్యే ప్యాసుచేయించడం - తరువాత ఇంగ్లండూ - ఐ.సి.యస్.న్నూ వాడూ ముందు కొస్తాడు. నాకూ మంచిదేనూ. శాంతంతో ఇప్పుడీ సంగతులన్నీ యెందుకూ అనవసరంగా? ఈ నా ఐదు నెలలూ బాగా వెళ్ళిపోయి - నేననుకున్నట్టే అవుతే బాగుండును... ప్లాటినం బ్రూచి - రిస్టువాచి పెట్టుకుని శాంతం అదే పొంగిపోవడం!...కూనూరు దేవస్థానం కేసులో వాళ్ళు ఖబుర్లమీద ఖబుర్లు పంపిస్తున్నారు-పట్టడమా మానడమా? మంచి తమాషా అయిన లా పాయింటు వుందిగాని దేవస్థానం డబ్బుతిని జలసాచేసిన మహంతువేపు ఎలా పని చేస్తావని శాంతం మళ్ళీ తిరగబడితే! కాస్త ఇప్పుడిప్పుడే దార్లోకి వస్తూందనుకున్నది - ఆ గాంధీ వెర్రీ, సోషలిస్టు రుగ్మత రెండూ కలిసి మళ్ళీ తిరగబెట్టుతే ఛస్తాం! రెండో పక్షం వాళ్ళు వీభూతిరాయళ్ళు - డబ్బేం యివ్వలేరు. ధర్మసంస్థాపనార్థాయ - అని మనం జోలెకట్టుకు యెక్కడ తిరగ్గలం? అయినా చూద్దాం....

65 ఆమె

మనదేశపు చరిత్రలో ఈ వేళతో ఒక గొప్ప ఘట్టం పూర్తి అయింది. మధ్య రౌండు టేబిలు నాటకం తొమ్మిదినెలలూ మినహాయిస్తేమూడేళ్ళు నడిచింది పూర్తిగా సత్యాగ్రహ యుద్ధం. యీ ఆరునెలలూ యేదో పేరుకి మాత్రం ఉద్యమం కాని, ఉద్రేకం ఉత్సాహం పోయింది ప్రజల్లో. మహా మహా తర్ఫీదు పొందిన సైన్యాలే ఒక్క ధాటీని యుద్ధం చెయ్యలేవుకదా, అటువంటి - సామాన్య జనం ఇంత ధైర్యంతో ఉద్యమం సాగించారంటే ఆశ్చర్యం, కదూ! ఆ మౌంటు రోడ్డు లాఠీఛార్జీ తల్చుకుంటే నాకే తెలీదు, ఆ ధైర్యం నాకెక్కడనుంచి వచ్చిందని. అబ్బ! ఆ గుర్రపు లాడేల మెరుపుల ఈవేళకి కూడా కళ్ళలో పొడుస్తూన్నట్టే అనిపిస్తూంది కదా! లక్షలాదిమంది జైళ్ళకి వెళ్ళేరు, దెబ్బలు తిన్నారు. ఫకీర్లయిపోయారు - చివరికి ఫలితం ఏమయినట్టు? క్రింద పడినా - పైనే వున్నాం అనడం, అనుకోవడం. రాజనీతేమో, కాని, ఉద్యమం ఆఖరు చేయడం అంటే మనం ఓడిపోయినట్టు ఒప్పుకోవడమే కదా? ప్రజల్లో నిలబడడానికి ధైర్యం లేక పోయింతరవాత గాంధీగారుమాత్రం ఏంచేస్తాడు? మధ్యలో వెనక్కి జారిపోయానే అని ఇప్పుడనిపిస్తూంది. వెనక్కి దిగడి పోయినదాన్ని గనక నాకు విమర్శించడానికి హక్కులేదేమో? నిజమే! అయినా చరిత్రమాత్రం విమ ర్శించదా?

మొత్తంమీద చూస్తే ఉద్యమం మనదేశంలో అందరినీ కూడకట్టుకు రాలేకపోయిందేమో అనిపిస్తూంది. పల్లెటూరి జనం రైతులు కూలినాలి చేసుకునేవాళ్ళూ - వీళ్ళ నెవరినీ ఆకర్షించలేకపోయింది. వాళ్ళని దూరంగా వుంచేసింది కూడాను - కరాచీలో ఎన్ని కబుర్లు చెప్పినా - నాయకత్వం



మధ్యతరగతి వాళ్ళ చేతుల్లో పడిపోయింది. ప్రొఫెసర్ సుందరరామన్నూ, జమీందారు వియ్యన్నగారూ కూడా ఆరు నెలలు జైల్లో కూర్చున్నంత మాత్రాన నాయకులైపోతే ఎల్లా? నాకు విముఖత ఏర్పడ్డానికి సహం ఇదే కారణం. నాలాటి వాళ్ళందర్నీ కుర్రకుంకలనీ సోషలిస్టులనీ తిడుతూంటే, ఈ నాయకులు దేశాన్ని యేం ముందుకు తీసుకొస్తారు? నాయకుల్లో లోపమా, అసలు తత్వంలో లోపమా? గాంధీగారి సిద్ధాంతంలోనే లోపం అయితే-ఇంతమంది ఆయన శిష్య కోటిలో ఎల్లా చేరారు? శిబిరంలో అప్పుడుండే వాలంటీర్లు



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

ఎంతోమంది వచ్చి నాతో మాట్లాడారు. వాళ్ళు జైళ్ళ కెళ్ళిచ్చిం తరవాత - ప్రతీ వాలంటీరూ ఆరితేరిన సోషలిస్టులాగే మాట్లాడాడు - కుర్రాళ్ళెవ్వరూ భగవద్గీత చదవడంలేదు. ప్రతీవాడూ కూడా - ఏదో అసంతృప్తి వెళ్ళబుచ్చడమేనూ. నాయకులంటే గౌరవం పోయింది. కాంగ్రెసు డబ్బున్నవాళ్ళ చేతుల్లోకి వెళ్ళిపోతున్నదేమో అనుకుంటున్నారు కుర్రాళ్ళు. ఉద్యమం ఆపేయడం వాళ్ళెవళ్ళకీ పిసరంతేనా ఇష్టం లేదు. ఇంత త్యాగం వృధా అయిపోయిందంటున్నారు. నేను తిన్న దెబ్బ లన్నీ వృథాయేనా? తల్చుకుంటే నిస్పృహ వస్తోంది. నన్ను పాట్నా సభకి రమ్మనమంటున్నారు సుబ్బయ్య, రామ్మూర్తి వాళ్ళున్నూ. వెళ్ళి ఏం ప్రయోజనం? మనమాట వినేవాడెవడు?అయినా - గాంధీగారే వున్నారు కదా! చివరంటా ఆయన్నే నమ్ముకోవాలి - పాలముంచినా నీటముంచినా.

66 అతడు

శాంతం నోటినుంచి నిన్న ఆ శుభవార్త! ఈవేళ పత్రికలో ఈ శుభవార్త! ఈ సత్యాగ్రహం ఆపుచేద్దాం అని ఇన్నాళ్ళకేనా తోచింది గాంధీగారికి. ఆరు నెలల ముందే ఆపేసి వుండవలసింది. నన్నడుగుతే అసలు ఉద్యమం లేవదీయడమే శుద్ధ తప్పు. ఇంతకీ ఫలితం ఏమిటి? సహం మంది ఫకీరులయ్యారు. సహంమంది రౌడీలు, సోషలిస్టులు తయారయ్యారు. చివరికి మళ్ళీ యథాప్రకారం. ఆ వొచ్చే డొమీనియను ప్రతిపత్తి కూడా మాయం అయిపోయింది. నేను మొదటి దగ్గిరనుంచీ అంటూనే వున్నాను - పట్టితే తిలక్కు మార్గం పట్టండి - లేదూ గోఖలే మార్గం పట్టండి. రెంటికీ చెడ్డ రేవడిలాగు - ఈ ఉద్యమం ఏమిటంటా? రాజకీయంలో అందుతే బుర్ర లేకపోతే కాళ్ళు. నాకు మనస్కరించకే చేరలేదు. ఇంతకీ నేను చేరినా శాంతం చేరినా, కీర్తేనా అపకీర్తేనా నాకేగా వచ్చేది? అందులోకీ ఏదొచ్చినా ఆదికి ముందు మన ఆంధ్రులకే కావాలి. జైళ్ళ కెళ్ళొచ్చారో లేదో ప్రతీ ఆంధ్రుడూ సోషలిస్టేకదా! వీళ్ళకేం తెలుసు సోషలిజం అంటే? నాకు తెలుసు నేను ఇంగ్లండులో ఆరుసంవత్స రాలున్నాను. ఆ సోషలిజం అక్కడ పుట్టి పెరగాల్సిందేగాని మనదేశానికి పనికిరాదు. మన సాంప్రదాయమే వేరు. రాజన్నా, రెడ్డిఅన్నా, జమీందారన్నా, ధనవంతుడన్నా ప్రజల్ని బిడ్డల్లాగు, డబ్బుని మైనర్ల సొత్తులాగు, తాము సంరక్షణకర్తల్లాగు వ్యవహరించడమే. అలాంటిది ఇప్పుడిప్పుడే కాస్త పరిశ్రమలంటూ లేవతీస్తూంటే, ఈ సోషలిజం ఒకటా - అవి రోజంతా నాశనం కావడానికి? శాంతంచుట్టూ ఈ కుర్రాళ్ళు మహ తిరుగుతున్నారు. ఈ శరీరస్థితిలో పాట్నాలేదు గీట్నాలేదు, అని నేను రెండు గసురులు గసిరేసికి ఎవరిమానాన్న వాళ్ళు పోయారు. ఈ ఉద్యమం ఫలితం యిదొక్కటి కనిపించింది! లేనిపోనిది, ఈ కుర్రాళ్ళందరూ మళ్ళీ సహాయ నిరాకరణం అంటూ ఏ వుపద్రవమో తెచ్చిపెట్టరుకద? కాంగ్రెస్‌లో యీ పెద్దరికమే ఉన్నవాళ్ళూ ఆ ప్రమాదం వుండకూడదు. అయినా పెద్దలందరికీ కాళ్ళు పీక్కుపోయాయి. అందులోకి మళ్ళీ ఎసెంబ్లీ ఎన్నికలు రుచి మరిగితే అసలు బుద్ధే తిరిగి పోతుంది! ఇంతకీ మనది మొదటి దగ్గిరనుంచి పంచాయతీ పద్ధతి. ప్రజాస్వామ్యం మనలోనుంచే పుట్టింది. అంచేత పార్లమెంటు విధానం మీద మనకు మోజు వుండడం సహజమే.

అన్నట్టు - శాంతం ఈ వుద్యమంలో దెబ్బలు తినడం వల్ల నా ఎడ్వకేట్ గిరీజనరలు పోతేపోయిందికాని ఆలోచించి చూస్తే అదీ నా మంచికే అనిపిస్తూంది. ఆ రోజుల్లో అయివుంటే అందరూ నన్ను వేలుపెట్టి చూపించి దేశద్రోహి అని తిట్టివుందురు. ఇప్పుడు అందరూ ఏమంటున్నారు? ఎడ్వకేట్ జనరల్ గిరీ పోయినాసరే భార్యనిమాత్రం ఉద్యమంలోకి పంపించేడంటున్నారు. అందుచేత ఈమాటు ఒక్క గెంతుతోనే హైకోర్టు బెంచిమీద కురకొచ్చు - ఎప్పటికేనా కాంగ్రెసువాళ్ళూ రావడం అంటూ వుంటేను. ఇప్పటినుంచి అప్పుడప్పుడు ఖద్దరు వేసుకుంటూండాలి. ఈ గవర్నమెంటు ఆఫ్ ఇండియా బిల్లు ప్యాసుకాకముందే ఏదేనా శాంతానికి పురుడు వచ్చేలోపుగా మళ్ళీ ఏ హడావుడులు లేకుండా వుంటే అదే చాలు.

67 ఆమె

ఈవాళకి కలం ముట్టుకుని యే నాలుగు నెలలైందో! ఏమి జబ్బులు బాబూ! బతికి బయటపడతాం అనుకోలేదు. తల్చుకుంటే, మళ్ళా ఆసావిత్రీ సత్యవంతుడూ- యముడూ, రవివర్మ చిత్రించిన బొమ్మే కళ్ళకి కట్టినట్టుంది. ఆనా జబ్బులోనూ-శాస్త్రి జబ్బులోనూ, ఆబొమ్మ- అచ్చంగా ఆ బొమ్మే యెన్నిసార్లు నా కళ్ళముందర వచ్చిందో గదా? ఇప్పటికి - నిజంగా ఆ యముడు అలా బాణం పట్టుకుని నా యెదుట నిలబడితే ఫో-యిక్కడ నుంచి ఫో-అని నేను నిజంగా అన్నానేమోకూడా!...ఆవేళ హోరనివర్షం-పూరూ వాడా యిలా యేకం అయిపోతుంటే - యిప్పుడా ప్రధాన మంత్రి గారింట్లో విందుకు హాజరు కాకపోతే మునిగి పోయిందే మిటి? అని నేనన్నా.విన్నాడుకడు.

- ఇంకా వుంది.

సైబర్ సెక్యూరిటీ కోర్సుకు పెరుగుతున్న డిమాండ్



భారతదేశంపై గత మూడేళ్లలో దాదాపు లక్షన్నర సైబర్ దాడులు జరిగాయని ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్‌లో తెలియజేసింది. దీనిని బట్టి సైబర్ నేరాల తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఈ దాడులు వివిధ రకాలుగా ఉంటాయి.

మన వివరాలన్నీ మనకే చెప్పి మనకొచ్చిన ఓటీపీని అడిగి తీసుకొనిమరీ మన సొమ్మంతా కొల్లగొట్టే మోసపూరిత ఫోన్ కాల్స్ గురించి మనం రోజూ వింటున్నాం! వీటిని తప్పించుకోవడం ఎలా? ఈ వైరస్‌లు.. దాడులు.. మోసాలన్నీ సైబర్ ప్రమాదాలే!

ఒక పక్క ఇంటర్‌నెట్ వినియోగం ఎక్కువవుతుంటే దాంతో సమానంగా సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయి.

వీటిని అరికట్టడంలో భాగంగా కొత్త కొత్త ఉద్యోగాలు, కోర్సులు పుట్టుకొస్తున్నాయి. ఇప్పుడు సైబర్ ప్రపంచ సంరక్షణ సరికొత్త కీలక ఉద్యోగ బాధ్యతగా అభివృద్ధి చెందుతోంది!

అంతర్జాతీయ వ్యవస్థల నుంచి అతి సామాన్య వ్యక్తుల వరకు అందరూ సైబర్ ప్రమాదాల బారిన పడుతున్నారు. మన సమాచారాన్ని మనకు తెలియకుండానే దొంగిలిస్తున్నారు. అణుయుద్ధాల కంటే సైబర్ యుద్ధాలే ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో తగిన రక్షణ వలయాలను ఏర్పాటు చేసుకోవడం కోసం అభివృద్ధి చెందుతున్న కెరియర్ సైబర్ సెక్యూరిటీ. ఒక దేశాన్ని నాశనం చేయాలంటే అణ్వస్త్రాలే అవసరం లేదు. ఆ దేశ సమాచార వ్యవస్థపై సైబర్ దాడి చేసి ధ్వంసం చేస్తే చాలు. కొన్ని దశాబ్దాలపాటు కోలుకోలేని దెబ్బ తగులుతుంది.

హ్యాక్మగెడ్డాన్ అనే సంస్థ నివేదిక ప్రకారం డిసెంబరు 2017 వరకు జరిగిన ఆన్‌లైన్ నేరాల్లో 84.6 శాతం సమాచార చౌర్యానికి చెందినవే. 9.9 శాతం పోటీ పరిశ్రమల సైబర్ గూఢచర్యం చర్యలు. 4.4 శాతం హ్యాకింగ్ ప్రయత్నాలు. ఇక మిగిలిన 1.1 శాతం సైబర్ యుద్ధాల శకలాలు!

సైబర్ సెక్యూరిటీ అంటే ఏంటి?

సైబర్ నేరగాళ్ల సాంకేతిక సవాళ్లను దీటుగా ఎదుర్కొనే సామర్థ్యం ఉన్న వ్యవస్థను రూపొందించి, నిర్మించి, నిర్వహించి నెట్‌వర్క్‌ను భద్రంగా కాపాడుకోవడాన్ని సైబర్ సెక్యూరిటీ అని చెప్పవచ్చు. తద్వారా ఈ-కామర్స్ లావాదేవీలకు ఎలాంటి ఆటంకం లేకుండా చేయడం దీని ప్రధాన లక్ష్యం. సాధారణంగా కంప్యూటర్, నెట్‌వర్క్, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ లక్ష్యంగా సైబర్ నేరాలు (వైరస్, ఎస్‌క్యూఎల్ ఇంజెక్షన్, డిస్ట్రిబ్యూటెడ్ డినయల్ ఆఫ్ సర్వీస్) జరుగుతుంటాయి. ప్రభుత్వం, కార్పొరేట్ సంస్థలు, ఇతర వ్యవస్థలు ఇందులో ప్రధాన బాధితులు. అందుకే ప్రోగ్రామింగ్, సురక్షితమైన, దుర్భేద్యమైన నెట్‌వర్క్‌ల అభివృద్ధి ఇప్పుడు మేధావుల, ఉద్యోగుల ప్రధాన లక్ష్యంగా మారింది.

వేగంగా విస్తరణ

కమ్యూనికేషన్ వ్యవస్థ, కంప్యూటర్, నెట్‌వర్క్ రంగాల్లో జరుగుతున్న విప్లవాత్మక మార్పుల ఫలితంగా సమాచారం అందరికీ అందుబాటులో ఉండటం ఒక వరమైతే, అదే సమయంలో ఆ సమాచారానికి భద్రత లేకపోవడం ప్రమాదకరమైన విషయం. అందుకే ఆ భద్రత కల్పనలో భాగంగా నిపుణుల అవసరం రోజురోజుకీ పెరుగుతోంది. సమాచార లభ్యతతోపాటు సమగ్రత, గోప్యతలను కూడా ఎంతో అవసరమైన సేవలుగా వీరు అందించాల్సి ఉంటుంది.

ఐటీ రంగంలో పలు దేశాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. వాటి ఆర్థిక వ్యవస్థను దెబ్బకొట్టాలంటే భౌతిక యుద్ధాలు అవసరం లేదు. వాటి సమాచార వ్యవస్థను ఛేదిస్తే చాలు. అందుకే రోజూ ఎన్నో రకాల సైబర్ దాడులు జరుగుతుంటాయి. మన దేశ భద్రతా వ్యవస్థను పటిష్టం చేయడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఈ విధంగా అటు ప్రైవేటు ఇటు ప్రభుత్వ రంగాల్లో ఎన్నో ఉద్యోగావకాశాలు వస్తున్నాయి.

విద్యార్హతలు - ఇతర నైపుణ్యాలు

కనీసం ఏదైనా డిగ్రీ సరిపోతుంది. ఇంజినీరింగ్‌లో డిగ్రీ లేదా పీజీ ఉంటే ప్రాధాన్యం ఉంటుంది. విచారించే తత్వం, విశ్లేషణ సామర్థ్యం అదనపు లక్షణాలు. భావప్రకటనపై పట్టు ఉండాలి. అభ్యర్థులకు సహనం చాలా అవసరం.

- పైథాన్, రూబీ, జావా స్క్రిప్ట్, బాష్ స్క్రిప్ట్, షెల్ స్క్రిప్ట్ బాగా వచ్చి ఉండాలి.
- వివిధ ఆపరేటింగ్ సిస్టంల పట్ల లోతైన, తార్కికమైన అవగాహన అవసరం.
- అల్గారిథమ్ అభివృద్ధి చేయగలగడం అదనపు అర్హత.
- రిపోర్ట్‌లు తయారు చేయడానికి రైటింగ్ స్కిల్స్ కావాలి.
- ఎథికల్ హ్యాకింగ్‌లో సర్టిఫికెట్ తప్పనిసరి. ఇందులో వివిధ స్థాయిల్లో సర్టిఫికెట్ కోర్సులు ఉన్నాయి.
- ఎథికల్ హ్యాకింగ్ శిక్షణలోని 'కలి' వంటి కొన్ని ముఖ్యమైన టూల్స్‌పై మంచి పట్టు ఉండాలి.



ఏయే స్థాయిల్లో ఎలాంటి ఉద్యోగాలు?

రోజురోజుకీ విస్తరిస్తున్న సైబర్ సెక్యూరిటీ రంగంలో వివిధ స్థాయిల్లో రకరకాల ఉద్యోగాలు ఉన్నాయి.

ఎంట్రీలెవెల్ : కంప్యూటర్ నిపుణులు, పెనెట్రేషన్ టెస్టర్లు - ఎగ్జిక్యూటివ్ మేనేజర్ స్థాయిలో ఉండే ఉద్యోగాలివి. సంస్థ భద్రత వ్యవస్థ, మార్గదర్శకాలకు అనుగుణంగా రోజువారీ భద్రత బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది.

మిడిల్ లెవెల్ : మేనేజర్‌గా భద్రత వ్యవస్థ నిర్వహణ, డేటా రక్షణ, భద్రత విధానం నిర్మాణ-నిర్వహణలు, వ్యాపారాభివృద్ధి చేస్తారు. ప్రమాదాలు, విపత్తులు సంభవించి డేటాకు నష్టం వాటిల్లినప్పుడు దాని పునరుద్ధరణలో కూడా ముఖ్య పాత్ర పోషిస్తారు.

సీనియర్ లెవెల్ : ఈ స్థాయిలో సమాచార వ్యవస్థ రూపకల్పన, రచన, నియంత్రణల అమలు, సమాచార భద్రత నిర్వహణ ముఖ్య బాధ్యతలుగా ఉంటాయి.

హయ్యర్ లెవెల్ : భద్రత సలహాదారులు, ఆడిటర్లుగా ఉంటారు. సమాచార భద్రతకు సంబంధించిన వ్యవస్థల నిర్మాణం, విధివిధానాలు, రిస్కుల అంచనా, అంతర్జాతీయ స్థాయిలో ఉన్నత ప్రమాణాల అమలు లాంటి ముఖ్యమైన బాధ్యతలను నిర్వహిస్తారు.

మేనేజ్‌మెంట్ లెవెల్ : ఈ స్థాయిలో ముఖ్య సమాచార అధికారి (చీఫ్ ఇన్‌ఫర్మేషన్ ఆఫీసర్ - సీఐవో)గా భవిష్యత్తులో సమాచార భద్రతకు పెట్టా ల్సిన పెట్టుబడులపై సలహాలు, నిర్ణయాలు; ప్రస్తుత, భవిష్యత్తు పెట్టుబడుల హేతుబద్ధీకరణ వంటి ప్రధాన బాధ్యతలు ఉంటాయి.

ఈ ఉద్యోగాలు కింది విధంగా ఉంటాయి.

- సెక్యూరిటీ అనలిస్ట్
- సెక్యూరిటీ ఇంజినీర్
- సెక్యూరిటీ ఆర్కిటెక్ట్
- సెక్యూరిటీ అడ్మినిస్ట్రేటర్
- సెక్యూరిటీ సాఫ్ట్‌వేర్ డెవలపర్
- క్రిప్టోగ్రాఫర్
- క్రిప్టనలిస్ట్
- చీఫ్ ఇన్‌ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్
- సెక్యూరిటీ కన్సల్టెంట్
- ఇంట్రూజన్ డిటెక్షన్ స్పెషలిస్ట్
- పెనెట్రేషన్ టెస్టర్.



ఏ కోర్సులు ఎక్కడెక్కడ?

- ఐఐటీ-భువనేశ్వర్ 2018 విద్యా సంవత్సరం నుంచి ఎంటెక్ స్థాయిలో నెట్‌వర్కింగ్, సైబర్ సెక్యూరిటీ, ఫోరెన్సిక్ స్పెషలైజేషన్‌తో కొత్త కోర్సును ప్రారంభించాలని నిర్ణయించింది.
- ఎన్ఐటీ-కురుక్షేత్ర రెండేళ్ల ఎంటెక్ సైబర్ సెక్యూరిటీ కోర్సును అందిస్తోంది.
- కేరళలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్‌లో రెండేళ్ల ఎమ్మెస్సీ కోర్సు ఉంది.
- బీటెక్ స్థాయిలో డెహ్రాడూన్‌లోని యూపీఈఎస్ సైబర్ సెక్యూరిటీపై నాలుగేళ్ల కోర్సు అందిస్తోంది.
- చెన్నైలోని హిందుస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లోని బీటెక్ (ఐటీ) కోర్సులో సైబర్ సెక్యూరిటీ స్పెషలైజేషన్ ఉంది.
- న్యూఢిల్లీలోని ఇంటర్‌నేషనల్ కాలేజ్ ఫర్ సెక్యూరిటీ స్టడీస్‌లో పీజీ డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ ఉంది.



- పుణేలోని సైబర్ సెక్యూరిటీ అండ్ రిసెర్చ్‌లో పీజీ డిప్లొమా ఇస్తున్నారు.
- సీడాక్‌లో ఆరు నెలల ఆన్‌లైన్ కోర్సు చేసుకోవచ్చు.
- ఎథికల్ హ్యాకింగ్‌లో హైదరాబాద్ మైత్రీవనంలోని ఎంటర్‌సాఫ్ట్ లాబ్స్ సంస్థ శిక్షణ ఇస్తోంది. అంతేకాకుండా అంతర్జాతీయ సంస్థ సెర్టికాం సర్టిఫికేషన్‌కి సంసిద్ధులను చేస్తోంది. ఈ సంస్థ ఇంటర్న్‌షిప్‌లకు కూడా అవకాశం కల్పిస్తోంది.
- హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని అడెప్ట్ టెక్నాలజీస్ ఎథికల్ హ్యాకింగ్‌లో శిక్షణ ఇస్తోంది.
- గుజరాత్ రాష్ట్రం సైబర్ సెక్యూరిటీ రంగంలో పరిశోధనల కోసం ప్రత్యేకంగా ఒక విశ్వవిద్యాలయాన్ని స్థాపించి స్వల్పకాలిక, దీర్ఘకాలిక కోర్సులను అందిస్తోంది.
- పుణే, ముంబయి, ఢిల్లీల్లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్‌ఫర్మేషన్ సెక్యూరిటీ పలు కోర్సులను ఆఫర్ చేస్తోంది.
- తిరుపతిలోని వేంకటేశ్వర యూనివర్సిటీలో సైబర్ సెక్యూరిటీ పదకొండు నెలల సర్టిఫికెట్ కోర్సు ఉంది.

ఈ కోర్సుల్లో శిక్షణ తీసుకోవడమే కాదు తర్వాత అభ్యాసం చేయడం కూడా చాలా అవసరం. కాబట్టి తగినంత ల్యాబ్ సమయం ఇచ్చే సంస్థలను ఎన్నుకోవాలి. ఫీజులు కొద్దిగా ఎక్కువగానే ఉంటాయి. తగిన నైపుణ్యాలను నేర్చుకొని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుంది.



సుస్థిరాభివృద్ధికి భారత ప్రభుత్వం చేపట్టిన చర్యలు



- 1972 నాటి వన్యప్రాణి సంరక్షణ చట్టాన్ని 1983లోనూ, 1986లో సవరించారు.
- 1974 నాటి జల కాలుష్య నిరోధక చట్టాన్ని 1988లో సవరించారు.
- భారత ప్రభుత్వ ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్‌ను 1978-79 సంవత్సరంలో తీసుకువచ్చింది.
- 1980 నాటి అటవీ సంరక్షణ చట్టాన్ని 1988లో సవరించారు.
- 1986లో పర్యావరణ పరిరక్షక చట్టాన్ని రూపొందించారు.
- 1980లో పర్యావరణ శాఖను కొత్తగా ఏర్పాటు చేశారు. 1985లో పర్యావరణ అటవీ శాఖలను ఒకే మంత్రిత్వశాఖ కిందకి తెచ్చారు. అదే సంవత్సరం..

1. సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ
2. వ్యవసాయం, సహకార శాఖ
3. బయోటెక్నాలజీ శాఖ
4. ఓషన్ డెవలప్‌మెంట్ శాఖ
5. అంతరిక్ష శాఖ
6. సంప్రదాయేతర ఇంధన వనరుల శాఖ
7. ఇంధన నిర్వహణా కేంద్రం
8. సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ కౌన్సిల్ తదితర శాఖలను సంస్థలను కొత్తగా ఏర్పాటు చేశారు.

- పర్యావరణ మంత్రిత్వశాఖ చేపట్టిన చాలా కార్యక్రమాలలో ముఖ్యమైనది - EOSE (Environmental Orientation to School Education)
- స్వచ్ఛంద సంస్థలకు నిధుల అందజేతకు దీనికింద నోడల్ ఏజెన్సీలను ఏర్పాటు చేసింది. అవి :

1. Centre for Environmental Education (CEE)- Ahmedabad
2. Uttarakhand Seva Nidhi (UKSN)- Almora
3. CPR- Environmental Education Centre- Chennai

- 1980వ సంవత్సరంలో కేంద్ర కాలుష్య నియంత్రణా బోర్డును, రాష్ట్రాల్లో ఇదే తరహా బోర్డులను ఏర్పాటు చేశారు.
- కేంద్ర అటవీ బోర్డును ఏర్పాటు చేశారు.
- ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా, వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సంస్థలను ఏర్పాటు చేశారు.
- నేషనల్ ల్యాండ్ యూజ్ అండ్ వేస్ట్‌ల్యాండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఏర్పాటైంది.
- జాతీయ బంజరు భూముల అభివృద్ధి బోర్డు ఏర్పాటైంది.
- ఇండియన్ బోర్డ్ ఆఫ్ వైల్డ్‌లైఫ్ ఏర్పడింది.
- సంయుక్త అటవీ నిర్వహణను ప్రభుత్వం 1990లో తీసుకువచ్చింది.
- కొన్నిచోట్ల జాతీయ పార్కులను, జంతు, పక్షి సంరక్షణా కేంద్రాలను ఏర్పాటు చేశారు.
- జాతీయ నదుల కార్యాచరణ పథకాన్ని రూపొందించారు.
- పోడు వ్యవసాయాన్ని నియంత్రించడానికి రాష్ట్రప్రభుత్వాలకు సాయం అందజేశారు.
- నదీలోయ ప్రాంతాల అభివృద్ధి నిమిత్తం రాష్ట్రాలకు కేంద్రం నిధులు అందజేసింది.
- వివిధ రంగాల్లో ప్రాజెక్టుల స్థాపనకు పర్యావరణ మార్గదర్శక సూత్రాలను రూపొందించారు.

భారత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు

1. సుస్థిరాభివృద్ధి అవార్డ్ :

- దీనిని 2005 నుండి ప్రపంచవ్యాప్తంగా సుస్థిరాభివృద్ధిని ప్రోత్సహిస్తున్న నాయకత్వానికి అందజేస్తున్నారు.
- దీనిని మొదటగా పొందినది - షోయిచిరో టోయోడా (జపాన్-2005).
- ఈ అవార్డును పొందిన ఇతర ప్రముఖులు- బాన్ కీ మూన్ (2009) - మన్మోహన్‌సింగ్ (2011) - జోస్ మాన్యుల్ దురావ్ బరోసో (2015)

2. ప్రపంచ సుస్థిరాభివృద్ధి ఫోరమ్ (2005) : ఇది సుస్థిరాభివృద్ధికి సంబంధించి ప్రపంచ జ్ఞాన సంపదను పెంచుకోవడానికి, విధానపరమైన చర్చ కొరకు ఏర్పాటుచేయడమైనది.

3. ఢిల్లీ సుస్థిరాభివృద్ధి శిఖరాగ్ర సమావేశం (డీఎస్‌డీఎస్) :

- దీనిని సహస్రాభివృద్ధి లక్ష్యాల (ఎండీజీస్) సాధనలో భాగంగా 2001లో న్యూఢిల్లీలో చేపట్టారు.
- దీని 2012 సదస్సులో భాగంగా ఏర్పాటుచేసిన అవార్డ్ - నకోలస్ బార్జెస్కూ రోజెన్ అవార్డ్ ఇతను శక్తివనరులపై పరిశోధన చేసిన శాస్త్రవేత్త.

టీఈఆర్ఐ ప్రకృతి పాఠశాల : దీన్ని జనవరి 2012న ప్రారంభించారు. విజన్- సుస్థిర విద్యను అందించడం.

సుస్థిరాభివృద్ధిలో ప్రభుత్వేతర సంస్థల (ఎన్‌జీఓ) పాత్ర

1. దశోలి గ్రామ స్వరాజ్యమండల్ :

- ఇది ప్రస్తుతం ఉత్తరాఖండ్‌లోని ఛమోలీ జిల్లాలో 1964లో ఏర్పడింది.
- ఇది 'చిప్కో' ఉద్యమంలో కీలకపాత్రను పోషించింది.
- ఇది అడవుల సంరక్షణ ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నది.

2. డెవలప్‌మెంట్ ఆల్టర్నేటివ్స్ - 1983 : ఇది అశోక్ ఖోస్లా ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో ఏర్పాటై సుస్థిరాభివృద్ధి కార్యక్రమాలను రూపకల్పన చేస్తున్నది.

3. ఫ్రెండ్స్ ఆఫ్ దూన్ - 1983 : ఇది అక్రమ గనుల తవ్వకం, అడవుల నరికివేతకు వ్యతిరేకంగా పనిచేస్తున్నది.

4. లడక్ జీవావరణ అభివృద్ధి గ్రూపు (ఎల్ఈడీజీ)- 1983 : ఇది లడక్ ప్రాంతంలోని లేహ్, కార్గిల్ జిల్లాలలో ఏర్పాటైనది.

- వీరు సుస్థిరాభివృద్ధిలో భాగంగా 'సేంద్రియ వ్యవసాయ పద్ధతు'లను ప్రోత్సహిస్తున్నారు.

5. సృష్టి : ఇది పర్యావరణ ఉన్నతికై 1988లో న్యూఢిల్లీ కేంద్రంగా ఏర్పడింది.

6. వనరాయ్ : ఇది 1992 పూణె కేంద్రంగా ఏర్పడింది.

- లక్ష్యాలు - పర్యావరణ పరిరక్షణ, సుస్థిర సమగ్ర గ్రామీణాభివృద్ధి.

విశాలాంధ్ర బిజినెస్

286.43 ▲	71.50 ▲	50 ▼	-900 ▼	డాలరు	ముడి ▼
సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	వెండి	Vs రూపాయి	చమురు
35,798.01	10,966.20	28,750	40,000	63.84	68.61
		22 క్యారెట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)		బ్రెంట్ ధర (డాలర్లలో..)

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
బీహెచ్ఇఎల్	104.35	7.03
టీసీఎస్	3,113.15	5.36
రిలయన్స్	971.20	4.50
యాక్సిస్ బ్యాంక్	621.35	3.52
ఓఎన్‌జీసీ	206.00	3.28

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
విప్రో	320.80	-2.33
టాటా మోటార్స్ (డి)	238.95	-2.05
భారతీ ఎయిర్‌టెల్	489.70	-1.62
ఏషియన్ పెయింట్స్	1,195.00	-1.40
హెచ్‌డీఎఫ్‌సీ	1,924.70	-1.38

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	63.84	63.87
యూరో	78.04	78.24
పౌండ్	88.50	88.83
ఆస్ట్రేలియా డాలర్	51.01	51.16
సింగపూర్ డాలర్	48.34	48.41

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	28,780	30,780
చెన్నై	28,780	30,780
బెంగళూరు	28,230	30,193
ముంబై	29,510	31,562
విజయవాడ	28,750	31,015

గూడులేని 17.70 లక్షల పేదలు

- 2022 నాటికి ప్రతి ఒక్కరికి గూడు అసాధ్యం
- మోడీ సర్కారును ఆక్షేపించిన సుప్రీంకోర్టు



విశాలాంధ్ర ప్రత్యేక ప్రతినిధి - న్యూఢిల్లీ: భారత్‌లో గూడు లేని నిరు పేదలు 17.70 లక్షల (1.77మిలియన్లు) మంది ఉన్నారు. ఈనేపథ్యంలో 2022 నాటికి ప్రతి ఒక్క భారతీయునికి సొంత గూడు కల్పించాలన్న ప్రధాని నరేంద్ర మోడీ నినాదం ఆచరణ సాధ్యమైనదిగా కనిపించడం లేదు. కాగా, ఇదే అంశంపై మోడీ సర్కారును సుప్రీంకోర్టు ఈనెల 13న ఆక్షేపించింది. నేషనల్ అర్బన్ లైవ్‌లీహుడ్ మిషన్ (ఎన్‌యూఎల్‌ఎం) పథకం కింద రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం బట్వాడా చేసే నిధులు సంబంధిత పథకానికే వినియోగమవుతున్నదీ లేనిదీ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) ద్వారా తనిఖీ జరిపించాలని ఆదేశించడం గమనార్హం. వీరి సంక్షేమానికి ఉద్దేశించిన, ఎన్‌యూఎల్‌ఎం పథకాని కంటూ కేటాయించిన నిధులను నిర్దేశిత లక్ష్యానికే వెచ్చించాలని, మరే ఇతర కార్యక్రమాలకూ ఆ నిధులను దారి మళ్లించరాదని సుప్రీంకోర్టు విస్పష్ట ఆదేశాలు జారీ చేయడం మోడీ సర్కారుకు చెంపపెట్టేనని భావించక తప్పదు. ఇలా ఆదేశాలు, హెచ్చరికలు కేంద్రప్రభుత్వానికి సుప్రీంకోర్టు జారీ చేయడం ఇదే మొదటి సారి కాదు. 2016లోనూ కేంద్రప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఇదే అంశంపై ఘాటుగానే హెచ్చరించింది. సమృద్ధిగా నిధులు ఉన్నప్పటికీ గూడు లేని పేదలకు పట్టణ ప్రాంతాల్లో నివాస సదుపాయం కల్పించడంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కనబరుస్తున్న బాధ్యతారాహిత్యాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. ఎన్‌యూఎల్‌ఎం పథకం ప్రయోజనం నెరవేరని కలగా మిగిలిపోవాల్సిందేనా? అంటూ నిలదీసింది.

దేశంలో గూడు లేని పేదలు ఎక్కడ చూసినా కనిపిస్తూనే ఉంటారు. విచిత్రమేమంటే వీరెవరూ ప్రభుత్వం దృష్టిలో పడకపోవడమే. ప్రభుత్వ నిర్వచనం ప్రకారం 'బహిరంగ ప్రదేశాల్లో, రోడ్డు పక్కన, పేవ్‌మెంట్ల మీద, దారి పక్కన హ్యూమ్ పైపుల్లోనూ, ఫ్లైఓవర్ల నీడన, మెట్ల పంచన బతుకులీడ్చే వారిని గూడు లేని లేదా నివాసం లేని వారుగా' పేర్కొంది వీరికి ఉద్దేశించి కనీస వసతులు కల్పించే విషయంలోనూ ప్రభుత్వాలు తరచూ విఫలమవుతూ వస్తున్నాయి. ఇందుకు మోడీ ప్రభుత్వానికీ మినహాయింపేమీ లేదు. వీరికి కనీస వసతులు కల్పించడానికంటూ కేటాయించిన నిధులనూ సక్రమంగా వెచ్చించలేని చేతకాని తనంలో మోడీ సర్కారు ఉంది. 2013 సెప్టెంబరులో ఎన్‌యూఎల్‌ఎం పథకాన్ని ప్రారంభించారు. పేదరిక నిర్మూలనతో పాటుగా పట్టణ పేదలకు గూడు కల్పించడం పథకం ముఖ్య ఉద్దేశాలుగా ఉన్నాయి. కాగా, గూడు లేని పట్టణ పేదల కోసమేకాక ఇతర కార్యక్రమాలు చేపట్టేందుకు రూ.1,000కోట్లను ఎన్‌యూఎల్‌ఎం పథకానికి మంజూరు చేయడం జరిగినట్లు సుప్రీంకోర్టుకు కేంద్రం వివరణ ఇచ్చింది. గత గణాంకాల ప్రకారం గూడు లేని జనాభా గ్రామీణ ప్రాంతాల్లో 28శాతం తగ్గినట్లుగానూ, పట్టణ ప్రాంతాల్లో 20శాతం పెరిగినట్లుగానూ తెలుస్తోంది.

గూడు లేని పేదలు వ్యవస్థాగతంగా ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రభుత్వాలే పరిష్కారం చూపాలి. బలవంతంగా ఖాళీ చేయించడం, ఇళ్లను కూల్చివేయడంపై జాతీయస్థాయిలో మారటోరియం (నిషేధం) అమలు జరపాలి. విస్తృత విధాన సారూప్యత, హౌసింగ్ పథకాల మధ్యన సామీప్యతలు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉండేలా ప్రభుత్వమే నిర్దిష్ట చర్యలు తీసుకోవాలి. వీటితో పాటుగా నీరు, పారిశుద్ధ్య కల్పన సక్రమంగా అమలు జరగాలి. ఇళ్ల తొలగింపు లేదా జప్తుకు గురయినపుడు బాధితుల తాలూకు సమగ్ర సమాచారాన్ని సకాలంలో సేకరించేందుకు ప్రభుత్వం సమర్థవంతమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. ఈ జాగ్రత్తలు పాటిస్తూ కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగిస్తే ఆశించిన ఫలితాలు కాస్తమేరకైనా దక్కే అవకాశాలున్నాయి.

బీజేపీపై కాంగ్రెస్ మరో వీడియో దాడి

న్యూఢిల్లీ : కాంగ్రెస్ దూకుడు పెంచింది. బీజేపీ, ఆరెస్సెస్‌లపై సామాజిక మాధ్యమాల బరిలో తీవ్రంగా తలపడుతోంది. తాజాగా మరో వీడియోను పోస్ట్ చేసింది. భారత రాజ్యాంగాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చేయాలని బీజేపీ, ఆరెస్సెస్ పంతం పట్టాయని ఆరోపించింది. రాజ్యాంగంపై ఆరెస్సెస్ సిద్ధాంతకర్తలు వెల్లడించిన అభిప్రాయాలను దీనిలో పొందుపరిచింది. కేంద్రమంత్రి అనంత్ కుమార్ హెగ్డే వ్యాఖ్యలతో ఈ వీడియో ప్రారంభమైంది. రాజ్యాంగాన్ని సవరించడానికే తాము అధికారంలోకి వచ్చినట్లు హెగ్డే చెప్తున్నట్లు కనిపిస్తోంది. ఆరెస్సెస్ వారసత్వాన్ని హెగ్డే అనుసరిస్తున్నారని ఆరోపించింది. ఆరెస్సెస్ సిద్ధాంతకర్త గోల్వాల్కర్‌ను చూపిస్తూ భారత రాజ్యాంగంలో భారతీయ భావనలు కానీ, రాజకీయ సిద్ధాంతాలు కానీ లేవని అభిప్రాయపడినట్లు పేర్కొంది. రాజ్యాంగంలో 'లౌకికవాదం'ను చేర్చడంపై జనసంఘ్ వ్యవస్థాపకుడు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వ్యక్తం చేసిన అభిప్రాయాన్ని దీనిలో ఉంచారు. భారతదేశాన్ని లౌకికరాజ్యంగా ప్రకటించడం ద్వారా భారతదేశ ఆత్మపై దాడి జరిగిందని, లౌకికవాద రాజ్యమంటే పూర్తిగా కష్టాలే ఉంటాయని దీన్‌దయాళ్ అన్నారని పేర్కొంది.

పెద్ద నోట్ల రద్దు ప్రభావం

2 లక్షల మందికి ఐటీ నోటీసులు

న్యూఢిల్లీ : ఆదాయపు పన్నుశాఖ సుమారు 2 లక్షల మందికి నోటీసులు జారీ చేసింది. రూ.20 లక్షలకు పైగా విలువగల రద్దయిన రూ.500, రూ.1,000 నోట్లను జమ చేసి, ఆ సొమ్ముకు సంబంధించిన సమాచారాన్ని వెల్లడించనివారికి ఈ నోటీసులు పంపించింది. ఆదాయపు పన్ను శాఖ తెలిపిన వివరాల ప్రకారం రద్దయిన నోట్లను మార్చుకునేందుకు ఇచ్చిన గడువులోగా రూ.20 లక్షలకుపైగా జమ చేసినవారికి ఆ సొమ్ముకు సంబంధించిన వివరాలను తెలియజేయడానికి చాలా సమయం ఇచ్చారు. అయినప్పటికీ సమాచారాన్ని ఇవ్వకుండా, రిటర్నులు దాఖలు చేయకుండా తప్పించుకుంటున్నవారికి ప్రస్తుతం నోటీసులు పంపించారు. రిటర్నులు దాఖలు చేయాలని కోరారు. పెద్ద నోట్ల రద్దు తర్వాత రూ.500, రూ.1,000 నోట్ల డిపాజిట్లను పరిశీలించారు. వీటిలో రూ.5 లక్షలకు పైగా డిపాజిట్ చేసినవారిలో 18 లక్షల మందిపై అనుమానం వ్యక్తమైంది. వీరిలో 12 లక్షల మందికి సంబంధించిన వివరాలను ఆదాయపు పన్ను శాఖ పోర్టల్ ద్వారా తనిఖీ చేశారు.

వరుసగా నాలుగవ సెషన్‌లో..

నూతన గరిష్టాలకుచేరిన సెన్సెక్స్, నిఫ్టీ

లాభాల్లో ఐటీ, రియాల్టీ, కాపిటల్ గూడ్స్



ముంబై: దేశీయ మార్కెట్లు వారం ప్రారంభంలో జోరందుకున్నాయి. వరుసగా నాలుగవ సెషన్ అయిన సోమవారం సెన్సెక్స్,నిఫ్టీ సరికొత్త లాభాలను నమోదుచేశాయి. డొమెస్టిక్ ఈక్విటీలు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. కార్పొరేట్ ఫలితాలు అనుకూలంగా రావడం, తాజాగా జీఎస్‌టి పన్నుల విధానంలో అమలు చేసిన సరికొత్త మార్పులతో మదుపరులు పెట్టుబడులు పెట్టేందుకు ఉత్సాహం చూపినట్లయిది. 30షేర్ల బిఎస్‌ఇ ఇండెక్స్ సూచీలు 286.43 పాయింట్లతో 0.81శాతంతో 35,798.01 పాయింట్లు నమోదుచేసింది. ఎన్ఎస్ఇ ఇండెక్స్ నిఫ్టీ 71.5 పాయింట్లతో 0.66శాతంతో 10,966.20 పాయింట్ల వద్ద నిలదొక్కుకుంది. సెన్సెక్స్ ఇంట్రాడేలో 35,827.70 పాయింట్లతో అత్యధిక గరిష్టాలను నమోదుచేసింది.

బిఎస్‌ఇ సెక్టరల్ సూచీల్లో ఐటి సూచీలు 2.01 శాతం, రియాల్టీ 1.95శాతం, క్యాపిటల్ గూడ్స్ 1.79 శాతం, టెక్ 1.38శాతం లాభాలను నమోదుచేసింది. మరోవైపు మెటల్ ఇండెక్స్ 0.82శాతం పిఎస్‌యు 0.21 శాతం నష్టాల్లో నమోదయ్యాయి. సెన్సెక్స్ ప్రధాన లబ్దిఆరులుగా టిసిఎస్, రిలయన్స్,యాక్సిస్‌బ్యాంకు, ఓఎన్‌జిసి, యస్ బ్యాంకు కాగా నష్టపోయినవారిలో విప్రో, బారతిఎయిర్‌టెల్, ఆసియన్ పెయింట్స్, హెచ్‌డిఎఫ్‌సి, ఎస్‌బీఐ ఉన్నాయి. ఐటి స్టాక్స్‌లో టిసిఎస్ రూ.3,130లకు పెరిగింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రికార్డుస్థాయిలో రూ.5.76 లక్షల కోట్లకు చేరింది. ఎస్ అండ్ పి బిఎస్‌ఇ ఐటి ఇండెక్స్ అత్యధికంగా 12,486.90తో 1.94శాతం ఇంట్రా డే ట్రేడింగ్ జరిపింది. టిసిఎస్‌తో పాటు ఇతర ఐటిస్టాక్స్ అయిన మైండ్ ట్రీ, నిట్ టెక్నాలజీస్, టాటా ఎలెక్సి, టెక్ మహీంద్రా, నిట్ లిమిటెడ్ ర్యాలీ సృష్టించాయి.ఓఎన్‌జీసి షేర్లు ఏడాది అనంతరం 6.3శాతం పెరిగాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ అత్యధికంగా 3.1శాతం లాభాలను నమోదు చేసింది. దేశీయ మూడవ అతిపెద్ద సాఫ్ట్‌వేర్ దిగ్గజసంస్థ విప్రో షేర్లు 3.2 శాతం నష్టాల్లో ముగిసింది.

విదేశీ మదుపరులు సుమారు రూ.988.25 కోట్లు కొనుగోలుచేయగా దేశీయ మదుపరులు రూ.209.68 కోట్లు కొనుగోలు చేసినట్లు నమోదైంది. జపాన్ వెలుపల ఆసియా పసిఫిక్ షేర్లు 0.1శాతం, జపాన్ నిక్కీ 0.15 శాతం దిగజారినట్లు తెలుస్తోంది. ఎస్ అండ్ పి 500 మిని ఫ్యూచర్స్ 0.1శాతం దిగజారింది.

హిండ్‌వేర్ నుంచి ట్రూఫ్లో పైపులు



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: దేశ అగ్రగామి శానిటరీ వేర్ కంపెనీ అయిన ఐకానిక్ బ్రాండ్ హిండ్‌వేర్ రూపకర్త హెచ్ఎస్ఐ ఎల్ సంస్థ తెలంగాణలోని మెదక్ జిల్లా హుస్నా పూర్‌లో రూ.160 కోట్ల వ్యయంతో తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఇంటి ప్లంబింగ్ పైప్స్‌ను ఇక్కడ భారీ ఎత్తున తయారు చేస్తున్నారు. గృహ నిర్మాణానికి సంబంధించి అన్నిరకాల ప్లంబింగ్ సామాగ్రిని అందిస్తోంది. ఏటా 30 వేల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కలిగివున్న ఈ ప్లాంట్ 2020 నాటికి 60 వేల మెట్రిక్ టన్నులకు ఉత్పత్తిని పెంచుకోనున్నట్లు సంస్థ వీసీఎండీ సందీప్ సోమాని తెలిపారు. ఇంటి నిర్మాణ విభాగంలో తాగునీటి రవాణా, నీటి సంరక్షణ, శానిటేషన్ అవసరాలను తీర్చేలా అన్నిరకాల సీపీవీసీ, యూపీవీసీ పైపులు, ఫిట్టింగ్స్‌ను "ట్రూఫ్లో" పేరిట తాము తయారు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మెటల్ పైపుల వినియోగం పెద్ద ఎత్తున జరిగేదని, ఇక భవిష్యత్ అంతా సీపీవీసీ పైపులదేనని ఆయన తెలిపారు. జపాన్‌కు చెందిన సెకిసుయ్ కెమికల్ కంపెనీ లిమిటెడ్‌తో సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించి ఈ సంస్థ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. హుస్నాపూర్ ప్లాంట్‌లో 200 మంది పనిచేస్తున్నారు. ఈ ప్లాంట్ మొత్తం ఆటోమెటిక్ ప్లాంట్. ప్రపంచస్థాయి సాంకేతిక పరిజ్ఞానంతో దేశంలోనే ఈ పరిశ్రమలో తొలి ప్లాటిమన్ గ్రీన్ భవనంగా తమ ప్లాంట్ నిలుస్తోందని సోమాని తెలిపారు.

ఫార్మాసిస్టులకు అద్భుత యాప్



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఫార్మసిస్టులు, రిటైలర్లకు అద్భుతమైన ఒక యాప్‌ను కార్నియా టెక్నాలజీస్ సొల్యూషన్స్ లిమిటెడ్ ప్రవేశ పెట్టింది. రెండు తెలుగు రాష్ట్రాల ఫార్మసిస్టులకు "గో డిజిటల్ ప్రోగ్రామ్" (ఈగిల్ఐ)ను అందిస్తుంది. దేశంలోనే తొలి క్లౌడ్‌బేస్డ్ కంపెనీగా టార్నియా నిలుస్తోంది. ప్రతి రిటైలర్ ఒక అమెజాన్‌లాగా విక్రయించాలని, వాల్మార్ట్ లాంటి కొనుగోలు జరపాలన్నది టార్నియా ముఖ్యఉద్దేశమని సంస్థ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ సురేష్ సత్యమూర్తి వెల్లడించారు. తమ యాప్ యాండ్రాయిడ్ సౌకర్యం ఉన్న అన్ని ఫోన్లు, ట్యాబ్స్, పిసిలలో వినియోగించుకోవచ్చు. రోజుకు ఎంత వ్యాపారం చేస్తున్నారు, ఎంత లాభం వస్తుంది, ఏయే మందుల స్టాక్ తక్కువగా ఉంది, ఒక మందుకు బదులు ఏ మందును ప్రత్యామ్నాయంగా ఇవ్వవచ్చు తదితర వివరాలను కూడా ఈ యాప్ ద్వారా క్షణాల్లో తెలుసుకోవచ్చు. ఒక బ్రాండ్ ఔషధం దొరకకపోతే దాని బదులు ఇంకొక బ్రాండ్ ఔషధాన్ని వినియోగించుకోవచ్చని కూడా రోగులను ఈ యాప్ చైతన్యవంతులను చేస్తుందన్నారు. టెలీ మెడిసిన్, డిజిటల్ పేమెంట్‌లకు ఈ యాప్ ఎంతో ఉపయోగపడుతుంది. ప్రస్తుతం తమకు 700 మంది వినియోగదారులు ఉన్నారని సురేష్ తెలిపారు.

హైటెక్స్‌లో అతిపెద్ద గార్మెంట్ ఫెయిర్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: అప్పెరల్ మానిఫ్యాక్చరర్స్ ఆధ్వర్యాన హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ట్రేడ్ ఫెయిర్ ఫిబ్రవరి 6 నుండి 9వ తేదీ వరకు జరగనుంది. మొదటిసారిగా ఎంఎఐ తమ జోన్ ట్రేడ్ ఫెయిర్‌ను నిర్వహిస్తోంది. కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన రిటైలర్లు, ఎంబీఓలు, మానిఫ్యాక్చరర్స్, చెయిన్‌స్టోర్స్‌లు పాల్గొననున్నాయి. ముంబాయి నుంచి 135కు పైగా బ్రాండ్లు తమ తాజా కలెక్షన్‌ను ఇక్కడి రిటైలర్లు, ఎంబీఓల కోసం ప్రదర్శించనున్నారు. నాలుగురోజుల ఈ పెయిర్‌లో రూ.50 కోట్ల విలువచేసే వ్యాపారం జరుగుతుందని భావిస్తున్నారు. ఎథోస్, జీవాన్కీ ఎరా, ఫైనల్ ఛాయిస్, టోర్సో షర్ట్స్, దియా డిజైన్స్ స్టూడియో, బిగ్ బ్రదర్, హన్సి, ఫయాన్ ట్రూప్, ప్రైమిడిజైన్స్ లాంటి బ్రాండ్లు ఈ ఫోర్‌లో పాల్గొననున్నట్లు ఎంఎఐ నిర్వాహకులు నిఖిల్ పురియా తెలిపారు. 2015 జనవరిలో కొచ్చిన్‌లో మొదటిసారిగా ఫెయిర్‌ను నిర్వహించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు 12 ఫెయిర్‌లు జరిగాయి. దక్షిణ భారతదేశంలో అతిపెద్ద గార్మెంట్ ఫెయిర్‌గా ఈ ట్రేడ్ ఫెయిర్ నిలువనుంది.



విజయవాడలో ఘనంగా ఆరెంజ్‌డే..!

విజయవాడ : ఇప్పటివరకూ ఢిల్లీ, అహ్మదాబాద్, పునె, కోల్‌కతా, బెంగళూరు, చెన్నై, ముంబై, తదితర నగరాలకే పరిమితమైన ఆరెంజీ డేను కేటీఎం విజయవాడలో నిర్వహించింది. స్థానిక తాడేపల్లి విజయవాడ క్లబ్ దగ్గర సోమవారం సాయంత్రం ఆరెంజీడేను ఉత్సాహభరితంగా నిర్వహించారు. రైసింగ్ ప్రదర్శనలో పాల్గొనటానికి రైడర్లు స్వచ్ఛందంగా రిజిస్టర్ చేసుకున్నారు. వీరికి కేటీఎం ప్రొఫెషనల్స్ వివిధ మెళుకువలను, కేటీఎంల నుంచి పొందే ప్రయోజనాలను వివరించారు. ట్రాక్‌పై బైకింగ్ విధానాలను ప్రత్యక్షంగా వివరించారు. 200 మంది డ్యూక్ కస్టమర్లు, 200 ఆర్సీ కస్టమర్లు ఈ రేసింగ్‌లో పాల్గొన్నారు. పోడియం ఫినిషర్లకు కేటీఎం బ్రాండెడ్ మర్చండైజ్, పవర్ పార్ట్‌లను బహూకరించారు. ట్రాక్‌పై అన్ని యాక్షన్స్ ప్రదర్శించారు. సర్వీస్ క్యాంప్ నిర్వహించారు. పవర్ పార్ట్స్ కోసం ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బజాజ్ ఆటో లిమిటెడ్ ప్రోబైకింగ్ ప్రెసిడెంట్ అమిత్ నంది మాట్లాడుతూ, రేసింగ్‌తో కేటీఎం బ్రాండ్ సంస్కృతి అంతర్భాగమైందని, కేటీఎం అందించే థ్రిల్‌ను అనుభవించటమే కాదు, ప్రశంసిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలోని అన్ని ప్రధాన నగరాలకూ ఆరెంజీడేను విస్తరిస్తామన్నారు.

మాంటె కార్లో నుంచి స్టేట్మెంట్ సాక్స్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఫాషన్ బ్రాండ్ మాంటె కార్లో నుంచి ఈ సీజన్‌లో స్టేట్మెంట్ సాక్స్ కొత్త వేరియంట్లు విడుదలయ్యాయి. చలి వాతావరణంలో పాదాలను వేడిగా ఉంచేలా వీటిని తయారుచేసినట్లు మాంటె కార్లో డైరెక్టర్ మోనికా ఓస్వాల్ చెప్పారు. ఫైబర్స్ యొక్క అధిక నాణ్యత మిశ్రమం నుంచి తయారు చేయబడిన, మోంటే కార్లో సాక్స్ అత్యంత సౌకర్యవంతమైన, విలాసవంతమైనవని అన్నారు. సేకరణ కూడా చల్లని రోజుల్లో గరిష్ట వెచ్చదనాన్ని అందించడానికి 100 శాతం ఉన్ని కలిగి ఉందన్నారు.

రూ.249కే ఐకాల్ కె71 సెల్‌ఫోన్




విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ప్రపంచంలోనే అతితక్కువ ధర కలిగిన ఫోన్ భారత్ మార్కెట్లోకి ప్రవేశించింది. ఐ కాల్ కె71 సెల్‌ఫోన్ కేవలం రూ.249కే లభిస్తోంది. అయితే ఇది ఆన్‌లైన్ ద్వారా షాప్‌క్లూజ్ డాట్‌కామ్ నుండి మాత్రమే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. గ్రామీణ భారతావనిని సుసంపన్నం చేసేందుకు, ప్రతి ఒక్కరికి చేరువచేసేందుకు వీలుగా ఈ ఫోన్‌ను తయారు చేసినట్లు షాప్‌క్లూజ్ సంస్థ సీనియర్ డైరెక్టర్ రౌనక్ రహేజా తెలిపారు. 4 గంటల టాక్‌టైమ్, 800 ఎంఎహెచ్ లియాన్ బ్యాటరీ, 24 గంటల స్టాండ్‌బై టైమ్, 1.4 మోనో క్రోమ్ డిస్‌ప్లే, టార్చ్, ఎఫ్ఎం రేడియో, వైబ్రేషన్ ఈ ఫోన్ ప్రత్యేకతలు. ఈ ఫోన్‌కు బిఐఎస్ సర్టిఫికెట్ కూడా ఉంది.

విజ్ఞానం

ఆల్కాహాల్‌తో కాలేయ సమస్యలు

యుక్తవయసులో ఆల్కాహాల్‌కు అలవాటుకావడంతో కాలేయ సమస్యలు మరింతగా పెరిగే ప్రమాదం ఉందని తాజా అధ్యయనం వెల్లడించింది. లివర్ సిర్రోసిస్ తదితర వ్యాధులకు ఆల్కాహాల్ ప్రధాన కారణంగాఉందని స్వీడన్ అధ్యయనకారులు వెల్లడించారు. రోజుకు 30గ్రాములు ఆల్కాహాల్ తీసుకోవడం పురుషుల్లో కొంతవరకు లివర్ వ్యాధులను అరికట్టవచ్చునని తెలుస్తోంది. యుక్తవయసులో తీసుకునే ఆల్కాహాల్ ప్రభావం తదనంతర జీవితంలో ఎదురయ్యే పలు కాలేయ సమస్యలకు కారణమవుతోంది. ఆయా మనుషుల బాడీ మాస్ ఇండెక్స్, స్మోకింగ్, నార్కోటిక్స్ వినియోగం, కాగ్నిటివ్ ఎబిలిటీ, కార్డియో వాస్కులార్ కెపాసిటీపై వ్యాధుల ప్రభావం ఆధారపడి ఉంటుంది. 39 ఏళ్లుదాటిన 383మంది పురుషులపై చేసిన అధ్యయనంలో లివర్‌సిర్రోసిస్ గుర్తించబడినవారిలో ఎక్కువమంది యుక్తవయసులో ఆల్కాహాల్‌కు అలవాటుపడిన వారే...వీరిలో లివర్‌సిర్రోసిస్, లివర్ ఫెయిల్యూర్ బారినపడినవారేనని తెలుస్తోంది.



కేన్సర్ నియంత్రణకు జన్యుమార్పిడి బ్యాక్టీరియా

ఈ కోలి నిసెల్ అనే సాధారణ బ్యాక్టీరియా జన్యువుల్లో మార్పులు చేస్తే....అది కేన్సర్‌కణాల్లోని హెపరాన్ సల్ఫేట్ ప్రొటియోగ్లైకన్‌కు అతుక్కుంటుందనీ....బ్రాకోలిలో ఉండే గ్లూకోసినోలేట్స్ అందితే సల్ఫరోఫెన్‌గా మారిపోతాయని తాజా పరిశోధనల్లోపాల్గొన్న శాస్త్రవేత్త మాథ్యూ ఛాంగ్ తెలిపారు. సల్ఫరోఫేన్‌కు కేన్సర్ కణాలను చంపేసే లక్షణముంది. మన పేగుల్లో కనిపించే సాధారణ బ్యాక్టీరియాను కేన్సర్‌పై అస్త్రంగా మార్చడంలో నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ శాస్త్రవేత్తలు విజయం సాధించారు. సల్ఫరోఫెన్‌కు కేన్సర్ కణాలను చంపే లక్షణమంది. వీరు జరిపిన పరిశోధనలో దాదాపు 95శాతం పేగులు, మలద్వార కేన్సర్ కణాలు నాశనమైనట్లు తెలుస్తోంది. జన్యుమార్పిడి చేసిన బాక్టీరియాను మానవుల్లోకి చొప్పించడంపై పలు ఇబ్బందులు ఉన్నాయనీ దీనిపైమరింత పరిశోధన కొనసాగుతోందని తెలిపారు.



అన్ని రైళ్లలో సీసీటీవీ నిఘా!

న్యూఢిల్లీ: రైల్వే ప్రయాణికుల భద్రతకు పెద్దపీట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకోసం అన్ని రైళ్లు, రైల్వే స్టేషన్లలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు 2018-19 బడ్జెట్‌లో సుమారు రూ.3వేల కోట్ల మేర కేటాయింపులు జరపనుంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 395 రైల్వేస్టేషన్లు, 50 రైళ్లలో మాత్రమే సీసీటీవీ కెమెరాల వ్యవస్థ ఉంది. ఇకపై ప్రీమియర్, సబర్బన్ సహా 11వేల రైళ్లు సహా దేశవ్యాప్తంగా ఉన్న 8,500 రైల్వేస్టేషన్లలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. బోగీ ద్వారం మొదలుకుని లోపల అన్నిచోట్లా నిఘా ఉండే విధంగా ఒక్కో కోచ్‌లో మొత్తం 8 సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. రానున్న రెండేళ్లలో రాజధాని, శతాబ్ది, దురంతో సహా అన్ని మెయిల్/ఎక్స్‌ప్రెస్, పాసింజర్ రైళ్లలో ఈ నూతన వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు ఆ శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు సంబంధించి నిధుల కోసం రైల్వే శాఖ వివిధ మార్గాలను అన్వేషిస్తోంది. అవసరమైతే మార్కెట్ నుంచి నిధులు సమకూర్చుకోవాలని భావిస్తోంది. మరోవైపు గతేడాది రైళ్లు పట్టాలు తప్పిన ఘటనలు ఎక్కువగా చోటుచేసుకున్న నేపథ్యంలో ఈ బడ్జెట్‌లో ఎక్కువగా రైల్వేలో భద్రతకు పెద్దపీట వేయనున్నారు. దీనికి సంబంధించిన వివరాలను కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ బడ్జెట్‌లో ప్రస్తావించనున్నారు. 4,943 మానవ రహిత లెవెల్ క్రాసింగులను తొలగించడంతో పాటు పాత పట్టాలు మార్చడం, పట్టాలను మరింత బలోపేతం చేసే దిశగా బడ్జెట్ కేటాయింపులు ఉండనున్నాయి. 2020 నాటికి అన్ని మానవరహిత లెవెల్ క్రాసింగులను తొలగించేందుకు రైల్వేశాఖ లక్ష్యంగా పెట్టుకుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.



పాలసీ బజార్‌కు టిస్కా చోప్రా, పంకజ్ ప్రచారకర్తలు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: దేశంలోనే అతిపెద్ద ఇన్సూరెన్స్ వెబ్‌సైట్ అయిన పాలసీ బజార్ డాట్ కామ్ పోర్టల్‌కు ప్రముఖ నటులు టిస్కా చోప్రా, పంకజ్ త్రిపాఠిలు ప్రచారకర్తలుగా నియమితులయ్యారు. పాలసీ బజార్ డాట్ ఇన్ సంస్థ ప్రధానంగా ట్విట్టర్‌ను, వెబ్‌సైట్లను నిర్వహిస్తుంది. ఆరోగ్యబీమాకు సంబంధించి విస్తృతంగా ప్రచారం చేస్తోంది. దేశంలో వివిధ వ్యాధుల బారినపడుతున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతుంది. అలాగే వారి వైద్య ఖర్చుల బిల్లులు భారీగా ఉంటున్నాయి. 70 శాతం వైద్య ఖర్చులు ఎవరికివారు సొంతంగా భరిస్తున్నారు. ఆరోగ్యబీమా చెప్పుకున్నంతగా విస్తృతం కావడం లేదు. ఈ గ్యబీమా వల్ల ఎంతో ప్రయోజనం చేకూరుతుందని సంస్థ ప్రధానాధికారి ధ్రువ్ శరీన్ తెలిపారు. "మజ్బూరి నహీ హెల్త్ ఇన్సూరెన్స్ చునియే" పేరిట ఈ నటీనటులు తమ సంస్థ తరపున ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

సగ్గుబియ్యం

మనం ఏదైనా విజయాన్ని సాధించినపుడు నోరు తీపి చేసుకోండి అంటారు. పాయసం చేసి తినిపిస్తారు. పాయసం చేసుకునే పదార్థాలలో ముఖ్యమైనవి సగ్గుబియ్యం. సగ్గు బియ్యాన్ని సేమియాలాంటి పదార్థాలతో కలిపి పాయసంగా చేస్తారు. అయితే ఈ సగ్గుబియ్యాన్ని పాయసంగానే కాదు రక రకాల వంటకాలను తయారుచేస్తుంటారు. ఇవి చక్కగా ముచ్చటా తెల్లని రంగులో ముత్యాల్లా మెరుస్తుంటాయి. మరి ఇలాంటి సగ్గుబియ్యం ఎలా వస్తాయో తెలుసుకుంటాం. సగ్గుబియ్యం చెట్లకు కాయవు. వరిపంటలాగా పండించరు. మరి ఇవి ఎలా వస్తాయో తెలుసా! ఒక దుంపనుంచి. బంగాళా దుంప, చిలగడదుంప, చామదుంపల మాదిరిగానే ఉం టుంది. అయితే దీనిని కర్రపెండలం అంటారు.



కర్రపెండలం దుంపల్ని నేలనుంచి తవ్వి బయటకు తీస్తారు. వీటిపైన ఉండే తొక్కను యంత్రాలతో తొలగిస్తారు. దుంపలకున్న తొక్కను శుభ్రంగా తీసివేసి నీటితో దుంపలను శు భ్రం చేస్తారు. ఆ దుంపల్ని క్రషర్‌లో పెట్టి పాలను తీస్తారు. చెరుకు నుంచి రసాన్ని ఎలా తీస్తారో అలా దుంపల నుంచి పాలను తీస్తారు. ఆ పాలలోని మలినాల్ని తీయడానికి ఫిల్టర్ల ద్వారా పంపుతారు. మలినాలు నురగలుగా పైకి తేలుతాయి.



అడుగున కాస్త చిక్కగా పాలు మిగులుతాయి. వీటిలో 45శాతం తేమ ఉండేలా జాగ్రత్త తీసుకుంటూ ఆ పాలను ఎండబెట్టి పొడిలా తయారుచేస్తారు. ఎండిన ఆ పొడిని వివిధ రకాల పరిమాణాల్లో జల్లెడలా ఉండే యంత్రాల ద్వారా పంపిస్తారు. జల్లెడకు ఉండే రంధ్రాల నుంచి గుండ్రని సగ్గుబియ్యం వస్తాయి. మెత్తగా ఉండే వీటిని తెల్లటిరంగు పోకుండా కొంతసేపు వేడిచేసి ఆరబెడతారు. ప్రాంతాల్ని బట్టి వీటి తయారీలో కొన్ని మార్పులు చోటుచేసుకుంటాయి. అలా తయారై వచ్చిన సగ్గుబియ్యాన్నే మనం వివిధ రూపాలుగా వినియోగిస్తారు.

అయితే ఈ సగ్గుబియ్యం ఫ్యాక్టరీలు ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లాలో ఎక్కువగా ఉన్నాయి. సామర్లకోట పరిసర ప్రాంతాల్లో వేల ఎకరాల్లో కర్రపెండలం పండిస్తారు. అక్కడ సగ్గుబియ్యం తయారీ మిల్లులున్నాయి. మనదేశంలో కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో సగ్గుబియ్యం తయారీ ఎక్కువగా ఉంటుంది. సగ్గుబియ్యంలో కొవ్వు, ప్రోటీన్ల శాతం తక్కువ. కార్బోహైడ్రేట్స్ ఎక్కువ. ఇండోనేషియా, మలేసియాలు సగ్గుబియ్యాన్ని ఎక్కువగా ఎగుమతి చేసే దేశాలు. ఐరోపా, ఉత్తర అమెరికా ఖండాలు సగ్గుబియ్యాన్ని ఎక్కువగా దిగుమతి చేసుకుంటాయి. ఆసియా దేశాల్లో సగ్గుబియ్యం ఉత్పత్తి ఎక్కువగా ఉంటుందని అంటారు.

సగ్గుబియ్యం ఏ రకమైన పంటాకాదు. దీనికి ముడిసరుకు కర్రపెండలం. ఇది పరిశ్రమల్లో మాత్రమే తయారవుతుంది. సగ్గుబియ్యంతో తియ్యని పాయసమే కాదండోయ్ ఉప్మా, వడియాలు, అప్పడాలు వంటివి ఎన్నో తయారుచేస్తారు. సగ్గుబియ్యాన్ని రకరకాల పేర్లతో పిలుస్తారు. సాబుదాన్, సాగో, సగ్గుబియ్యం అని పిలుస్తారు. ఇదండీ మన తెలుగింటి పాయసంలో వాడే సగ్గుబియ్యం కథ.



పూలచెట్లు- బొగ్గుపులుసు వాయువు

వాతావరణంలో మార్పులు ఎప్పటికప్పుడు మారిపోతుంటాయి. ఆ మార్పులకు అనుగుణంగానే అడవుల్లోని పూలచెట్లు స్పందిస్తున్నట్లు తాజాగా చేసిన ఓ అధ్యయనంలో వెలువడింది. కార్బన్‌డై ఆక్సైడ్ (బొగ్గుపులుసువాయివు) పెరుగుతున్న కొద్దీ ఉష్ణమండల అడవుల్లోని పూలు అధికంగా వికసిస్తు న్నట్లుగా శాస్త్రవేత్తలు గుర్తించారు. గత 28ఏళ్ళుగా పనామాకు చెందిన బర్రోకొలరాడో ద్వీపంలోని దట్టమైన అడవుల్లో పరిశోధనలు జరిపారు. అనేక రకాల చెట్ల భాగాలను సేకరించి విస్తృత పరిశోధనల అనంతరం కొన్ని విషయాలు వెలుగులోకి తెచ్చారు. అవేమంటే దశాబ్దాల తరబడి ఉష్ణోగ్రతలు, బొగ్గుపులుసు వాయువు పెరుగు తుండగా, అదే సమయంలో ఉష్ణమండల అడవులు వాటని నియంత్రించేందుకు అమాంతం పూల ఉత్పత్తిని పెంచుతున్నాయని పరిశోధనలో తెలి సింది. వాతావరణం సాధారణంగా ఉన్నప్పుడు అడ వులు కూడా సాధారణ:గానే స్పందిస్తున్నట్లు అమెరి కాలోని ఫ్లోరిడా స్టేట్ విశ్వవిద్యాలయానికి చెందిన స్టెఫనైపోఅనే శాస్త్రవేత్త తెలిపారు. ఉష్ణమండల ప్రాంతాల్లో అవి స్పందిస్తున్న తీరుతో ఆయా



ప్రాంతాలు వేడెక్కకుండా ఉండే అవకాశం ఉందని తెలిపారు. వివిధ రకాల పూలు వికసిస్తున్న సమ యంలో ఉష్ణోగ్రతలు, కాంతి, వర్షపాతం, బొగ్గు పులుసు వాయువు పరిమాణాలు, స్థాయిలను శాస్త్రవేత్తలు పరిశీలించారు. వాతావరణంలో ఉన్న బొగ్గుపులుసు వాయువును చెట్లు చక్కెర రూపంలోని ఇంధన శక్తిగా మారుస్తున్నట్లు గుర్తించారు. బొగ్గు పులుసు వాయువు ఎంతగా వాతావరణంలోకి విడుదలైతే పూలచెట్లు అంతగా కొత్త ఇంధన శక్తిని ఉత్పత్తి చేయగలుగుతున్నట్లు పౌ తెలిపారు. పరిసరా లలో పచ్చని చెట్లు ఉండాలంటారు కదా! అవి పూల చెట్లయితే వాతావరణంలోని కార్బన్‌డైఆక్సైడ్‌ను హరిం చివేస్తాయి అని అనవచ్చు. మన చుట్టుపక్కల, ఇంటి పరిసరాలలో పూలచెట్లు అవీ నీరు తక్కువగా ఉపయో గించే చెట్లను పెంచటానికి ప్రయత్నిస్తే కార్బన్‌డైఆక్సైడ్ ద్వారా కలిగే కాలుష్యానికి చెక్ పెట్టవచ్చు.



కిరణజన్య సంయోగక్రియ

మొక్కలు ఆహారం తయారుచేసుకోవా లంటే ఈ క్రియ జరగాలి. అయితే ఇది మొక్కలలో భూమిపై 125ఏళ్ళ క్రితమే ప్రారంభమయిందని తాజాగా కనుగొన్నారు. ప్రాణవాయువు ఉత్పత్తి కావాలంటే ప్రధాన ఆధారం కిరణజన్య సంయోగక్రియ. 1990లో ఆర్కిటిక్ కెనడాలోని కొండల్లో 'బంగియో మార్ఫాఫ్యుబెసెన్స్' అనే శైవల శిలాజంపై విస్తృతంగా పరిశోధనలు చేసి కెనడా పరిశోధ కులు ఈ విషయాన్ని వెల్లడించారు. మొక్కల కణంలోని భాగమైన హరితరేణువులో కిరణ జన్యసంయోగక్రియ జరుగుతుంది. ఈ ప్రక్రి యలో ఆక్సిజన్ వాతావరణంలో విడుదలయి కార్బన్‌డైఆక్సైడ్ శాతాన్ని తగ్గిస్తాయి.



ఆకాశంలో ఆభరణం

ఆకాశంలో ఆభరణం ఏమిటీ అనుకుంటు న్నారా! విశ్వంలో నక్షత్రాలు, గ్రహాలు, ఉప గ్రహాలు ఉంటాయని తెలుసు. అయితే ఇటీవల నాసా (అమెరికా అంతరిక్ష సంస్థ) విశ్వంలో ఒక వింతను కనుగొంది. సుదూర విశ్వంలో వర్ణరంజితమైన ఆభరణంలా ధగధగలాడుతున్న ఒక గ్రహ నెబ్యూలాను నాసా శాస్త్రవేత్తలు క్లిక్‌మనిపించారు. దీన్ని హబుల్ స్పేస్ టెలిస్కోపు సాయంతో ఫోటో తీశారు. వెలుపలికి జారిపోతున్న వాయువు చరమాంకంలో ఉన్న ఒక తార వెలుగుల సాయంతో మెరిసిపోతుంది. ఒక తారకు వయసు మీదపడేకొద్దీ దానికి సంబంధించిన 'భారీ అరుణ' దశ ముగింపున కొస్తుంది. అపుడు అది తన ఉపరితలం నుంచి పొరలు పొరలుగా వాయువును వెలువరిస్తుంది. చివరకు ఉష్ణమయ శ్వేత మరుగుజ్జు తారగా అది మిగిలిపోతుంది. ఇలాంటి నెబ్యూలాను భూమికి 11వేల కాంతి సంవత్సరాల దూరంలో కనుగొ న్నారు. దానికి ఎన్‌జీసీ 6326అని పేరు పెట్టారు. ఇందులో నీలం, ఎరుపు వర్ణం, అయనీకరణం చెందిన ఆక్సిజన్, హైడ్రోజన్ వంటి పదార్థాల నుంచి వెలువడుతోంది. హైడ్రోజన్, హీలియం వంటి భార మూలకాలను ఇలాంటి గ్రహ నెబ్యూలాలే విశ్వమంతటా వ్యాప్తి చేస్తాయి.



'ఫిలింనగర్ దైవసన్నిధానం' ఛైర్మన్‌గా మోహన్‌బాబు

హైదరాబాద్ ఫిలింనగర్ దైవసన్నిధానం ఛైర్మన్ బాధ్యతల్ని కలెక్షన్ కింగ్ మంచు మోహన్‌బాబు స్వీకరించారు. నేడు (సోమవారం) పదవీ ప్రమాణ స్వీకారం వేళ పూజా కార్యక్రమాలతో దైవసన్నిధానం కిక్కిరిసింది. ఈ కార్యక్రమంలో మోహన్‌బాబుకు అత్యంత సన్నిహితుడైన మహాభక్తుడు, కళాబంధు టి.సుబ్బరామిరెడ్డి సహా పలువురు సెలబ్రిటీలు, ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'మా' (మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్) ఆధ్వర్యంలో మోహన్‌బాబుకు ఘనంగా సన్మానం జరిగింది. 'మా' అధ్యక్షుడు శివాజీ రాజా, కోశాధికారి పరుచూరి వెంకటేశ్వరరావు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో 'మా' జాయింట్ సెక్రటరీ ఏడిద శ్రీరామ్, కల్చరల్ కమిటీ ఛైర్మన్ సురేష్ కొండేటి, కార్యవర్గ సభ్యులు ఉత్తేజ్, సురేష్, నాగినీడు, పసునూరి శ్రీనివాసులు, హరినాథబాబు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో 'టిక్ టిక్ టిక్'

జయం రవి, నివేదా పేతురాజ్ జంటగా చదలవాడ బ్రదర్స్ సమర్పణలో శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వర ఫిలింస్ బ్యానర్‌పై పద్మావతి చదలవాడ నిర్మాతగా వస్తోన్న సినిమా 'టిక్ టిక్ టిక్'. శక్తి సౌందర్ రాజన్ దర్శకుడు. ఇండియన్ సినిమా చరిత్రలో ఫస్ట్ స్పేస్ సినిమాగా రూపొందింది. త్వరలోనే విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ– "జనవరి 1న నేను ఫ్రాన్స్ వెళ్లాను. అక్కడ ఐఫిల్ టవర్ మీద కూర్చు న్నప్పుడు ఫారిన్ కపుల్ వచ్చారు. 'మీది ఇండి యానా?' అనడిగారు. అవునని చెప్పా. అప్పుడు వాళ్లు 'బాహుబలి' పదిసార్లు చూశామని చెప్పారు. ఇప్పుడు మన ఇండియన్ సినిమాకి అంత గుర్తింపు వచ్చింది. ఇప్పటికీ మనవాళ్ళు అమెరికన్ ఫిలిమ్స్ చూస్తారు. అటువంటి స్థాయిలో తీసిన సినిమా 'టిక్ టిక్ టిక్'. ఇంతకు ముందు మేము విడుదల చేసిన 'బిచ్చగాడు' ట్రైలర్‌ను ఎవరో పంపారు. అందులో హీరోయిన్ బిచ్చం వేసే సన్నివేశంలో ఎమోషన్ నచ్చి తెలుగులో విడుదల చేశాం. అలాగే, ఈ 'టిక్ టిక్ టిక్' ట్రైలర్లో చిన్నపిల్లాడు 'డాడీ... డాడీ...' అనే సన్నివేశంలో మంచి ఎమో షన్ కనిపించింది. తర్వాత తెలుగు హక్కులు తీసు కున్నా. అప్పుడు ఇందులో హీరో రవి, నిర్మాతలకు ఎంతో గౌరవం తెచ్చిన ఎడిటర్ మోహన్ గారి అబ్బాయి అని తెలిసింది. 'బిచ్చగాడు' తరహాలో ఈ చిత్రాన్నీ ఆదరిస్తారని, ఆదరించాలని కోరుకుం టున్నా. ఇటువంటి చిత్రాలని ఆదరిస్తే మరిన్ని మంచి సినిమాలు వస్తాయి" అన్నారు.

హీరో 'జయం' రవి మాట్లాడుతూ– "సినిమా పబ్లిసిటీ కోసం రాలేదు. శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వర ఫిలింస్ సంస్థ, నిర్మాతలు సినిమాను బాగా ప్రమోట్ చేస్తున్నారని చెన్నై ఫోనులు చేశారు.



వాళ్లకి థాంక్స్ చెప్పడానికి వచ్చా. శ్రీనివాసరావు గారు నాన్నగారి గురించి మంచి మాటలు చెప్పారు. చాలా సంతోషంగా అనిపించింది. ఇక, సినిమా విషయానికి వస్తే.. మన దేశంలో ఫస్ట్ స్పేస్ ఫిలిం ఇది. ఇటువంటి సినిమాలను ఈజీగా చేయలేము. ఒక్కొక్క షాట్ వెనుక చాలా కష్టం ఉంటుంది. దర్శకుడు శక్తి సౌందర్ రాజన్ వచ్చి ఏ జానర్లో మనం సినిమా చేయబోతున్నామో చెప్పు కోండి అన్నారు. నేను 'జురాసిక్ పార్క్' అన్నాను. తర్వాత 'స్పేస్' ఫిలిం అనగానే అందరిలా నేనూ షాక్ అయ్యాను. '90లలో కొన్ని స్పేస్ సినిమాలు వచ్చాయి. అలా చేయాలంటే నో ప్రాబ్లమ్. కానీ, అంతకంటే బాగా చేయాలంటే బడ్జెట్ కావాలి' అన్నారు. లక్కీగా మంచి ప్రొడక్షన్ టీం, చెన్నైలో అజాక్స్ గ్రాఫిక్ స్టూడియో దొరికాయి. అందరూ 'మీకు ఇటువంటి వైవిధ్యమైన సినిమాలు చేయడం ఎలా కుదురుతుంది?' అనడుగుతున్నారు. నేను ఎందుకు కుదరదు? అంటున్నా. అందరూ నెగి టివ్‌గా చూసిన విషయంలో నేను పాజిటివ్ తీసు కుని చేస్తున్నా. టీజర్, ట్రైలర్లలో ప్రేక్షకులు ఎం చూసినదాని కంటే ట్రైలర్లో పది రేట్లు ఎక్కువ ఉంది. ఇటువంటి సినిమాలను ఫోనులు, కంప్యూ టర్లలో చూస్తే కిక్ ఉండదు. లార్జర్ దేన్ లైఫ్ సినిమా ఇది. థియేటర్లోనే చూడండి" అన్నారు.

వరుణ్ తేజ్ 'తొలిప్రేమ' ఆడియో ఆవిష్కరణ

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ కథానాయకుడిగా ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్‌ఎల్‌పి పతాకంపై నిర్మితమవుతున్న చిత్రం 'తొలిప్రేమ'. రాశి ఖన్నా హీరోయిన్‌గా నటిస్తోంది. యువ దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకుడు. బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మాత. ఈ సినిమాను ఫిబ్రవరి 9న విడుదల చేస్తున్నారు.. ఎస్.ఎస్.తమన్ సంగీతం అందించిన ఈ సినిమా పాటలను శనివారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా... బిగ్ సీడీని, ఆడియో సీడీలను అల్లు అరవింద్ విడుదల చేయగా.. తొలి సీడీని దిల్‌రాజు అందుకున్నారు.

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ మాట్లాడుతూ ఈ సినిమా చేసే క్రమంలో ఆరు నెలల వరకు ఏ టైటిల్ పెడదామని ఆలోచించాం. దర్శకుడు వెంకీ ముందుగా తొలిప్రేమ అనే టైటిల్ పెడదామని అనడంతో.. నాకు ఇష్టమున్నా కూడా కాస్త భయపడ్డాను. ఆ టైటిల్ పెట్టుకుని ఏమైనా తేడా వస్తే... మనకు పగిలిపోద్ది అని అన్నాను. ఎందు కంటే అది బాబాయ్‌కి ఐ కాంటాక్ట్ మూవీ. డెఫనెట్‌గా అప్పటి తొలిప్రేమను ప్రేక్షకులు ఎంత ఆదరించారో తెలుసు. కాబట్టి ఆ సినిమా టైటిల్ పెట్టినందుకు జస్టిఫై చేసేలా మా సినిమా ఉంటుందని నమ్మకంగా ఉన్నాం. సినిమా చూశాం. రేపు ప్రేక్షకులు, అభిమానులు ఎవ్వరూ కూడా డిసప్పాయింట్ కారు. లోఫర్, ఫిదా ముందు ఈ కథను విన్నాను. కథ నచ్చింది. నా మనసుకు



దగ్గరైన కథ. తనను కొన్ని రోజులు వెయిట్ చేయ మని అన్నాను. తను నా కోసం వెయిట్ చేశాడు. మా నిర్మాతలు బాబీ, భోగవల్లి ప్రసాద్‌గారికి థాంక్స్. మా బాబాయ్, బన్ని అన్నతో ఆయన సినిమాలు చేశారు. నాకు కూడా మంచి సినిమా ఇచ్చినందుకు ఆయనకు థాంక్స్. ప్రియదర్శి, హైపర్ ఆది సహా నా పర్సనల్ ఫ్రెండ్స్ కూడా ఈ సినిమాలో నటించారు. మంచి ప్రేమకథకు మంచి సంగీతం, మంచి కెమెరా వర్క్ ఉండాలి. తమన్ మంచి మ్యూజిక్,. జార్జ్ మంచి విజువల్స్ అందించారు. నాకు హీరోయిన్స్ వెతకడం అంటే చాలా కష్టం. నా హైట్‌కు సరిపోరు. కానీ తొలిసారి నా హైట్‌కు సరిపోయేలా రాశిఖన్నా దొరికింది. వర్ష అనే క్యారెక్టర్‌కు రాశి తన నటనతో న్యాయం చేసింది. మా పెద్దనాన్న, బాబాయ్ వేసిన ఈ ఫౌండేషన్‌ను పాడు చేయకుండా మంచి సినిమాలు చేస్తాం అన్నారు.

చిత్ర దర్శకుడు వెంకీ అట్లూరి మాట్లాడుతూ నేను ఇండస్ట్రీకి వచ్చిన తొలినాళ్లలో నన్ను నమ్మిన వ్యక్తి... ఇండస్ట్రీని నన్ను నమ్మేలా చేసిన వ్యక్తి దిల్‌రాజుగారు. ఇక వరుణ్ విషయానికి వస్తే.. నేను ఎక్కడో కాన్ఫిడెన్స్ కోల్పోతున్న తరుణంలో ఆరు అడుగల నాలుగు అంగులాల ధైర్యాన్నిచ్చాడు. తర్వాత నా నమ్మకానికి ఊపిరి పోసిన వ్యక్తి బాపినీడు. తమన్‌ని, శ్రీమణిని మంచి సాంగ్స్ కోసం ఇబ్బంది పెట్టాను. ఇక కెమెరా మెన్ జార్జ్ నేను కన్న కలను తెరపై అందంగా చూపించిన వ్యక్తి. అలాగే ఎడిటర్ నవీన్ నేను తీసిన సినిమాను అందంగా ఎడిట్ చేశారు. ఇక సీనియర్ నరేష్, ఆది, ప్రియదర్శి, అపూర్వ సహా అందరికీ థాంక్స్. ఇప్పటి వరకు రాశిని గ్లామర్ క్వీన్‌గా చూసిన ప్రేక్షకులకు ఈ సినిమాలో నటనతో ఆకట్టుకునే రాశి ఖన్నా కనపడుతుంది. సపోర్ట్ చేసిన అందరికీ థాంక్స్ అన్నారు. ఏస్ ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ మాట్లాడుతూ బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్‌గారికి, నాకు చాలా మంచి అనుబంధం ఉంది. 'మగధీర' సినిమాకు కో ప్రొడ్యూసర్‌గా నాకు సినిమా చేశారు. పవర్‌స్టార్ పవన్‌తో అత్తారింటికి దారేది చేసిన ప్రసాద్‌గారు ఇప్పుడు ఆయన సినిమా టైటిల్‌తోనే వరుణ్‌తో సినిమా చేయడం ఆనందంగా ఉంది. అప్పుడు పవన్‌కల్యాణ్‌గారికి తొలిప్రేమ సమయంలో ఎంత మంచి పేరొచ్చిందో ఈ తొలిప్రేమ సినిమాలో వరుణ్ తేజ్‌కు అంతే మంచి పేరు వస్తుందని అనుకుంటున్నాను. తమన్ ఎక్స్‌ట్రార్డినరీ మ్యూజిక్ డైరెక్టర్. వరుణ్ రెండో సినిమా నుండి తనకు నచ్చిన సినిమా చేయాలని నిర్ణయించుకుని సినిమాలు చేస్తూ వస్తున్నాడు. తనకు ఆల్ ది బెస్ట్. ఈ తొలి ప్రేమ తప్పకుండా తనకు పెద్ద హిట్ అవుతుంది అన్నారు.

మ్యూజిక్ డైరెక్టర్ ఎస్.ఎస్.తమన్ మాట్లాడుతూ ఇంత మంచి మెలోడీ ఆల్బమ్ చేసే అవకాశం కలిగించిన నిర్మాతలకు థాంక్స్. దర్శకుడు వెంకీ అట్లూరి నా నుండి మంచి మ్యూజిక్‌ను రాబట్టుకు న్నారు. జార్జ్ అద్భుతమైన సినిమాలు చేసిన సినిమా టోగ్రాఫర్.. ఈ సినిమాకు తను రెండో హీరో. తన కారణంగా అవుట్‌పుట్ అద్భుతంగా ఉంది. వెంకీ ఎక్స్‌ట్రార్డినరీ స్క్రిప్ట్‌తో సినిమా చేశాడు అన్నారు.

రాశిఖన్నా మాట్లాడుతూ తొలి ప్రేమ నా హృదయానికి దగ్గరైన సినిమా ఇది. నేను గర్వపడే సినిమా అవుతుంది. వెంకీ అట్లూరి అద్భుతమైన స్క్రిప్ట్‌తో నా క్యారెక్టర్‌ను డిజైన్ చేశారు. తప్పకుండా ప్రేక్షకులకు నచ్చే సినిమా అవుతుంది. తమన్ చాలా మంచి మ్యూజిక్ ఇచ్చారు. పాటలన్నీ అందరికీ నచ్చుతుంది. సినిమాటోగ్రాఫర్ జార్జ్‌గారు ప్రతి సీన్‌ను అద్భుతంగా చూపించారు. వరుణ్ చాలా కష్టపడి, ప్యాషన్‌తో సినిమా చేశారు అన్నారు.


హిట్ చిత్రాల నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ తమన్ చేసిన ఆల్బమ్స్‌లో వన్ ఆఫ్ ది బెస్ట్ ఆల్బమ్. మాకు, ప్రసాద్‌గారికి దగ్గర రిలేషన్ ఉంది. ఈ తొలిప్రేమ ఆడియో వేడుకలో ఆ తొలిప్రేమను గుర్తు చేసుకోవాల్సిందే. 20 సంవత్సరాలు క్రితం పవన్ తొలిప్రేమ విడుదలైంది. ఆ తొలి ప్రేమ ప్రేక్షకులను ఎలా ఉర్రుతలూగించిందో... ఈ తొలి ప్రేమ కూడా అలాగే ఉర్రుతలూగిస్తుంది. ఫిదాకు ముందు వెంకీ ఈ సినిమాను మా బ్యానర్‌లో చేయాల్సింది. కానీ ఫిదా కారణంగా తను బాపినీడుకి కథ వినిపించాడు. తనకు నచ్చడంతో సినిమా ఓకే అయ్యింది. మా బ్యానర్‌లో చేయాల్సిన సినిమాను వారి బ్యానర్‌లో చేశారనే కారణంతో... బాపినీడు ఈ సినిమా టోటల్ రైట్స్‌ను నాకు ఇచ్చేశాడు. ఇలాంటి విషయాలు అరుదుగా జరుగుతుంటాయి. 1998లో ఆ తొలిప్రేమ ఎలాంటి సెన్సేషన్‌ను క్రియేట్ చేసిందో 2018లో ఈ తొలి ప్రేమ కూడా సెన్సేషన్ క్రియేట్ చేస్తుంది. బ్యూటీఫుల్ లవ్‌స్టోరీ. వరుణ్, రాశిఖన్నా కెమిస్ట్రీ అద్భుతంగా కుదిరింది అన్నారు.

సీనియర్ నరేష్ మాట్లాడుతూ భోగవల్లి ప్రసాద్ బ్యానర్‌లో నేను తొలిసారి పనిచేస్తున్నాను. చాలా మంచి నిర్మాత. బాపినీడు ముందుండి సినిమాను చక్కగా నిర్మించాడు. వెంకీ అట్లూరి సినిమాను చక్కగా, అందంగా తీశాడు. వరుణ్, బన్ని, రామ్‌చరణ్, సాయిధరమ్ తేజ్, మా అబ్బాయి నవీన్ సహా అందరినీ మూడు అడుగుల బుల్లెట్స్‌లా చూశాను. ఇప్పుడు వరుణ్ విషయానికి వస్తే తను ఆరడుగుల నాలుగంగుల బుల్లెట్‌లా తయారయ్యాడు. తను ఇంకా మంచి సినిమాలు చేసి ముందుకెళ్లాలి.



'ఇంటిలిజెంట్' ఫస్ట్‌లుక్

సుప్రీమ్ హీరో సాయిధరమ్ తేజ్ కథానాయకుడిగా సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రై. లిమిటెడ్ పతాకంపై సెన్సేషనల్ డైరెక్టర్ వి.వి.వినాయక్ దర్శకత్వంలో ప్రముఖ నిర్మాత సి.కళ్యాణ్ నిర్మిస్తున్న భారీ చిత్రం 'ఇంటిలిజెంట్'. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను సోమవారం విడుదల చేశారు. ఫిబ్రవరి 9న ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాత సి.కళ్యాణ్ మాట్లాడుతూ "ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ పూర్తయింది. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. సాయిధరమ్‌తేజ్ పెర్ఫార్మెన్స్, వినాయక్ టేకింగ్ హైలైట్‌గా ఈ చిత్రం రూపొందింది. సాయిధరమ్, వినాయక్ కెరీర్‌లో 'ఇంటిలిజెంట్' మరో బిగ్గెస్ట్ హిట్ మూవీ అవుతుంది. అలాగే మా సి.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌లో మరో కమర్షియల్ హిట్ సినిమాగా నిలుస్తుంది. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి ఫిబ్రవరి 9న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం" అన్నారు. సాయిధరమ్‌తేజ్, లావణ్య త్రిపాఠి, నాజర్, బ్రహ్మానందం, పోసాని కృష్ణమురళి, ఆకుల శివ, కాశీ విశ్వనాథ్, ఆశిష్ విద్యార్థి, షాయాజీ షిండే, రాహుల్‌దేవ్, దేవ్‌గిల్, వినీత్‌కుమార్, జె.పి. పథ్వీ, రుబాబు, కాదంబరి కిరణ్, విద్యుల్లేఖా రామన్, సప్తగిరి, తాగుబోతు రమేష్, భద్రం, నల్ల వేణు, రాహుల్ రామకృష్ణ, వెంకీ మంకీ, రాజేశ్వరి నాయర్, సంధ్యా జనక్, ఫిష్ వెంకట్, శ్రీహర్ష, శివమ్ మల్హోత్రా, రవిరామ్ తేజ, తేజారెడ్డి నటిస్తున్న ఈ చిత్రానికి కథ, మాటలు: శివ ఆకుల, సినిమాటోగ్రఫీ: ఎస్.వి. విశ్వేశ్వర్, సంగీతం: థమన్, ఎడిటింగ్: గౌతంరాజు, ఆర్ట్: బ్రహ్మ కడలి, ఫైట్స్: వెంకట్, డాన్స్: శేఖర్, జాని, సహనిర్మాతలు: సి.వి.రావు, నాగరాజ పత్సా, నిర్మాత: సి.కళ్యాణ్, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: వి.వి.వినాయక్.





కాంగ్రెస్‌తో జట్టు కట్టం : దేవెగౌడ

మంగళూరు : కర్ణాటకలో వచ్చే శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో జేడీ (ఎస్)పొత్తు పెట్టుకోదని ఆ పార్టీ అధ్యక్షుడు హెచ్‌డీ దేవెగౌడ సోమవారం స్పష్టం చేశారు. ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, గతంలో ఆ కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకొని దెబ్బతిన్నామని, ఈసారి ఆ పార్టీ మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్న ఉద్దేశం తమకు లేదని పేర్కొన్నారు. బీజేపీ, కాంగ్రెస్ కేవలం మతపరమైన అంశాలపై వాదులాడుకోవడం తప్ప రైతుల సమస్యలతో అనేక ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని అన్నారు. రాష్ట్రంలో 224 శాసనసభా స్థానాలన్నింటిలో కొన్ని స్థానాలను వామపక్ష పార్టీలతో కలిసి పంచుకుని తమ పార్టీ పోటీ చేస్తుందన్నారు. ఈసారి ఎన్నికల్లో సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా మద్దతు కోరే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. దళితులు, రాజ్యాంగంపై కేంద్రమంత్రి అనంతకుమార్ హెగ్డే చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై ఆయన స్పందిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ తన మంత్రులను అదుపులో ఉంచాలన్నారు.

మత శక్తులపై పోరుకు ఎస్పీ ఏకమవ్వాలి : శివపాల్



లక్నో : దేశంలో మత శక్తులపై పోరడేందుకు సమాజ్‌వాద్‌పార్టీ, యాదవ్ కుటుంబం ఐకమత్యంగా ఉండటం అవసరమని ఆ పార్టీ బహిష్కృత నేత శివపాల్ యాదవ్ నొక్కివక్కాణించారు. సోమవారం ఆయన 63వ సంవత్సరంలోకి ప్రవేశిస్తున్న సందర్భంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం తాను నేతాజీ (ములాయం)తో ఉన్నానని, అయన ఏమి సూచిస్తే తాను చేస్తున్నానని చెప్పారు. కలిసి కట్టుగా ఉంటేనే మత శక్తులను గట్టి ఎదుర్కోగలం కాబ ట్టి కుటుంబం ఐక్యత కోసం తాను ప్రార్థిస్తున్నానని చెప్పారు. రాష్ట్రంలో అనేక సమస్యలు పట్టి పీడిస్తున్నా యని, రైతులు, నిరుద్యోగులు చాలా అసంతృప్తితో ఉన్నారని, అవినీతి పేట్రేగిపోతుందని అన్నారు. అయినా ప్రభుత్వం ఇవేమీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. శివపాల్ పుట్టినరోజుతోపాటు వసంత్ పంచమి కావడంతో సోమవారం 'పోరాట దినం'గా ఆయన మద్దతుదారులు వేడుకలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా శివపాల్ తన రాజకీయ జీవితంపై ఈ-పుస్తకాన్ని ఆవిష్కరించారు.

'పద్మావత్'కు నిరసన సెగలు

ఉజ్జయిని : వివాదాస్పద చిత్రం 'పద్మావత్' విడుదలను నిరసిస్తూ మధ్యప్రదేశ్ లోని కర్ని సేన సభ్యులు సోమవారం పలు రోడ్లు దిగ్బంధించారు. రాజ్‌పుత్ వర్గానికి చెందిన సంస్థ కర్ని సేన సభ్యులు ఉజ్జయిని నుంచి నాగ్దా, దివాస్ నుంచి మక్షి, అగర్ నుంచి కోట రోడ్డు మార్గాల్లో వాహనాల రాకపోకలను నిలిపివేసి టైర్లను తగులబెట్టి నిరసన తెలిపారు. ఆందోళనకారుల నుంచి మెమొరాండం అందిన అనంతరం వాళ్లు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన ప్రాంతాల్లో రోడ్లు క్లియర్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. సంజయ్‌లీలా దర్శకత్వం వహించిన ఈ చిత్రం 25న విడుదల కానుంది.

రైలు ప్రమాదంలో నటుడు భలేరావు మృతి

ముంబై : మరాఠీ నటుడు ప్రఫుల్ భలేరావు (22) సోమవారం జరిగిన రైలు ప్రమాదంలో మృతి చెందాడని పోలీసులు తెలిపారు. గురుగావ్ నుంచి మలాడ్ వెళు తుండగా ఈ ఘటన జరిగిందన్నారు. బాలనటుడిగా ప్రసిద్ధి చెందిన భలేరావు టీవీసీరియల్ 'కుంకు'లో నటించారు. ఆయన నటించిన మరాఠీ సినిమా బారాయణ్ ఈమధ్యనే విడుదలైంది. అయితే కుంకుతోనే మహారాష్ట్రలోని ప్రతి ఇంట్లో ఆయన ప్రాచుర్యం పొందారు. 'తు మజాహా సంగతి', 'నకుషి', 'జ్యోతీబాపూలే'లో ఆయన నటన నీరాజనాలందుకుంది.

బడ్జెట్లో వ్యవసాయ రుణ లక్ష్యం రూ.11లక్షల కోట్లు

న్యూఢిల్లీ: 2018-19 ఆర్థిక సంవత్సర బడ్జెట్లో వ్యవసాయ రంగంలో రైతులకు జారీ చేసే రుణ లక్ష్యాన్ని రూ. 11లక్షల కోట్లుగా ప్రభుత్వం నిర్దేశించుకున్నట్లు అభిజ్ఞ వర్గాల సమాచారం. ప్రస్తుత నిర్దేశిత లక్ష్యం రూ.10లక్షల కోట్లు కాగా, ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్న బడ్జెట్లో మరో రూ.లక్ష కోట్లను కేటాయించాలన్న యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు ఆవర్గాల సమాచారంగా ఉంది. 2017 సెప్టెంబరు మాసం వరకు నిర్దేశించుకున్న రూ.10లక్షల కోట్లలో సుమారు రూ.6.25లక్షల కోట్లు రుణాలుగా రైతులకు కేటాయించినట్లు అధికార గణాంకాలు వెల్లడిస్తున్నాయి. తొమ్మిది శాతం వడ్డీకి వ్యవసాయ రంగంలో రైతులకు రుణాలను జారీ చేస్తున్నారు. ఇందులో రెండుశాతం వడ్డీరేటును సబ్సిడీగా ప్రభుత్వం ఇస్తోంది. స్వల్పకాల-మూడు సంవత్సరాల- పరిమితి పంట రుణాలను సకాలంలో చెల్లించినట్లయితే మరో మూడు శాతం రాయితీ రైతులకు లభించే వెసులుబాటు ఉంది. ఈలెక్కన రైతు రుణాల మీద విధించే వడ్డీరేటు నాలుగ శాతంగా ఉంటుంది. వాణిజ్య, సహకార బ్యాంకుల ద్వారా , ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల ద్వారా రైతులకు వడ్డీ రాయితీలు అందుతాయి. వర్తమాన ఆర్థిక సంవత్సరం నుంచి ప్రతి పంట రుణాన్ని ఆధార్‌తో అనుసంధానం చేయడం తప్పనిసరి. అలానే ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన సదుపాయాన్ని పొందే రైతులు తమ ఖాతాలను ఆధార్‌తో అనుసంధానించుకోవాలి.

స్పోర్ట్స్ ఫిలిం ఫెస్టివల్‌లో 'సుల్తాన్' హవా

ముంబై : టెహ్రాన్ ఇంటెల్ స్పోర్ట్స్ ఫిలిం ఫెస్టివల్ లో సల్మాన్ ఖాన్ నటించిన 'సుల్తాన్' రికార్డులు సృష్టించింది. ఈ సినిమా ఉత్తమ నటుడు, నటీ, దర్శకత్వానికి మూడు ట్రోఫీలు వరించాయి. హీరో సల్మాన్ ఖాన్ ఈ సినిమాలో శృంగార కుస్తీ ఆటగాడుగా నటించగా, అనుష్కశర్మ హీరోయిన్‌గా నటించింది. బలమైన కథా, కథనంతో జాతీయ, అంతర్జాతీయ సరిహద్దులను చెరిపేసింది. క్రీడలు జీవితాన్ని ఎలా మారుస్తాయి, నిజాయతీ ఎంతముఖ్యం అన్నది దర్శకుడు కళ్లకుకట్టినట్టుగా ప్రేక్షకులకు చూపారు. టెహ్రాన్ అంతర్జాతీయ క్రీడా సంస్థకు సుల్తాన్ చిత్ర బృందం ధన్యవాదాలు తెలుపుతోందని జాఫర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఈసీ పక్షపాతం...!



- బలి పశువుగా ఆప్
- కాంగ్రెస్, బీజేపీలకు వర్తించని నియమాలు
- రాజకీయ క్రీడలో సహజ న్యాయం హరణం



న్యూఢిల్లీ: ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగ బద్ధ నియమ నిబంధనలకు కట్టుబడి నిష్పాక్షికంగా పని చేయాల్సిన నైతిక బాధ్యత ఎన్నికల సంఘం మీద ఉంది.. ఈ బాధ్యతను నిర్వర్తించడంలో అధికార, ప్రతిపక్ష లేదా మరే ఇతర రాజకీయపార్టీలన్న కోణంలో ఈసీ వ్యవహరించరాదు. అన్ని పార్టీల పట్లా ఒకే తీరులో నడుచుకోవాల్సిన రాజ్యాంగ బాధ్యత ఈసీదే. ఢిల్లీలో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) శాసన సభ్యులు (ఎమ్మెల్యేలు) 20మందిని లాభదాయక పదవులు కలిగి ఉన్నారన్న అభియోగం మోపుతో అనర్హులుగా ప్రకటిస్తూ తీసుకున్న నిర్ణయంతో ఈసీ నిష్పాక్షికత సందిగ్ధంలో పడింది. ఈ నిర్ణయం దరిమిలా ఈసీ విశ్వసనీయత ఏపాటిదనే ప్రశ్నలూ ఉత్పన్నమవ ుతున్నాయి. ఆప్ ఎమ్మెల్యేల తరహాలో గతంలోనూ, ప్రస్తుతమూ అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్, బీజేపీ సహా అనేక రాజకీయ పార్టీలు తమ అసంతృప్త ఎమ్మెల్యేలను బుజ్జగించేందుకు వారికి పార్లమెంటరీ కార్యదర్శి పదవిని లేదా ఏదేని కార్పొరేషను ఛైర్మన్ గిరీని కట్టబెట్టడం జరుగుతోంది. ఉదాహరణకు, 1999లో ఢిల్లీ ముఖ్యమంత్రిగా కాంగ్రెస్‌క చెందిన షీలా దీక్షిత్ అధికారంలో కొనసాగుతుందగా పార్లమెంటరీ కార్యదర్శులుగా 19మంది ఎమ్మెల్యేలు పని చేశారు. చత్తీస్‌గఢ్‌లోని రమణ సింగ్ ప్రభుత్వంలో 11 మంది పార్లమెంటరీ కార్యదర్శులున్నారు. ఆతరువాత హైకోర్టు ఉత్తర్వుల మేరకు వారి నియామకాలు రద్దయినాయి.

రాజస్థాన్‌లో అలిగిన, కావాలనుకున్న ఎమ్మెల్యేకు పార్లమెంటరీ కార్యదర్శి పదవిని కట్టబెట్టడం ఒక రాజకీయ సంప్రదాయంగా కొనసాగుతూ వస్తోంది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఏది అధికారంలో ఉన్నా ఇంత కాలమూ జరుగుతూ వచ్చింది ఇదే. 60మంది ఎమ్మెల్యేలున్న అరుణాచల్ ప్రదేశ్‌లో ముఖ్యమంత్రి ప్రేమ ఖండూ మొత్తం 31మందిని పార్లమెంటరీ కార్యదర్శులుగా నియమించారు.

ఇలాంటి నేపథ్యమూ,వర్తమాన రాజకీయ నియామకాల పరిస్థితుల్లో ఢిల్లీ గద్దె మీదున్న ఆప్‌ను లక్ష్యంగా చేసుకుని లాభదాయక పదవులు కలిగి ఉన్నారన్న అభియోగంపై 20 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించడం వెనుక దాగున్న రాజకీయ ప్రయోజనాలేమిటనేది అంతు పట్టడం లేదు. పైన చెప్పుకున్నట్లుగా అరుణాచల్‌ప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్, షీలాదీక్షిత్ హయాంలో ఢిల్లీలో అంతటా ఎమ్మెల్యేలు పార్లమెంటరీ కార్యదర్శులుగా కొనసాగవచ్చు? కానీ, ప్రస్తుతం ఒక్క ఢిల్లీలో ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు చెందిన ఎమ్మెల్యేలకు మాత్రం అనర్హత సూత్రం వర్తిస్తుందా? ఇలా వివక్షా పూరితంగా అనర్హత నియమాన్ని వర్తింపజేయడం రాజ్యాంగ విరుద్ధమని అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించిన సంగతి తెలిసిందే. రాజకీయ పార్టీలు, రాష్ట్రాల భౌగోళిక ముఖచిత్రాలు, అధికార వ్యత్యాసాలను బట్టి అర్హత లేదా అనర్హతలు ఆధారపడి ఉంటాయా? అనే ప్రశ్నలకు ఈసీ సమాధానమివ్వాల్సి ఉంది.

ప్రధాన ఎన్నికల కమిషనరు జోతి పదవీ విరమణ చేయనున్న చివరి రోజు సమీపిస్తున్న సమయంలో ఆప్ ఎమ్మెల్యేల అనర్హత తేల్చేందుకు చూపిన అత్యుత్సాహమూ అనుమానాలు రేపేదిగా ఉంది. వర్తమాన రాజకీయ సమీకరణాలకు లోబడి ఆప్ ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించిన ఈసీ నిర్ణయానికి ప్రాతిపదికైన న్యాయసూత్రం ఏమిటనేది జవాబు లేని ప్రశ్నగా ఉంది. వాస్తవానికి, ఢిల్లీలో అధికారం దక్కించుకున్నది ఆదిగా ఆప్‌కు, బీజేపీకి మధ్య అనేక రాజకీయ, రాజ్యాంగ వివాదాలు పొడసూపాయి. పంజాబ్ ఎన్నికల్లో ఆప్ పోటీ చేయడాన్ని బీజేపీ సహించలేకపోయింది. ఈ ఎన్నికల్లో ఆప్ ఓడింది. పంజాబ్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఆప్ పోటీ చేయకుంటే అధికారం దక్కించుకోవడం సాధ్యమనే అభిప్రాయం బీజేపీకి ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో సందు దొరికినపుడల్లా ఆప్‌ను ఇరుకున పెట్టేందుకు ఢిల్లీ బీజేపీ పెద్దలు చేయని ప్రయత్నం లేదంటే అతిశయోక్తి కాదు. చివరకు లాభదాయకపదవుల రూపంలో ఆప్ మీద రాజకీయకక్ష సాధించుకోవడానికి బీజేపీకి అవకాశం దక్కినట్లయింది. తాజా పరిణామాలు తాత్కాలికంగా ఆప్‌కు, కేజ్రీవాల్‌కు అసౌకర్యం కలిగించినా భవిష్యత్తులో రాజకీయంగా నిలదొక్కుకునేందుకు అవకాశాలను మెరుగుపరిచాయని చెప్పాలి. బీజేపీ తన మీద కక్షసాధిస్తోందంటూ ఢిల్లీ ప్రజల సానుభూతిని రానున్న ఎన్నికల్లో ఓట్లుగా మరల్చుకునేందుకు కేజ్రీవాల్‌కు అవకాశం లభించింది. అనర్హత వేటు పడిన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న 20నియోజకవర్గాల్లో ఇప్పటికిపుడు ఎన్నికలు నిర్వహించినా బీజేపీకి ఒనగూరే అదనపు ప్రయోజన అంటూ ఏమీ ఉండదని రాజకీయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఆప్ ఎమ్మెల్యేల పిటిషన్ వెనక్కి

న్యూఢిల్లీ : ఢిల్లీ హైకోర్టులో ఎన్నికల కమిషన్‌ను సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను ఆప్ అనర్హత వేటుకు గురైన ఎమ్మెల్యేలు వెనక్కు తీసుకున్నారు. తమ అనర్హతపై నోటీసును అందుకున్న తర్వాత నూతన పిటిషన్ దాఖలు చేయాలని భావిస్తున్నారు. ఎమ్మెల్యేల అభ్యర్థనను జస్టిస్ రేఖపల్లి ఆమోదించారు. ఆప్ తరపున అడ్వకేట్ మనిష్ వశిష్ట్ ఈ కేసును సవాలు చేయనున్నారు. ఇప్పటికే రాష్ట్రపతి ఎమ్మెల్యేల అనర్హతను ఆమోదించిన విషయం తెలిసిందే. ఢిల్లీ కోర్టు జనవరి 19న దీనిపై మధ్యంతర తీర్పును తిరస్కరించింది. ఎమ్మెల్యేలను పార్లమెంటరీ కార్యదర్శులుగా నియమించగా ఈసీ లాభదాయక పదవులుగా నిర్వచించింది. ఈసీ తరపున ప్రశాంత్‌పటేల్ 21 మంది ఎమ్మెల్యేలపై పిటిషన్ దాఖలు చేశారు. అయితే దీనిపై ఎటువంటి సాక్ష్యాధారాలు కోర్టుకు సమర్పించలేదని ఆప్ మండిపడుతోంది.పంజాబ్ ఎన్నికల్లో పోటీ చేయడానికి రాజౌరీ గార్డెన్‌కు చెందిన ఎమ్మెల్యే జెర్నైల్ సింగ్ రాజీనామా చేయడంతో ఆ సంఖ్య 20కు చేరింది. ఆదర్శ్‌శాస్త్రి, అనిల్ బాజ్‌పాయ్, అవతార్ సింగ్, కైలాష్ గేహ్లోట్ (ఢిల్లీ మంత్రి), మదన్‌లాల్, మనోజ్ కుమార్, నరేష్ యాదవ్, నితిన్ త్యాగి, ప్రవీణ్‌కుమార్, రాజేష్‌గుప్తా, రాజేష్ రిషి, సంజీవ్ ఝా, సరితా సింగ్, సోమ్‌దత్, శరద్ కుమార్, శివ చరణ్ గోయెల్, సుఖ్‌బీర్ సింగ్, విజేందర్ గార్గ్ ఉన్నారు.

ఆప్ ఎమ్మెల్యేలపై వేటు తుగ్లక్ చర్య : యశ్వంత్

న్యూఢిల్లీ : ఢిల్లీలో పాలక అమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) ఎమ్మెల్యేలు 20మందిపై లాభదాయక పదవుల సాకుతో అనర్హత వేటు వేయడంపై సర్వత్రా నిరసన వ్యక్తమౌతున్నది. ప్రతిపక్ష నాయకులే కాకుండా కేంద్రంలోని పాలక ఎన్‌డీఏకి నేతృత్వం వహిస్తున్న బీజేపీ సీనియర్ నాయకులు యశ్వంత్ సిన్హా, శతృఘ్న సిన్హా వంటి వారు కూడా ఈ చర్యను తప్పుపడుతున్నారు. 20 మంది ఆప్ ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటిస్తూ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ తీసుకున్న నిర్ణయాన్ని "తుగ్లక్‌షాహి" ఆదేశాలుగా అభివర్ణించారు. రాజ్యాంగ పదవులను అధిష్టించే వారు "కేంద్ర ప్రభుత్వం చేతుల్లో కీలుబొమ్మలుగా మారుతున్నారు" అని పేర్కొన్నారు. 20 మంది ఎమ్మెల్యేలపై అనర్హతవేటు వేయాలన్న ఎన్నికల కమిషన్ సిఫార్సు మేరకు కోవింద్ అనర్హతవేటు వేయడానికి శనివారం సమ్మతి తెలిపారు. "రాష్ట్రపతి ఆదేశాలు పూర్తిగా సహజన్యాయాన్ని విచ్ఛిన్నం చేయడమే. విచారణ లేదు. హైకోర్టు ఆదేశాల కోసం వేచివుండడం లేదు. ఇది తుగ్లక్ ఆదేశం, చెత్త ఆదేశం" అని యశ్వంత్ సిన్హా పేర్కొన్నారు. ఆప్ ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా రాజకీయ ప్రతీకారం ఎక్కువ కాలం కొనసాగబోదు" అని శతృఘ్నసిన్హా అన్నారు. "రాజకీయ ప్రతీకారం లేదా రాజకీయ స్వప్రయోజనాలు ఎక్కువ కాలం మనజాలవు. బాధపడకండి, సంతోషంగా ఉండండి" అని శతృఘ్నసిన్హా ట్విట్టర్‌లో పేర్కొన్నారు. "ఆశాభావంతో ఉండండి, త్వరలో మీకు న్యాయం కలుగుతుంది. రానున్నది మంచి కాలం. గుర్తుచేసుకోండి కష్టాలను అనుభవించిన వారు ఆ తరువాత సుఖపడతారు. సత్యమేవ జయతే! జైహింద్!" అని తన వరుస ట్వీట్లలో శతృఘ్నసిన్హా పేర్కొన్నారు. ఈ ఇరువురు నాయకులు కూడా అతల్ బీహారి వాజ్‌పేయి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంలో మంత్రులుగా పనిచేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆయన ప్రభుత్వ విధానాలపై బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

శంభాజీ భీడే అరెస్టులో పోలీసులు విఫలం

న్యూఢిల్లీ : భీమా-కోరేగావ్ హింసకు కారకుడైన అతివాద హిందూత్వ నాయకుడు శంభాజీ భీడేని అరెస్టు చేయడంలో మహారాష్ట్ర పోలీసులు విఫలమయ్యారని దళిత నాయకుడు ప్రకాశ్ అంబేద్కర్ విమర్శించాడు. భీడేకి పోలీసులు రక్షణ కల్పిస్తున్నారని తెలిపారు. సోమవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, "శంభాజీ భీడేని అరెస్టు చేయమని మేము డిమాండు చేస్తున్నాం. ఈ నెలారంభంలో భీమా-కోరేగావ్‌లో హింస చోటుచేసుకోవడానికి కారణమైన మరో నాయకుడు మిలింద్ ఎక్బోటేని కూడా అరెస్టు చేయాలని కోరుతున్నాం. కానీ ప్రయోజనం లేకుండా పోయింది" అని చెప్పారు. భిండేని అరెస్టు చేస్తామని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నావిస్ సైతం హామీ ఇచ్చారని తెలిపారు. "అయితే, ఇప్పుడు మాకు తెలిసిందేమిటంటే, ప్రధానమంత్రి కార్యాలయం అధికారాన్ని ఉపయోగించారు. అక్కడి నుంచి ఒత్తిళ్లు వస్తున్నాయి. భిండేని అరెస్టు చేయవద్దని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు వచ్చాయి" అని ప్రకాశ్ అంబేద్కర్ తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ మాజీ కార్యకర్త భిండేపై రూపొందించిన వీడియోని ప్రకాశ్ విడుదల చేశారు. 2014 ఆగస్టు 15న ఎర్రకోట నుంచి ప్రసంగిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కషాయ ముసుగును కప్పుకున్నారని విమర్శించారు.

ఢిల్లీ మెట్రోలో కలకలం

న్యూఢిల్లీ: ఢిల్లీ మెట్రో రైలులో ప్రయాణిస్తున్న ఓ మహిళ నుంచి 20 బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆమె బ్యాగ్‌లో ఆ బుల్లెట్లను సీఐఎస్‌ఎఫ్ దళాలు గుర్తించాయి. రిపబ్లిక్ డే సమీపిస్తున్న వేళ ఢిల్లీ అంతటా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో చెకింగ్ నిర్వహిస్తుండగా.. ఆ మహిళ బ్యాగ్‌లో బుల్లెట్లు దొరికాయి. యూపీలోని మొరదాబాద్‌కు చెందిన ఆమె.. ఆదర్శనగర్ స్టేషన్‌లో పోలీసులకు చిక్కింది. ఆమెతో పాటు తండ్రి, కుటుంబసభ్యులు ఉన్నారు. తన తండ్రి దగ్గర ఉన్న ఆర్మ్స్ లైసెన్స్‌ను ఆమె చూపించింది. 20 రౌండ్ల అమ్యునేషన్ తన తండ్రికి చెందినట్లు ఆమె చెప్పింది. కేసు విచారణ కోసం సీఐఎస్‌ఎఫ్ దళాలు ఆమెను ఢిల్లీ పోలీసులకు అప్పగించారు.

రోడ్లు రక్తసిక్తం : 16మంది దుర్మరణం

తమిళనాడులో నలుగురు, ఒడిశాలో ఐదుగురు, రాజస్థాన్‌లో ఏడుగురు

తమిళనాడు/ ఒడిశా/ రాజస్థాన్ : దేశంలోని వేర్వేరు రాష్ట్రాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 16 మంది మృతి చెందారు. తమిళనాడులో నలుగురు, ఒడిశాలో ఐదుగురు, రాజస్థాన్‌లో జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఏడుగురు మొత్తం పదహారు మంది ఒక్కరోజే రోడ్డు ప్రమాదాల్లో అసువులుబాశారు. రాజస్థాన్‌లోని జైసల్మేర్-బర్మర్ జాతీయ రహదారిలో ఎస్‌వీయూ బోల్తా కొట్టడంతో మహిళ, ఇద్దరు పిల్లలతో సహా ఐదుగురు మృతి చెందగా, మరో ఆరుగురు గాయాలపాలైయ్యారు. మరణించిన వారిని రోషిణీ బాయి (28), అర్బాన్ (4), అమినా (120, మెహ బూబా ఖాన్ (34), వాసిర్‌ఖాన్‌లా గుర్తించారు. మరో ప్రమాదంలో కారు బోల్తా కొట్టడంతో ఇద్దరు వ్యక్తులు ఓం ప్రకాష్‌రంగా (55), సురేంద్ర స్వామి (57)లుగా మృతి చెందారు. పోస్టుమార్టం అనంతరం వారి మృతదేహాలను కుటుంబాలకు అప్పగిస్తామని పోలీసు అధికారి ముక్నారామ్ వెల్లడించారు. మృతులు ఆరోగ్య సంస్థ, ఇంజనీరింగ్ శాఖల్లో పనిచేస్తున్నారన్నారు.

ఒడిశాలో ఆటో-ట్రక్ ఢీకొని ఐదుగురు దుర్మరణం చెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయని పోలీసులు వెల్లడించారు. పూరీ జిల్లాలో ఈ ఘటన జరిగిందని, వీరంతా బంధువు అంత్యక్రియలకు హాజరై తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగిందన్నారు. గాయపడిన వారిని కటక్ ఎస్‌సీబీ మెడికల్ కాలేజీలో చికిత్స అందిస్తున్నామని వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందన్నారు.

తమిళనాడులోని ఆటో- లారీ ఢీకొట్టు కోవడంతో నలుగురు మృతి చెందారని తమిళనాడు పోలీసులు వెల్లడించారు. సోమవారం ఉదయం శ్రీవిల్లిపుత్తూర్ కదనేరి వద్ద ఈ దుర్ఘటన జరిగిందని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని వారు వివరించారు.

ఎంపీలో పాగా కోసం కాంగ్రెస్ ఎత్తులు

ఎస్పీ, బీఎస్పీలతో పొత్తుకు సిద్ధం
హార్థిక్, జిగ్నేష్ సేవలు ఉపయోగించుకునే అవకాశం



భోపాల్ : మధ్యప్రదేశ్‌లో దాదాపు 15 ఏళ్ల నుంచి అధికారంలో లేని కాంగ్రెస్ ఈ ఏడాది చివరిలో జరిగే ఎన్నికల్లో విజయం సాధించేందుకు అత్యాశక్తిని ప్రదర్శిస్తోంది. అందులో భాగంగా బీజేపీకి వ్యతిరేకంగా పోరాడే సారూప్యభావాలు గల పార్టీలతో జట్టుకు సిద్ధమైంది. కాంగ్రెస్ విజయానికి కష్టమైన అసెంబ్లీ స్థానాలను మార్చినాటికి గుర్తించాలని,ఇప్పుడే ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించరాదని భావిస్తోంది. ప్రత్యర్థి పార్టీ గెలుపొందే చోట బలమైన నాయకులను పోటీలోకి దించాలనుకుంటోందని మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దీపక్ బబారియా వెల్లడించారు. 230 అసెంబ్లీ స్థానాలున్న మధ్యప్రదేశ్‌లో 2003 నుంచి కాంగ్రెస్ అధికారం కోల్పోయింది. సీఎంను ఎందుకు ప్రకటించడం లేదని విలేకరులు ప్రశ్నించగా, అవసరమైన వన్నీ చేస్తామని అయితే ఇప్పుడే కాదని ఆయన సమాధానం ఇచ్చారు. లోకసభ సీనియర్ నాయకుడు జ్యోతిరాధిత్య సింధియా బహిరంగంగా సీఎం అభ్యర్థిని ప్రకటించాల్సిందేనని పట్టుబడుతున్నారు. ముఖ్యమంత్రిని ప్రకటించడానికి అభ్యంతరం లేదని అయితే బీజేపీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని అందువల్ల ప్రకటించ లేక పోతున్నామన్నారు. గుజరాత్‌లో కూడా ఇదే జరిగిందని, దీనిలో భాగంగా సీనియర్ నాయకుడు శంకర్‌సిన్హ్ వాఘేలా పార్టీనుంచి వెళ్లిపోయారని బబా రియా వెల్లడించారు. రాష్ట్రంలో బీజేపీ పట్టుకోల్పో తుందని, ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రచా రంలో ఇది స్పష్టంగా కనిపిస్తోందన్నారు. గుజరాత్‌లోలా హార్థిక్‌పటేల్, జిగ్నేష్ మేవాని ఇక్కడ కూడా ప్రచారం చేస్తారా అన్న ప్రశ్నకు సమాధానం ఇస్తూ , సారూప్య భావాలు కల పార్టీలతో పొత్తుకు ప్రయత్నిస్తున్నామని, అవసరమైతే వారిని కూడా ఉపయోగించుకునే అవకాశం లేకపోలేదన్నారు. బహుజన్ సమాజ్‌వాదీపార్టీ (బీఎస్పీ) సమాజ్‌వాదీ (ఎస్పీ) లకు సరిహద్దు ప్రాంతాల్లో పట్టు ఉండటం వల్ల వారితో కలసి పనిచేసే అవకాశం ఉందని బబారియా వెల్లడించారు.

సుప్రీం జడ్జీలుగా మల్హోత్ర, జోసెఫ్

కొలీజియం సిఫారసు

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా సీనియర్ న్యాయవాది ఇందుమల్హోత్ర, ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కెఎమ్ జోసెఫ్‌లను నియమించవలసిందిగా కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసిందని కోర్టు వర్గాలు తెలిపాయి. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా ఆధ్వర్యంలోని కొలీజియం ఈ సిఫారసు చేసింది. జోసెఫ్,మల్హోత్రలను సుప్రీం న్యాయ మూర్తులుగా నియమించాలని సిఫారసు చేస్తూ కొలీజియం ఈనెల 11వ తేదీన నిర్ణయించింది. వీరి పేర్లను లాంఛనంగా ప్రభుత్వానికి సిఫారసు చేసినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి.

గుజరాత్ పేలుళ్ల ఉగ్రవాది అరెస్ట్

న్యూఢిల్లీ : గణతంత్ర దినోత్స వేడుకల నిర్వహణ సమీపిస్తున్న నేపథ్యంలో 2008లో సంభవించిన గుజరాత్ వరుస బాంబు పేలుళ్ల కేసులో ప్రధాన కుట్రదారుడు అబ్దుల్ సుభాన్ ఖుర్షీని అరెస్టు చేసినట్టు పోలీసులు సోమవారం తెలిపారు. శనివారం ఢిల్లీలోని ఘాజీపూర్‌లో ఆయన తన పాత సహచరుడిని కలుసుకునేందుకు వచ్చిన సందర్భంలో ఆయన్ని అరెస్టు చేశామన్నారు. ఖుర్షీని పట్టుకునేందుకు ప్రత్యేక సెల్ బృందాలు, ఇతర ఇంటలిజెన్స్ ఏజెన్సీలు సంయుక్త ఆపరేషన్ జరిపిందన్నారు. 46 ఏళ్ల ఖుర్షీ ఇండియన్ ముజాహిద్దీన్ (ఐఎం) సహ వ్యవస్థాపకుడు. 2008 జూలై 26న గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన వరుస బాంబు పేలుళ్లలో 50 మందికి పైగా మృతిచెందారు.

కనౌజ్ నుంచి పోటీ చేస్తా : అఖిలేష్

మెయిన్పురి నుంచి ములాయం
వచ్చే సార్వత్రిక ఎన్నికలపై తండ్రీకొడుకుల దృష్టి

లక్నో : వచ్చే సార్వత్రిక ఎన్నికలలో కనౌజ్ నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశం ఉందని సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ సోమవారం తెలిపారు. ప్రస్తుతం కనౌజ్‌కు ఆయన భార్య డింపుల్ యాదవ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రముఖ సోషలిస్టు నాయకుడు జనేశ్వర్ మిశ్రా వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని నివాళి అర్పించిన తర్వాత ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ 'కనౌజ్ నుంచి పోటీ చేసే అవకాశం ఉంది' అని పేర్కొన్నారు. మరో ప్రశ్నకు సమాధానంగా, మెయిన్పురి నుంచి 'నేతాజీ' ములాయం సింగ్ యాదవ్ పోటీ చేస్తారని అన్నారు. కాగా 2014 లోక్‌సభ ఎన్నికల్లో 78 ఏళ్ల ఎస్పీ నాయకుడు అజంఘర్, మెయిన్పురి నుంచి పోటీ చేశారు. రెండింటిలో గెలిచినప్పటికీ తూర్పు ఉత్తరప్రదేశ్‌లో పార్టీని బలోపేతం చేసేందుకు అజంఘర్ స్థానాన్ని ఎంచుకున్నారు. తాను ఖాళీ చేసిన మెయిన్పురి స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో ములాయం మనుమడు తేజ్ ప్రతాప్ యాదవ్ గెలుపొందాడు. ఇక ఎస్పీ అంతరంగికులు మాట్లాడుతూ పార్టీలో 'వారసత్వం'ను ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలపై తగిన సమాధానం ఇచ్చే లక్ష్యంతో వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కనౌజ్ స్థానం నుంచి పోటీ చేయాలని పార్టీ అధ్యక్షుడు నిర్ణయించినట్లు తెలిపారు. అయితే ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో కనౌజ్ స్థానం సమాజ్‌వాది



పార్టీకి కీలక పరీక్షే. గత శాసనసభ ఎన్నికల్లో ఈ లోక్‌సభ నియోజకవర్గంలో రెండు నుంచి మూడు స్థానాలను బీజేపీకి కోల్పోయింది. అయితే 2 వేల ఓట్ల మార్జిన్‌తో కనౌజ్ సిటీ స్థానంలో ఎస్పీ గెలుపొందింది. మరొక ఇబ్బందికర విషయమేమిటంటే, ఇటీవల జరిగిన నగర పాలిక ఎన్నికలలో కనౌజ్‌లో ఐదు నగర పంచాయతీ చైర్మన్ స్థానాలను, మూడు నగర పాలిక చైర్మన్ స్థానాలను కూడా ఎస్పీ కోల్పోయింది. కాగా 2014లో కనౌజ్ లోక్‌సభ స్థానం నుంచి డింపుల్ యాదవ్ కేవలం 2 వేల ఓట్ల తేడాతో బీజేపీ అభ్యర్థిని ఓడించారు. ఇదిలాఉండగా 2012లో ముఖ్యమంత్రి అయిన తర్వాత ఈ స్థానాన్ని విడిచిపెట్టే ముందు అఖిలేష్ యాదవ్ లోక్‌సభలో కనౌజ్‌కు మూడుసార్లు ప్రాతినిధ్యం వహించారు. ఇక రాష్ట్రంలోని ప్రస్తుత బీజేపీ ప్రభుత్వాన్ని ఉద్దేశించి అఖిలేష్ మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆద్యితనాథ్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని అన్నారు. ప్రత్యేకించి శాంతి, భద్రతల పరిస్థితి దిగజారిందన్నారు. రాజధాని శివార్లలోని కకోరిలో ఆదివారం జరిగిన దోపిడీ ఘటనపై మాట్లాడుతూ శాంతి, భద్రతల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వాదనలను ఈ ఘటన బహిర్గతం చేసిందని చెప్పారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరుల గ్రామంగా ప్రసిద్ధి చెందిన కకోరి ఇపుడు దోపిడీలకు ఆలవాలంగా మారిందని అఖిలేష్ అన్నారు. మధుర, కనౌజ్‌ల్లో ఇటీవల చోటుచేసుకున్న ఘటనలను ప్రస్తావిస్తూ, ప్రజలపై అమానుష దాడులకు సంబంధించి పోలీసులను నిందించారు. ప్రజల కోసం సమాజ్‌వాది పార్టీ పోరాటం చేస్తుందన్నారు. 'సమాజాన్ని బీజేపీ విభజిస్తుంటే సమాజ్‌వాది ప్రజలను ఐక్యం చేస్తోంది' అని ఎస్పీ నాయకుడు అఖిలేష్ యాదవ్ తెలిపారు.



స్కూలు బ్యాగుల్లో సిగరెట్లు, పోర్న్ మ్యాగజైన్లు!

లక్నో : సిగరెట్లు, లైటర్లు, గుట్కాలు, సెక్స్ మ్యాగజైన్లు, ఐపాడ్లు, మొబైల్ ఫోన్లు.. ఇవీ లక్నోలోని టాప్ స్కూళ్ల పిల్లల బ్యాగుల్లో దర్శనమిచ్చాయి. పుస్తకాలు ఉండాల్సిన బ్యాగు ల్లో వీటిని చూసి అక్కడి అధికారులు నిర్ఘాంతపోయా రు. లక్నోలోనే ఉన్న బ్రైట్ లాండ్ స్కూల్లో ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థిపై ఆరో తరగతి విద్యార్థిని కత్తితో దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సిటీలోని పన్నెండు టాప్ స్కూళ్లలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. విద్యార్థుల బ్యాగులు తనిఖీ చేస్తే విస్తుపోయే వస్తువులు బయటపడ్డాయి. ఓ 9వ తరగతి విద్యార్థి దగ్గర సైన్స్ సబ్జెక్ట్ అని రాసిన బుక్ పరిశీలిస్తే అది పోర్న్ మ్యాగజైన్ అని తెలిసింది. మరికొందరి దగ్గర సిగరెట్లు, లైటర్లు, గుట్కాలు దొరికాయి. ఇవి చాలా తీవ్రమైనవి కావడంతో ఆయా విద్యార్థుల తల్లిదండ్రులకు ఫిర్యాదు చేశామని ఓ స్కూల్ టీచర్ చెప్పారు. మరికొందరి దగ్గర రేజర్లు, షేవింగ్ ఫోమ్స్ దొరికాయి. ఇంట్లో షేవింగ్ చేసుకోనివ్వరని, అందుకే వాటిని స్కూళ్లకు తీసుకొస్తున్నట్లు విద్యార్థులు చెప్పడం విశేషం. గర్ల్స్ హైస్కూల్‌లోనూ ఈ బ్యాగుల తనిఖీలు జరిగాయి. వాళ్ల బ్యాగుల్లో కత్తెర్లు, బ్లేడ్లు, నెయిల్ పాలిష్‌లు, లిప్‌స్టిక్స్, సెంట్లు బయటపడ్డాయి. కొందరి దగ్గర ఐపాడ్లు, మొబైల్ ఫోన్లు ఉన్నాయి. వాటిని స్వాధీనం చేసుకున్నారు. షాకింగ్ వస్తువులు బయటపడటంతో అటు స్కూళ్లు, ఇటు తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు స్పష్టంచేశారు.

రథసప్తమి ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర-అరసవల్లి (స్పోర్ట్స్) : శ్రీకాకుళం జిల్లా అరసవిల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయంలో రథసప్తమి పండుగకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎస్పీ త్రివిక్రమవర్మ తెలిపారు. సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రథసప్తమి పండుగకు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తగుజాగ్రత్తలు తీసుకున్నామని, అన్ని శాఖల సమన్వయంతో పండుగను మరింత ఆనందంగా సాగేలా చూస్తామని చెప్పారు.

శ్రీవారి ఆలయ పైకప్పు ఏర్పాటుకు రూ.కోటి విరాళం



విశాలాంధ్ర - తిరుమల : తిరుమల శ్రీవారి ఆలయంలో భక్తులకు ఎండకు, వర్షానికి ఇబ్బంది లేకుండా ముడుచుకునే పైకప్పు ఏర్పాటు కోసం నెల్లూరుకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రూ.1.09 కోట్ల విరాళం ప్రకటించారు. ఈ మేరకు మొదటి దశ పనుల కోసం రూ.55 లక్షల డీడీని సోమవారం ఉదయం తిరుపతిలోని తిరుమల జేఈవో క్యాంపు కార్యాలయంలో జేఈవో కె.ఎస్.శ్రీనివాసరాజుకు అందించారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ శ్రీవారి ఆలయంలో ఏర్పాటు చేస్తున్న ముడుచుకునే పైకప్పునకు అయ్యే వ్యయాన్ని విరాళంగా అందించేందుకు పీపీఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ అధినేత వి.ప్రభాకర్‌రెడ్డి ముందుకొచ్చారని తెలిపారు. మొదటిదశ పనుల కోసం రూ.55 లక్షల డీడీని అందించారని చెప్పారు. ఈ పైకప్పు ఎండకు, వర్షానికి భక్తులకు రక్షణ కవచంగా ఉంటుందన్నారు.

మూడు ప్రత్యేక రైళ్లు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ప్రయాణికుల రద్దీని నివారించ డానికి సికింద్రాబాద్ -తిరుపతి- సికింద్రాబాద్, కాకినాడ టౌన్ -సికింద్రాబాద్ మధ్య 3 ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు రైల్వే అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రైలు నెంబర్ 02734 గా ఈ నెల 25వ తేదీన సికింద్రాబాద్‌లో రాత్రి 7.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.50 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో రైలు నెంబర్ 02733గా 28వ తేదీన తిరుపతిలో సాయంత్రం 5.00 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 4.25 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది. ఈ రైలు నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, గుంటూరు, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, శ్రీకాళహస్తి, రేణిగుంట స్టేషన్‌లలో ఆగుతుంది. రైలు నెంబర్ 07002గా ఈ నెల 28వ తేదీన కాకినాడ టౌన్‌లో సాయంత్రం 6.00 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 4.10 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ రైలు సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ళ, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్‌లలో ఆగుతుంది.

ఏయూ ఉద్యోగుల ప్రమోషన్లలో గందరగోళం

- 2014 ప్రభుత్వ జీవోను రెండేళ్ల తరువాత అమలుపరిచిన వైనం
- ఆగిపోయిన పలువురి పదోన్నతులు
- కమిటీ నివేదికలో కూడా లేని స్పష్టత
- మొత్తం గందరగోళానికి తెరతీసిన ఎస్-3 సెక్షన్

విశాలాంధ్ర-విశాఖసిటీ : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న బోధనేతర ఉద్యోగులకు సంబంధించి పదోన్న తుల విషయంలో గందరగోళం నెలకొంది. వర్సిటీలో టెక్నికల్ సిబ్బంది, నాన్‌టెక్నికల్ సిబ్బంది 31 మందికి ప్రమోషన్లు నిలిచిపోయాయి. 2014లో ప్రభుత్వం విడుదలచేసిన జీవో నెం.135 ఉద్యోగుల పదోన్నతులకు అడ్డంకిగా నిలిచిందని వర్సిటీవర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఈ 31మందిలో కొంతమందికి పదోన్నతులు కల్పించి న్యాయం చేస్తే, మిగిలిన వారు నష్టపోతున్నారు. అలాగని అందరికీ పదోన్నతులు కల్పించలేని పరిస్థితి నెలకొనడంతో ఏమిచేయాలో తెలియని పరిస్థితిలో వర్సిటీ ఉన్నతాధికారులు ఉన్నారు.

135 జీవో ఏమి చెబుతుంది?

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పలు విశ్వవిద్యాలయాల్లో శాశ్వత పద్ధతిలో ఉద్యోగాలు చేస్తున్న బోధనేతర సిబ్బందికి యూని వర్సిటీ నిబంధనల ప్రకారం సీనియార్టీని బట్టి పదోన్న తులు లభించేవి. అదేవిధంగా యూనివర్సిటీ ఏర్పడిన ప్ప ట్నుంచి ఏయూలో కూడా అదే విధంగా ఉద్యోగులకు పదోన్నతులు లభించేవి. కానీ 2014లో ప్రభుత్వం విడుదల చేసిన 135 జీవో ప్రకారం నాన్ టెక్నికల్ సిబ్బం దికి డిగ్రీ విద్యార్హత, టెక్నికల్ సిబ్బందికి ఐటీఐ విద్యార్హతతో పదోన్నతులకు ముడిపెట్టింది. ఇదే వర్సిటీలోని ఉద్యోగుల ఆందోళనకు ప్రధాన కారణంగా నిలుస్తోంది. దీంతో సీనియారిటీ ఉన్నా కొందరు ఉద్యోగులు విద్యార్హత లేకపోవడం మూలంగా పదోన్నతులు పొందలేక పోతున్నారు. జీఓ విడుదలైన వెంటనే ఆ నిబంధన తమకు తెలిపి ఉంటే ఈ పాటికి డిగ్రీ, ఐటీఐలు పూర్తి చేసి ఉండేవారమని, వర్సిటీ అధికారులు తమకు అన్యాయం చేశారంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జీవో అమల్లో జాప్యం

రాష్ట్ర ప్రభుత్వం ఈ పదోన్నతులకు సంబంధించి 2014 మే నెలలో జీవో విడుదల చేస్తే ఏయూలో ఈ జీవోను పరిగణనలోకి తీసుకోకుండా యథావిధిగా సీనియార్టీ ప్రకా రం 2016 సంవత్సరం వరకు పదోన్నతులు కల్పించారు. ఆ తరువాత కళ్లు తెరిచిన అధికారులు ఈ జీవోను అడ్డంకిగా చూపిస్తూ పదోన్నతులు నిలిపివేశారు. అంటే 2016 వరకు కొంతమందికి యథావిధిగా ప్రమోషన్లు వచ్చాయి. తదుపరి కొంత మందికి ఆగిపోయాయి. అధికా రులు చేసిన ఈ తప్పిదానికి ఉద్యోగులు బలైపోయారు.

స్పష్టత లేని కమిటీ నివేదిక

వర్సిటీలో జీవో నెం. 135, ఉద్యోగుల పదోన్నతులకు సంబంధించి పూర్తి వివరాలు నివేదిక ద్వారా ఇవ్వాల్సిం దిగా కోరుతూ ఆచార్య రామ్మోహనరావు అధ్యక్షతన వర్సిటీ ఉన్నతాధికారులు ఒక కమిటీని ఏర్పాటుచేశారు. ఆ కమిటీ కూడా 2017 నవంబరులో ఒక నివేదిక ఇస్తూ నేటి నుంచి నియామకాలు పదోన్నతుల విషయంలో జీవో 135ను అమలుచే యాలని, అప్పటివరకు పొందిన వారి ప్రమోషన్లు యథా విధిగా కొనసాగించాలని తెలిపింది. దీనినే తదుపరి జరిగిన పాలకవర్గ సమావేశంలో కూడా చర్చించారు.

ఏయూ ఎస్-3 సెక్షన్ నిర్లక్ష్యం

2014లో ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం. 135ను వర్సిటీలోని విభాగాలకు తెలియజేయడంలో కీలకంగా పనిచేయాల్సిన ఎస్-3 సెక్షన్ అసలు పట్టించుకోలేదని ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల వారు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా 2016 వరకు పదోన్నతులు ఈ జీవోతో సంబంధంలేకుండా ఇచ్చి ప్రస్తుతానికి కొంతమంది పదోన్నతులు నిలిపివేయడంలో ఎస్-3 సెక్షన్ పనితీరు సరిగ్గా లేకపోవడమే కారణమని ఉద్యోగ వర్గాలు ఆరోపిస్తు న్నాయి. వీరు ఈ నిబంధనల గురించి ఉద్యోగులకే కాక వర్సిటీ ఉన్నతాధికారులకు కూడా సరైన వివరాలు తెలపకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని వర్సిటీ ఉద్యోగ సంఘాల వారు కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జరిగిన టైపిస్టు పోస్టుల విషయంలో కూడా ప్రభుత్వ నిబంధన రెండేళ్లకు ఉంటే దాన్ని అయిదేళ్లుగా చెప్పి ఏడాదిన్నర పాటు నలుగురు ఉద్యోగులకు ఎస్-3 సెక్షన్ అధికారులు పోస్టింగులు నిలిపివేశారని ఆయా వర్గాలు చెబుతున్నాయి. దీనిపై ఏయూ వీసీ స్వయంగా జోక్యం చేసుకొని వారికి న్యాయం చేశారని, అదేవిధంగా కొంత మందికి ఇంక్రిమెంట్లు కూడా నిలిపివేశారని, వారికి కూడా వర్సిటీ ఉన్నతాధికారులు జోక్యం చేసుకునేంత వరకు న్యాయం జరగలేదంటున్నారు.

సీనియారిటీ ప్రకారమే పదోన్నతులు కల్పించాలి

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఏర్పడినప్పటినుంచి పది పీఆర్‌సీలు తీసుకున్నామని, ఇప్పటివరకు సీనియారిటీ ప్రకారమే ఉద్యోగులకు పదోన్నతులు కల్పించారని ఏయూ బోధనేతర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ గుంటుబోయిన రవికుమార్ తెలిపారు. 2014లో విడుదల చేసిన జీవో నెం.135 1998 మినిస్టీరియల్ సర్వీస్ రూల్స్ జీవోనెం. 261కు అనుబంధమని, ఆ జీవోనే యూనివర్సిటీ అడాప్ట్ చేసుకోలేదని, అటువంటప్పుడు ఈ జీవోను ఎలా అమలుపరుస్తారని ఆయన ప్రశ్నించారు. 2014లో జీవో విడుదలైతే 2016 వరకు పలువురికి పదోన్నతులు సీనియారిటీ ప్రకారం కల్పించి మిగిలిన వారికి నిబంధనలు పెట్టడం సరికాదన్నారు. కొత్తగా ఇప్పటినుంచి నియామకాలు చేసుకునేవారికి ఈ జీవో అమలుచేయాలని, పాతవారికి పాతపద్ధతిలోనే పదోన్న తులు కల్పించాలని ఆయన కోరారు. కాదంటే వర్సిటీలోని నష్టపోయిన ఉద్యోగులు కోరుతున్నట్టు విద్యార్హతకు కొంత సమయం ఇచ్చి పదోన్నతులు కల్పించాలన్నారు. అయిన ప్పటికీ అన్ని ప్రభుత్వ జీవోలు యూనివర్సిటీలు అమలు పరుచు కోనక్కరలేదని, యూనివర్సిటీ చట్టాల ప్రకారం ఆ వెసులుబాటు ఉందన్నారు. ఉద్యోగులకు మేలుచేకూర్చే జీవోలను పక్కన పెట్టి నష్టం కలిగించే జీవోలు మాత్రమే అమలు పరచడం బాధాకరమన్నారు. దీంతో పాటు గత ఏడాది విడుదలైన మరో జీవో ప్రకారం వర్సిటీలోని ఎవరైనా ఉద్యోగులు మరణిస్తే వారి స్థానంలో వచ్చిన ఉద్యోగులకు విద్యార్హత విషయంలో మినహాయింపు ఉందని, ఈ జీవోను వర్సిటీ అధికారులు పరిగణనలోకి తీసుకొని ఉద్యోగులకు న్యాయం చేయాల్సిందిగా ఆయన కోరారు.

ఈ నేపథ్యంలో వర్సిటీ ఉద్యోగుల పదోన్నతుల విషయంలో ప్రభుత్వం దృష్టికి కూడా కొంతమంది తీసుకువెళ్లారు. దీనిపై ఇప్పటికే మల్లగుల్లాలు పడుతున్న యూనివర్సిటీ ఉన్నతాధికారులు రాబోయే పాలకవర్గ సమావేశంలో ఏమి నిర్ణయిస్తారో వేచి చూడాల్సి ఉంది.

రైతుల అభ్యున్నతికి కృషి

మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



విశాలాంధ్ర-గుంటూరు (కార్పొరేషన్) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రైతులు ముఖ్యంగా గుంటూరు జిల్లా రైతులు ఆదర్శరైతులని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. గుంటూరు శివారు ప్రాంతమైన లాం ఫారంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధనా కేంద్రంలో సోమవారం కిసాన్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించి రైతుల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించేందుకు కర్నూలు జిల్లాలోని తంగడంచ వద్ద మెగా సీడ్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయడమైందన్నారు. ప్రపంచంలోనే విత్తన పరిశోధనలో మేటి అయిన అమెరికాలోని అయోవా యూనివర్సిటీతో ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. వివిధ కంపెనీలను భాగస్వామ్యం చేసుకొని రూ. 650 కోట్ల పెట్టుబడితో 600 ఎకరాల మెగా సీడ్ ప్రాజెక్టులో నాణ్యమైన విత్తనాలను తయారు చేసి రాష్ట్రంలోని రైతులందరికీ అందజేయడమే కాకుండా భారతదేశంలోని అన్ని రాష్ట్రాలలోని రైతులకు విత్తనాలను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమం ఫిబ్రవరి నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని భూములన్నింటిని పరీక్షలు చేసి రైతులకు సాయిల్ హెల్త్‌కార్డులు ఇచ్చినట్లు తెలియజేశారు. ఇన్‌పుట్ సబ్సిడీ కింద నాలుగు మాసాలలో రూ. 1900 కోట్లు ఇచ్చినట్లు, ప్రత్యేకంగా అనంతపురం జిల్లాలో రూ. 1450 కోట్లు ఇచ్చినట్లు తెలిపారు.

రాష్ట్ర పౌరసరఫరా శాఖా మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో అనేక మార్పులు తీసుకొచ్చి ఉత్పాదకతను పెంచుకొనుటలో రైతులకు ఎన్నో సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. మార్కెటింగ్‌లో కొత్త విధానం అమలు చేసినట్లు చెప్పారు. వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే నెంబర్ వన్ విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆశిస్తున్నట్లు చెప్పారు.

ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉప కులపతి వల్లభనేని దామోదర్‌నాయుడు మాట్లాడుతూ వ్యవసాయ విధానంలో తీసుకొచ్చిన కొత్త మార్పులను ప్రతి ఒక్క రైతు తెలుసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ హరి జవహర్‌లాల్ మాట్లాడుతూ 2017-18లో వాతా వరణం అనుకూలించడం వలన మంచి దిగుబడులు వచ్చాయన్నారు. జాతీయ స్థాయిలో మన రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉన్నట్లు, వివిధ పంటల ఉత్పత్తిపైనే కాకుండా వ్యవసాయ కుటుంబీకుల సంక్షేమంపై కూడా ముఖ్యమంత్రి శ్రద్ధ వహిస్తున్నట్లు చెప్పారు. పాలక మండలి సభ్యులు మేకల లక్ష్మీనారాయణ, పరిశోధనా పరిశీలకులు నాయుడు, పి. రత్నప్రసాద్, తాడికొండ ఎమ్మెల్యే శ్రావణకుమార్ పాల్గొన్నారు.

వరద రక్షణ గోడకు రూ.138.78 కోట్లు

విశాలాంధ్ర - విజయవాడ : కృష్ణానది వరదల నుంచి విజయవాడ నగరాన్ని కాపాడేందుకు అవసరమైన రక్షణ గోడ నిర్మించేందుకు ప్రభుత్వం రూ. 138.78 కోట్లను మంజూరు చేసింది. ఈ మేరకు సోమవారం జీవో నెంబరు 44 ను విడుదల చేసింది. జలవనరుల శాఖ పర్యవేక్షణలో ఈ పనులు జరుగుతా యని, ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వమే విడుదల చేస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విజయవాడ నగరంలోని రామలింగేశ్వరనగర్ నుంచి యనమలకుదురు వరకు కృష్ణానది ఎడమ అంచు వైపున ఈ నిధులతో వరద నగరంలోకి రాకుండా పనులు చేస్తారు. కృష్ణానదికి వరదలు వచ్చినపుడు నగరంలోని పల్లపు ప్రాంతాల్లోకి వరద నీరు చొచ్చుకువస్తోంది. వరద బారినుంచి ఈ ప్రాం తాలను కాపాడేందుకు 2014లోనే అంచనాలు తయారు చేశారు. అప్పట్లో రూ. 98.54 కోట్లతో ఈ పనులు చేయాలని టెండర్లు పిలిచారు. కాంట్రాక్టరు 5.40 శాతం కన్నా తక్కువకు టెండరు దాఖలు చేసి పనులను దక్కించుకున్నారు. రెండు సంవ త్సరాల వ్యవధిలో ఈ పనులను చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. మెటీరియల్ ధరలు 2013- 14 సంవత్స రానికి సంబంధించినవి కావడంతో తనకు గిట్టుబాటు కావడం లేదని కాంట్రాక్టరు ప్రభుత్వానికి నివేదించారు. జలవనరులశాఖ అధికారులు పరిశీలన చేసి 32.66 శాతం మేర అంచనాలను రూ. 138.78 కోట్లకు పెంచుతూ ప్రభుత్వానికి నివేదిక పంపారు. పెంచిన అంచనాలను ఆమోదిస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి.

బందరు పోర్టును పట్టించుకుంటారా

- భోగాపురం పోర్టుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్
- భూమి సమీకరించినా బందరు పోర్టు పనులు ప్రారంభించని వైనం
- భోగాపురం పోర్టుకు 2,554 ఎకరాలు సేకరించాలని నిర్ణయం
- బందరు పోర్టుకు 32 వేల ఎకరాలెందుకో



విశాలాంధ్ర - విజయవాడ : రాష్ట్రంలో తీరం వెంబడి 14 పోర్టులను అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఇటీవల కేబినెట్ సమావేశంలో విజయనగరం జిల్లాలోని భోగాపురం ఓడరేవును అభివృద్ధి చేసేందుకు ఆమోదం తెలిపింది. భోగాపురం ఓడరేవు అభివృద్ధి అంశం బాగానే ఉన్నా కృష్ణా జిల్లాలోని బందరు పోర్టును అభివృద్ధి చేసే అంశంపై పాలకులు పెదవి విప్పడం లేదు. రాష్ట్ర రాజధానికి, తెలంగాణా రాజధాని హైదరాబాదుకు అతి దగ్గరలో ఉన్న బందరు పోర్టును అభివృద్ధి చెసె అంశంపై పాలకులు మీన మేషాలు లెక్కిస్తున్నారు. బందరు పోర్టును అభివృద్ధి చేసేందుకు 32వేల ఎకరాల భూమి కావాలని మెలిక పెడుతున్న ప్రభుత్వం భోగాపురం ఓడరేవు నిర్మాణానికి 2,554 ఎకరాలు మాత్రమే చాలని చెప్పడం గమనార్హం.

భూమి సమీకరించి 10 నెలలు : బందరు పోర్టు నిర్మాణం కోసం ప్రభుత్వం 32వేల ఎకరాలను సమీకరించాలని, సేకరించాలని రెండు నోటిఫికేషన్లను జారీ చేసింది. గతేడాది మార్చి నెలలో 3,010 ఎకరాలను రెవెన్యూ అధికారులు సమీకరించారు. ఈ భూమిని కాకినాడ పోర్టు డైరెక్టర్‌కు అప్పట్లోనే అప్పగించారు. అయితే భూసమీకరణ జరిగినా పోర్టు పనులు ప్రారంభించకుండా ప్రభుత్వం జాప్యం చేస్తోంది. రైతులు తమ భూములు ఇచ్చేందుకు ముందుకు రాకున్నా మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) ద్వారా ఈ భూమిని సమీకరించారు. బందరు పోర్టు నిర్మాణానికి 5,324 ఎకరాలు సరిపోతుందని నివేదిక ఉంది. ఇందులో 3,010 ఎకరాల భూమిని సమీకరించారు. దీంతో పాటు సమీకరణకు అనుకూలంగా 850 ఎకరాలను రైతులు ముడాకు అప్పగించారు. ఈ విషయాన్ని అధికారులు దాచిపెడుతున్నారు. తొలి విడత పనులను సమీకరించిన భూమిలో ప్రారంభించే అవకాశం ఉంది. భోగాపురం పోర్టు నిర్మాణాన్ని 2,554 ఎకరాల్లోనే నిర్మిస్తామని చెబుతున్న ప్రభుత్వం బందరు పోర్టు నిర్మాణం వద్దకు వచ్చేసరికి 32 వేల ఎకరాల భూమి కావాలని పట్టుబట్టడం గమనించదగ్గ అంశం. బందరు పోర్టు పనులు ప్రారంభించకుండా జాప్యం చేస్తున్న పాలకులు.. రైతులు భూములు ఇస్తేనే పనులు ప్రారంభమవుతాయని చెబుతూ కాలయాపన చేస్తున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును బందరు పోర్టు నిర్మాణం జరిగే ప్రాంతాల్లోని పలు గ్రామాలకు చెందిన సుమారు 300 మంది రైతులు కలుసుకున్నారు. బందరు పోర్టు అభివృద్ధిపై రైతులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. బందరు పోర్టు నిర్మాణంపై అధికారులతో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని చెప్పి రైతులను పంపేశారు. కొద్దిరోజులకే విజయనగరం జిల్లా భోగా పురం పోర్టు నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలపడంతో బందరు పోర్టు నిర్మాణాన్ని ప్రభుత్వం పట్టించుకుంటుందా, లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. రైతులకు ఎలాంటి నష్టపరిహా రం ఇవ్వకుండానే ప్రభుత్వ, అసైన్డ్ భూమి 3,010 ఎకరాలను సమీకరించారు. పోర్టు పనుల ప్రారంభంపై పాల కుల నుంచి ఇంకా స్పష్టత రాకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

జీజీహెచ్‌లో సందర్శకుల భవన నిర్మాణం

విశాలాంధ్ర-గుంటూరు (వైద్యశాఖ) : జీజీహెచ్‌కు వచ్చే రోగుల సందర్శకుల ప్రయోజనార్థం ఏపీఎన్జీఓ ఆధ్వర్యంలో భవనాన్ని నిర్మించనున్నట్లు ఏపీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి మీరావలి తెలిపారు. ఈ సందర్భంగా భవన నిర్మాణం జరిగే ప్రదేశాన్ని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఎస్.రాజునాయుడుతో కలిసి సోమవారం పరిశీలించారు. అనంతరం మీరావలి మాట్లాడుతూ 1650 చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.25 లక్షల నిధులతో జీ+2 పద్ధతిలో ఈ భవన నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ నెల 24వ తేదీన ఉదయం 9.50 గంటలకు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ కోన శశిధర్, ఏపీ ఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌బాబు హాజరుకానున్నట్లు వివరించారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రోగులను సందర్శించే వారికి వసతి కల్పించాలనే ఉద్దేశ్యంతో ఈ భవనాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. ఏపీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు బాజిత్, మినిస్టీరియల్ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మద్దు ప్రేమజ్యోతిబాబు, ప్రధాన కార్యదర్శి జి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళపై కత్తితో దాడి

విశాలాంధ్ర-సత్తెనపల్లి : ప్రియురాలిపై కత్తితో విచక్షణా రహితంగా ప్రియుడు దాడి చేసిన ఘటన ఆదివారం రాత్రి గుంటూరు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని శివాలయం ప్రాంతంలో జరిగింది. పట్టణ ఎస్సై రాంబాబు కథనం ప్రకారం శివాలయం ప్రాంతానికి చెందిన వివాహితుడైన కమ్మనేతుల రామాంజనేయులు పాత బస్టాండ్ ప్రాంతంలో సిగరెట్ల బంకును నిర్వహిస్తున్నాడు. అదే ప్రాంతంలోని ప్రైవేట్ వైద్యశాలలో పనిచేస్తున్న సఖినేలా అరుణతో రామాంజనేయులుకు అయిదు సంవత్సరాలనుండి పరిచయం ఉన్నది. అరుణది కృష్ణా జిల్లా కంచికచర్ల. వీరిద్దరూ పట్టణంలోని నాగన్నకుంటలో సహజీవనం చేస్తున్నారు. అరుణకు సంబంధించిన పోషణ, ఇతర అన్నివిషయాలలో రామాంజనేయులు అండగా ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో అరుణ సత్తెనపల్లి నుండి పిడుగురాళ్లకు నాలుగు నెలలక్రితం వెళ్లి అక్కడ సూపర్ మార్కెట్లో పనిచేస్తున్నది. పిడుగురాళ్ల వెళ్లిన రామాంజనేయులు తనతో సత్తెనపల్లి రావాలని అరుణను బలవంతపెట్టాడు. తనతో సంబంధాన్ని వదులుకోవాలని, తాను ఇక్కడే ఉంటానని అరుణ చెప్పటంతో ప్రియురాలు తనని వదిలి వేరేవారితో ఉంటున్నదనే అనుమానం ఆంజనేయులుకు కలిగింది. అరుణతో సఖ్యతగా ఉంటానని నమ్మించి సత్తెనపల్లి తీసుకొనివచ్చాడు. అనంతరం వీరిద్దరి మధ్య వివాదం జరిగి, రామాం జనేయులు కత్తితో విచక్షణారహితంగా అరుణ గొంతు, ముఖం చేతులు, చెవి వెనుకభాగంలో 14 సార్లు పొడిచాడు. అనంతరం రామాంజనేయులు తన ఎడమ చేయి కోసుకొని గాయపరచుకున్నాడు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించటంతో హుటా హుటిన పోలీసులు వచ్చి 108 వాహనంలో సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కేంద్ర మంత్రితో కామినేని భేటీ

న్యూఢిల్లీ- విశాలాంధ్ర బ్యూరో : కొల్లేరు, పోలవరం అంశాలపై రాష్ట్ర మంత్రి కామినేని శ్రీనివాస్ సోమవారం న్యూఢిల్లీలో కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రి హర్షవర్ధన్‌తో భేటీ అయ్యారు. కొల్లేరు, పోలవరం వల్ల నిర్వాసితులైన వారికి తగిన విధంగా ఆదుకునేందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కొల్లేరు విషయంలో నిర్వాసితులను ఆదుకునేందుకు సిద్ధంగా ఉందన్నారు. పర్యావరణానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా వాటర్‌లో కొల్లేరు నిర్వాసితులకు బతుకుతెరువు కల్పించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. కేంద్ర మంత్రి హర్షవర్ధన్ కూడా సానుకూలంగా స్పందించారని చెప్పారు. అయితే పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై కూడా కామినేని కేంద్రంతో చర్చించినట్లు సమాచారం. కేంద్ర మంత్రి హర్షవర్ధన్ వద్ద పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై చర్చించారని తెలిసింది.

ప్రధానినని అహంకారం

మోడీపై అన్నాహజారే ఆగ్రహం

సాంగ్లీ : ప్రధాని మంత్రి నరేంద్రమోడీ ' ప్రధానిపదవితో అహంకారం' ప్రదర్శిస్తున్నారని అవినీతి వ్యతిరేక ఉద్యమ నేత అన్నా హజారే ఆగ్రహం ప్రకటించారు. ఎలాంటి కారణం లేకుండా మోడీ తన లేఖలకు ఎందుకు సమాధానం ఇవ్వడం లేదని ఆయన ప్రశ్నించారు. సాంగ్లీ జిల్లా అప్పాడీలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ గత మూడేళ్లలో తాను 30 లేఖలు రాశానని, ఒక్కదానికి కూడా సమాధానం ఇవ్వలేదన్నారు. ప్రధాని పదవితో ఆయన అహంకారానికి పోతున్నారని అందువల్లే తన లేఖలకు జవాబివ్వలేదని హజారే అన్నారు. మార్చి 23 తేదీ నుంచి ఢిల్లీలో మరో దఫా ఆందోళనకు శ్రీకారం చుట్టనున్నట్లు ఆయన ప్రకటించారు. ఢిల్లీలో ప్రారంభించబోయే ఆందోళనకు మద్దతు సమీకరించే కార్యక్రమంలో భాగంగా మూడు చోట్ల సభలు నిర్వహించాలని హజారే తల పెట్టారు. సాంగ్లీలో జరిగిన సభ మొదటిది. సభలు ఆందోళనల మూలంగా ఓట్లు కావాలని నేను కోరుకోవడం లేదు. జన్‌లోక్‌పాల్‌కోసం భారీ ర్యాలీ నిర్వహించాను. రైతుల సమస్యలపై కూడా ఇటువంటి ఆందోళనే భవిష్యత్‌లో నిర్వహిస్తానన్నారు.

మోడీ బ్లాక్ మెయిలర్

- స్వతంత్ర వ్యవస్థలన్నింటినీ లోబర్చుకుంటున్నారు
- ఎదురు తిరిగితే జైలు
- అనుకూలమైతే అందలం
- బీజేపీది హోల్‌సేల్ వ్యాపారం
- నందిగామ బహిరంగసభలో నారాయణ విమర్శ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: దేశ చరిత్రలో మున్నెన్నడూ లేనివిధంగా భారత ప్రధాని నరేంద్రమోడీ స్వతంత్ర వ్యవస్థలన్నింటినీ బ్లాక్‌మెయిల్ చేస్తూ తన స్వార్థ రాజకీయాలకు వుపయోగించుకుంటున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ మండిపడ్డారు. కృష్ణాజిల్లా సీపీఐ 23వ మహాసభలను పురస్కరించుకొని సోమవారం నందిగామలో భారీ ప్రదర్శన,బహిరంగ సభ నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన నారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వాన్ని ఎదిరించేవారిపై స్వతంత్ర వ్యవస్థలను ప్రయోగించి ఇబ్బంది పెడుతున్నారని, దానికి లొంగి దాసోహమైతే అందలం ఎక్కిస్తున్నారని విమర్శించారు. దీనికి సీబీఐ, నీతి ఆయోగ్, ఎన్నికల కమిషన్, రాష్ట్రపతి, చివరకు న్యాయవ్యవస్థను సైతం ఆయన వినియోగించుకుంటున్నారన్నారు. లక్షా 75వేల కోట్ల 2జీ స్ప్రెక్టమ్ కుంభకోణానికి పాల్పడిన కనిమొళి, రాజాలకు ఇటీవల సీబీఐ క్లీన్‌చిట్ ఇవ్వడం, ఆప్ ఎమ్మెల్యేలపై రాష్ట్రపతి చేత అనర్హత వేటు వేయించడం, కీలక కేసుల అంశంలో ఇతర న్యాయమూర్తులను తప్పించడంతో ఇటీవల దేశ చరిత్రలో మొదటిసారిగా నల్గురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు చీఫ్ జస్టిస్‌పై ఆరోపణలు చేసిన సంఘటనలను ఉదహరించారు. అవినీతి రహిత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో కోతలు కోసిన మోడీ గతంలో కేవలం 2లక్షల కోట్ల మేర వున్న ఎగవేతదారుల సంఖ్యను 7 లక్షల కోట్లకు పెంచారని ఎద్దేవా చేశారు. అలాగే దాదాపు 13లక్షల కోట్లు పారిశ్రామికవేత్తలకు రాయితీలిచ్చారన్నారు. కాంగ్రెస్ పార్టీది చిల్లర వ్యాపారమైతే బీజేపీది హోల్‌సేల్ వ్యాపారమని ఆయన ధ్వజమెత్తారు. నోట్ల రద్దు చేసి అవినీతిపరుల వద్ద వున్న నల్లధనాన్ని తెల్లధనంగా మార్చారని విమర్శించారు. నోట్ల రద్దుతో అవినీతి నిర్మూలించబడుతుందని, ధరలు తగ్గుముఖం పడతాయని, టెర్రరిజం భూస్థాపితమవుతుందని ప్రగల్భాలు పలికారని, తీరా చూస్తే ఇవన్నీ తగ్గకపోగా సామాన్యులు క్యూలైన్లలో ఏటీఎంల ముందు పడిగాపులు కాసి 150 మంది మృత్యువాతపడ్డారన్నారు. దీనివల్ల పెద్దలు ఒక్కరు కూడా ఇబ్బంది పడలేదన్నారు. తర్వాత మరో చారిత్రాత్మక సంస్కరణ అంటూ అమల్లోకి తెచ్చిన జీఎస్టీ వల్ల సంపన్నులకు 20శాతం పన్ను తగ్గించి సామాన్యులకు పెంచారన్నారు. ఈ రెండు నిర్ణయాలు సంపన్నవర్గాలకే వుపయోగకరమన్నారు. మోడీది కొంగజపం. ఆయన చూపు పెద్దల వైపు, నటన పేదల వైపు వుంటుందని ఎద్దేవా చేశారు. తాజాగా పేదల డిపాజిట్లు స్వాహా చేసే మరో బిల్లు తీసుకురావడానికి కేంద్రం సిద్ధం చేసిందని, మోడీ అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తున్నారని విమర్శించారు. దేశాన్ని కాపాడాల్సిన, ప్రజలను రక్షించాల్సిన ఒక ప్రధాని తనకు ప్రాణాపాయం వుందని ఇటీవల గుజరాత్ ఎన్నికల్లో వ్యాఖ్యానించడం, హిందూత్వవాది తొగాడియా తనకు ప్రాణభయం వుందని ప్రకటించడం విడ్డూరంగా వుందన్నారు. ఒకప్రక్క వ్యవస్థలను భ్రష్టుపట్టిస్తూ మరోప్రక్క దొంగేదొంగ అన్నట్లు వారే ఇతరులపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను పలుచన చేస్తూ, రాజ్యాంగ విలువలను కాలరాస్తూ నియంత పాలన కొనసాగిస్తున్న మోడీ విధానాలపై లౌకిక, ప్రజాస్వామ్య



శక్తులన్నీ సంఘటితం కావాలని నారాయణ పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఒక్క వాగ్దానాన్ని కూడా అమలు పర్చకపోగా ప్రజలను మభ్య పెడుతున్నాయని విమర్శించారు. రాష్ట్ర విభజన జరిగి నాలుగేళ్లు కావస్తున్నా విభజన అంశాల్లో ఒక్కటి కూడా సక్రమంగా అమలు చేయలేదన్నారు. అయినప్పటికీ చంద్రబాబు ప్రధాని మోడీని నిలదీయడానికి జంకుతున్నారని, పైగా సుప్రీంకోర్టులో పోరాడతానని చెప్పడం ప్రజల్ని మోసగించడమేనన్నారు. ఒకవైపు విభజన అంశాలను గాలి కొదిలేసి, మరోవైపు రాష్ట్ర ప్రజలకు అరచేతిలో వైకుం ఠం చూపుతున్నారని విమర్శించారు. నాలుగేళ్ళలో చంద్ర బాబు ఒక్క అభివృద్ధి పనైనా చేశారా? అని ప్రశ్నించారు. అవినీతి మాత్రం తారాస్థాయికి చేరిందని, చిన్న ఉద్యోగిని పట్టుకున్నా వందల కోట్లలో డబ్బు వెలుగుచూస్తోందన్నారు. కేవలం ఒక్క ఏడాదిలోనే 2,500 కోట్లు ఏసీబీ దాడుల్లో బైటపడడం ఇందుకు నిదర్శనమన్నారు. ఈనేపథ్యంలో రాష్ట్ర రాజకీయాల్లో మార్పులు రావాలని ఆయన ఆకాంక్షించారు. వామపక్ష, ప్రజాతంత్ర శక్తులన్నీ ఏకమై అవినీతి, ధన రాజకీయాలకు అడ్డుకోవాల్సిన అవసరం వుందని పిలుపునిచ్చారు. కృష్ణాజిల్లా సీపీఐ కార్యదర్శివర్గసభ్యులు జరబన నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈసభలో రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు జల్లి విల్సన్, జిల్లా, నగర కార్యదర్శులు అక్కినేని వనజ, దోనేపూడి శంకర్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు చలసాని వెంకట రామారావు, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధానకార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని, జిల్లా సహాయకార్యదర్శులు సీహెచ్ కోటేశ్వరరావు, నార్ల వెంకటేశ్వరరావు, కార్యదర్శివర్గసభ్యులు మోదుమూడి రామారావు, తూము కృష్ణయ్య, నగర సహాయకార్యదర్శులు జి. కోటేశ్వరరావు, చలసాని అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పలువురు ఐపీఎస్‌లకు పదోన్నతులు

విశాలాంధ్రబ్యూరో - అమరావతి: రాష్ట్ర క్యాడర్‌కు చెందిన పలువురు ఐపీఎస్ అధికారులకు పదోన్నతులు లభించాయి. 2000 సంవత్సరం ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఐదుగురు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డీఐజీ)లకు సూపర్ టైమ్ స్కేల్‌ను వర్తింప చేస్తూ ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ)గా పదోన్నతి కల్పించారు. అలాగే 2004 ఐపీఎస్ బ్యాచ్‌కి చెందిన ఇద్దరు ఎస్పీలకు డీఐజీలుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. డీఐజీ హోదాలో కేంద్ర సర్వీసుల్లో ఉన్న మనీష్ కుమార్ సిన్హా, సౌత్ కోస్టల్ జోన్ డీఐజీ కేవీవీ గోపాలరావు, విజయవాడ జాయింట్ సీపీ బీవీ రమణకుమార్, ఏసీబీ అదనపు డైరెక్టర్ పీ హరికుమార్‌కు ఐజీగా పదోన్నతి లభించింది. పదోన్నతి పొందిన వారికి ప్రస్తుత స్థానాల్లోనే పోస్టింగ్స్ ఇచ్చారు. ఎస్పీస్థాయిలో కోస్టల్ సెక్యూరిటీ ఎస్పీగా ఉన్న డాక్టర్ నవీన్ గులాటీ, విజయవాడ డీసీపీ కాంతి రాణా టాటాకు డీఐజీలుగా పదోన్నతి కల్పించారు. పదోన్నతి పొందిన వీరిని తిరిగి పాత స్థానాల్లోనే ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది.

ఎస్సీ,ఎస్టీ,బీసీ అసిస్టెంట్ వెల్ఫేర్ ఆఫీసర్ల రాత పరీక్ష రివైజ్డు కీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని ఎస్సీ,ఎస్టీ, బీసీ అసిస్టెంట్ వెల్ఫేర్ ఆఫీసర్ల రాత పరీక్ష రివైజ్డు కీను సోమవారం ఆంధ్రప్రదేశ్ ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) వెల్లడించింది.నోటిఫికేషన్ నంబరు 34/2016లో భాగంగా అర్హులైన అభ్యర్థులకు కమిషన్ రాత పరీక్ష నిర్వహించింది.ఇందులో నెలకొన్న పలు ప్రశ్నల సమాధానాలపై అభ్యంతరాలు తెలపడంతో రివైజ్డ్ కీను ఏపీపీఎస్సీ వెబ్‌సైట్('పీఎస్‌సి.ఏపీ.గొవ్.ఇన్')లో పొందుపర్చారు.

'అమ్మ'కు విద్యార్థుల వందనం



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 'అమ్మకు వందనం' కార్యక్రమాన్ని సోమ వారం నిర్వహించారు. పాఠశాలల ఆవరణలో విద్యార్థులతో వారి తల్లుల పాదాలకు సామూహికంగా వందనం చేయించారు.ఈ సంద ర్భంగా తల్లి గొప్పతనం, త్యాగాన్ని విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు.తల్లికి వందనం నిర్వహణ కోసం ప్రభుత్వ పాఠశాల ఖాతాలో రూ.2500 చొప్పున జమచేశారు.13 జిల్లాల డీఈవోల పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

డార్విన్ సిద్ధాంతంపై దాడి చేసేది మతవాదులే

- సిద్ధాంతం ఆధారంగానే ఎందరికో నోబెల్ బహుమతులు
- కేంద్ర మంత్రి సత్యపాల్ సింగ్ పశ్చాత్తాప పడాల్సిందే
- ఆలిండియా ప్రోగ్రెసివ్ ఫోరమ్ అధ్యక్షుడు ప్రొ. చలం

విశాలాంధ్రబ్యూరో-అమరావతి : మనిషి పరిణామాలను వివరించే ఛార్లెస్ డార్విన్ సిద్ధాంతంపై మతవాదులే దాడికి పాల్పడుతున్నారని ఆలిండియా ప్రోగ్రెసివ్ ఫోరం అధ్యక్షుడు, ద్రవిడ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్, యూపీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ కె.ఎస్.చలం వ్యాఖ్యానించారు. దేవుడికి దశావతారాలు ఉన్నాయనే నమ్మే వారు, డార్విన్ సిద్ధాంతం ప్రకారం మనిషి పరిణామాలను ఎందుకు విశ్వసించరని ఆయన ప్రశ్నించారు. డార్విన్ సిద్ధాంతం ఆధారంగా ప్రపంచ వ్యాప్తంగా అనేక పరిశోధనలు జరిగాయన్నారు. కేంద్ర మంత్రి సత్యపాల్ సింగ్ డార్విన్ సిద్ధాంతం తప్పు అనటంపై ప్రొఫెసర్ చలం ఆక్షేపణ వ్యక్తం చేశారు. ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు విజయవాడ వచ్చిన ఆయన సోమవారం 'విశాలాంధ్ర'తో మాట్లాడుతూ అనేక పరిశోధనలకు మూలమైన డార్విన్ సిద్ధాంతాన్నే తప్పుపడితే ఎఫ్‌డీఐల మాదిరిగా శాస్త్రవేత్తలను కూడా దేశం దిగుమతి చేసుకోవాల్సి వస్తుందని చెప్పారు. కేంద్ర మంత్రి సత్యపాల్ సింగ్ భవిష్యత్ అభివృద్ధిని పరిగణనలోకి తీసుకోకుండా వ్యవహరించటం వల్ల శాస్త్రీయ ఆలోచనలకు యువతను దూరం చేస్తుందన్నారు. 200 ఏళ్ల క్రితం ఆవిష్కరించిన సిద్ధాంతం ఆధారంగానే అనేక మంది పరిశోధనలు చేసి నోబెల్ బహుమతులను సాధించారని, సత్యపాల్ ప్రకటన ప్రకారం నోబెల్ బహుమతి గ్రహీతల పరిశోధనలు కూడా తప్పుగా భావించాల్సి వస్తుందన్నారు. కొన్ని సంవత్సరాల క్రితం కోపర్నికస్‌పై జరిగిన దాడిపై వాటికన్ సిటీ పోప్ ఇటీవల పశ్చాత్తాపాన్ని ప్రకటించారని, డార్విన్ సిద్ధాంతం తప్పు అన్న సత్యపాల్ సింగ్ కూడా అదే మాదిరిగా పశ్చాత్తాప

నెలాఖరులోగా ఆర్థికేతర విజ్ఞప్తులన్నీ పరిష్కరించాలి

సీఎస్ ఆదేశం

విశాలాంధ్ర-అమరావతి : ప్రజల నుండి వచ్చిన విజ్ఞాపనలు, అర్జీలలో ఆర్థికేతర అంశాలకు సంబంధించిన అర్జీలన్నింటినీ జనవరి నెలాఖరులోగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులకు స్పష్టం చేశారు. సోమవారం వెలగపూడి సచివాలయంలోని ఆయన కార్యాలయంలో గ్రీవెన్స్ ఫిర్యాదుల పరిష్కారంపై సమీక్షించారు. జన్మభూమి, జన్మభూమికి ముందు ప్రజల నుండి వచ్చిన అర్జీలను, ఆర్థిక, ఆర్థికేతరమైన వాటిగా విభజించి ఆర్థికేతరమైన విజ్ఞాపనలన్నింటినీ నెలాఖరులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి వెంటనే జిల్లా కలెక్టర్లు, ఆయా శాఖాధిపతులకు డిఓ లేఖ వ్రాయాలని సంబంధిత అధికారులను సీఎస్ కోరారు. వ్యక్తిగత అవసరాల విజ్ఞాపనలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సామాజికపరమైన విజ్ఞాప నలు, ఫిర్యాదులను కూడా వాటి ఆవశ్యకతను బట్టి మూడు కేటగిరీలుగా విభజించి ప్రాధాన్యతా క్రమంలో వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత, సామాజికపరమైన అంశాలకు సంబంధించిన ఆర్థికపరమైన విజ్ఞాపనలను జిల్లా, శాఖల వారీగా విభజించి వాటి పరిష్కారానికి ఎంత మొత్తం నిధులు అవసరం ఉంటుందో నివేదిక సిద్ధం చేయాలన్నారు. గ్రీవెన్స్ ఫిర్యాదుల పరిష్కారంపై తాను ఎప్పటికప్పుడు సమీక్షించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రణాళిక శాఖ ప్రత్యేక కార్యదర్శి పి.వి. చలపతిరావు, ప్రణాళికా శాఖ సంచాలకులు గోపాల్, రియల్ టైమ్ గవర్నెన్స్ డైరెక్టర్ ఎ.బాలాజి తదితరులు పాల్గొన్నారు.



యువతకు కృష్ణారావు స్ఫూర్తి

సీనియర్ సంపాదకుడు టంకశాల అశోక్

చల్లపల్లి : నమ్మిన విలువల కోసం కడవరకూ జీవించిన ఉద్యమ నాయకుడు వడ్లమూడి కృష్ణారావును యువత స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని వక్తలు పిలుపునిచ్చారు. ప్రముఖ కమ్యూనిస్టు, సంఘసేవకుడు, పరిటాల శ్రీరాములు అల్లుడు వడ్లమూడి కృష్ణారావు స్మారకోపన్యాసం చల్లపల్లి చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో సోమవారం ఉదయం జరిగింది. దివిసీమ (తూర్పు లంకపల్లి)కి చెందిన కృష్ణారావు విద్యార్థి దశలోనే అనంతపురం ఉద్యమంలోకి అడుగుపెట్టి పరిటాల శ్రీరాములు సహచరునిగా ప్రజాపక్షాన పోరాటం చేశారు. 2016 ఏప్రిల్ 8 న ఆయన మరణించారు. వడ్లమూడి కృష్ణారావు స్మారక సమితి ఆధ్వర్యంలో జరిగిన స్మారకోపన్యాసంలో ప్రముఖ రచయిత, సీనియర్ సంపాదకులు టంకశాల అశోక్ ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు. దేశంలో పేదరికం, అస్థిత్వ సమస్యలపై పోరాటమొక్కటే చాలదనీ, మతసామరస్యం కోసం

ఉద్యమించాలన్నారు. లౌకిక, వామపక్షవాదులు ఆలోచన చేయగలిగితే పరిష్కారం లభిస్తుందన్నారు. లౌకికత్వానికి ఆధారమనుకున్న వర్గాలనే కాపాడుకోలేని స్థితిలో రాజకీయ పార్టీలున్నాయని వాపోయారు. పేదరికం, అస్థిత్వం కంటే మతం సున్నితమైన అంశమన్నారు. ఆల్‌ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం ప్రతినిధి బుడ్డిగ జమిందార్ మాట్లాడుతూ, చదువు సమాజం కోసమని నమ్మిన మిత్రులతో కలిసి యువజన సంఘాన్ని స్థాపించి ప్రజాసమస్యలపై చర్చలు జరిపేవారనీ, ఆ కార్యకలాపాలకు ఆకర్షితుడైన పరిటాల శ్రీరాములు ఆయనను వెన్నుతట్టి ప్రోత్సహించారని గుర్తుచేశారు. శ్రీరాములు సహచరునిగా అనంతపురం జిల్లాలో విప్లవోద్యమాన్ని నిర్మించిన కృష్ణారావు రైతు, కూలీ, నిరుద్యోగుల సమస్యలపై పోరాడారని, భూపోరాటాలు చేశారని వివరించారు. కమ్యూనిస్టు ఉద్యమం కారణంగా చల్లపల్లికి ప్రపంచ పటంలో ప్రత్యేక స్థానం

ఉందని.. కృష్ణారావుకూ అందులో చోటుందన్నారు. ఎమర్జెన్సీ సమయంలో కృష్ణారావును ఎన్‌కౌంటర్ చేయాలని చూస్తే కోర్టు ద్వారా కాపాడుకోగలిగారని గుర్తుచేశారు. పరిటాల రవీంద్ర, సునీతలకు మంచి సలహాలను అందిస్తూ చేదోడువాదోడుగా ఉండేవారన్నారు. రచయిత ఖాదర్ మొహియుద్దీన్ నిర్వహణలో జరిగిన సభలో కృష్ణారావు సోదరుడు రంగారావు, అరుణోదయ రామారావు, విశ్వేశ్వరరావు, ఎస్‌ఎ. రవూఫ్ మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధి ఖాషాలు ప్రసంగించారు. కృష్ణారావు కుమారుడు శ్రీహర్ష, పరిటాల మహీంద్ర, పరిటాల రవి సోదరీమణులు, బంధువులు, స్థానిక కమ్యూనిస్టు పార్టీ నేతలు మల్లుపెద్ది రామసుబ్బయ్య పరుచూరి శ్రీనివాసరావు, హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, వెనిగళ్ల వసంతరావు, స్వచ్ఛ చల్లపల్లి సారథి డాక్టర్ డీఆంకే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివితాలూకాలోని సీనియర్ వామపక్ష పార్టీల నేతలను ఘనంగా సత్కరించారు.

'బెల్ట్' షాపులుంటే జైలుకే

- రూ. 1.29 కోట్ల గంజాయి పంట ధ్వంసం
- సొంత భవనాల నిర్మాణానికి రూ. 200 కోట్లు
- ఆరోపణలపై నిజానిజాలు తేలితేనే సస్పెన్షన్‌లు
- ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ల సంఘం డైరీ ఆవిష్కరణలో మంత్రి జవహర్

విశాలాంధ్రబ్యూరో-అమరావతి : రాష్ట్రంలో బెల్ట్ షాపుల నిర్వాహకుల్లో టీడీపీ వారున్నా ఉపేక్షించేది లేదని, అరెస్టు చేసి జైలుకు పంపిస్తామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి కె.ఎస్.జవహర్‌రెడ్డి స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో బెల్ట్ షాపులను (అనధికార మద్యం దుకాణాలు) నూరు శాతం లేకుండా చేయాలనేదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. గంజాయి సాగు, అక్రమ రవాణాను ప్రభుత్వం ఛాలెంజ్‌గా తీసుకుందని, రూ.1.29 కోట్ల విలువైన గంజాయి పంటను ధ్వంసం చేశామన్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ల అసోసియేషన్ డైరీ, క్యాలెండర్‌ను మంత్రి జవహర్ విజయవాడలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ బెల్ట్ షాపులను 95 శాతం నిర్మూలించామని, ఇంకా అక్కడక్కడా అక్రమ అమ్మకాలు సాగుతున్నట్లు తమ దృష్టికి వస్తోందన్నారు. తన సొంత నియోజకవర్గం కొవ్వూరులోనూ బెల్ట్ షాపులపై దాడి చేయించినట్లు చెప్పారు. బెల్ట్ షాపుల నిర్వాహకుల్లో ఎంతటివారున్న కఠినంగా వ్యవహరిస్తామని, చివరకు టీడీపీ నాయకులు, కార్యకర్తలున్నా అరెస్టు చేసి జైలుకు పంపించాలని అధికారులకు ఆదేశాలిచ్చామని చెప్పారు. గంజాయి సాగు, అక్రమ రవాణా, కల్తీ మద్యం తయారీ, అమ్మకందారులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. గుంటూరు జిల్లా రేపల్లెలో కల్తీ మద్యంపై సమగ్ర విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. ఇదిలావుండగా, 2018-19 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలోని అన్ని ఎక్సైజ్ ఆఫీసులు, స్టేషన్లకు సొంత భవనాలను సమకూర్చేందుకు రూ.200 కోట్లను కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు మంత్రి చెప్పారు. కొత్త డిస్టలరీల మంజూరుకు నోటిఫికేషన్ జారీ చేశామని, ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రస్తుతం తెలంగాణా నుంచి మద్యాన్ని దిగుమతి చేసుకుంటున్నామని, అందుకే రాష్ట్రంలో మద్యం తయారీకి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎక్సైజ్ అధికారులపై సమగ్ర విచారణ చేసిన తర్వాతే సస్పెన్షన్ వేటు వేస్తామన్నారు. కొత్త సంవత్సరంలో సస్పెన్షన్‌కు గురవకుండా అధికారులు, సిబ్బంది పని చేయాలని మంత్రి సూచించారు. అధికారులు, ఉద్యోగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. ఎక్సైజ్ శాఖలో అనేక సమస్యలు ఉన్నాయని, ఇప్పటికే అసోసియేషన్ నాయకులు పలు అంశాలను తన దృష్టికి తెచ్చారని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.



విజయవాడలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి జవహర్, పక్కన కమిషనర్ లక్ష్మీ నరసింహం, ఈడీ వెంకటేశ్వరరావు, ఎన్‌జీఓ సంఘం నేతలు అశోక్‌బాబు, చంద్రశేఖర్‌రెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహులు తదితరులు

జిల్లాల్లో ఎక్సైజ్ కాంప్లెక్స్‌లు : కమిషనర్

కొత్త సంవత్సరంలో ఎక్సైజ్ శాఖ అన్ని జిల్లాల్లో ఎక్సైజ్ కాంప్లెక్స్‌లు, సొంత స్టేషన్ భవనాలను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఎక్సైజ్ కమిషనర్ డాక్టర్ పి.లక్ష్మీ నరసింహం చెప్పారు. రాష్ట్రానికి పెద్ద మొత్తంలో ఆదాయాన్ని సమకూరుస్తున్న తమ శాఖకు ఇప్పటికీ అద్దె భవనాల్లో ఉండటం వల్ల నిర్వహణా భారం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే జిల్లాల్లో కలెక్టర్లతో చర్చించి కాంప్లెక్స్‌లు, స్టేషన్ల నిర్మాణానికి అనువైన స్థలాలను పరిశీలించాలని అధికారు లకు సూచించారు. మద్యం నిల్వ కోసం గోదాములు కూడా లేవని, ప్రతి నెలా రూ.5 లక్షలు అద్దె చెల్లించాల్సిన పరిస్థితి ఉందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 25 డిస్టలరీలతోపాటు కొత్తగా మంజూరు చేయనున్న మరో ఏడింటికీ సొంత భవనాలు నిర్మిస్తామన్నారు. స్టేషన్ల నిర్వ హణకు రూ.10వేలు మంజూరు చేయించామని, త్వరలో దానిని రూ.30వేలకు పెంచేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

ఏసీబీ దాడులతో నిలిచిన పదోన్నతులు

అసోసి యేషన్ అధ్యక్షుడు

గతంలో ఎక్సైజ్ అధికారులపై రాజకీయ కారణాలతో ఏసీబీ చేసిన దాడుల ఫలితంగా అనేక మంది నేడు పదోన్నతులకు నోచుకోవటం లేదని ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.నరసింహులు ఆందోళన వ్యక్తం చేశారు. ఐదారేళ్లుగా పదోన్నతుల ఫైల్‌కు మోక్షం లభించటంలేదన్నారు. తెలంగాణా ప్రభుత్వం పదోన్నతులు ఇస్తున్నందున, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉద్యోగుల విషయంలో సానుకూలంగా వ్యవహరించాలని ఆయన కోరారు. పదోన్నతులకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, న్యాయనిపుణుల అభిప్రాయం కోసం ఫైల్‌ను ఏజీకి పంపించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కె.వెంకటేశ్వరరావు, జాయింట్ కమిషనర్ (డిస్టిలరీస్) డాక్టర్ ఎం.దేవకుమార్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.వెంకటరమణ, ఏపీఎన్‌జీఓ సంఘం అధ్యక్షుడు పి.అశోక్‌బాబు, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఎక్సైజ్ ఓఎస్‌డీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల కాంట్రాక్టు లెక్చరర్ల విధుల పొడిగింపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న 722 మంది కాంట్రాక్టు డిగ్రీ లెక్చరర్ల విధుల్ని మార్చి 2018 వరకూ ప్రభుత్వం పొడిగించింది.ఈ మేరకు రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదిత్యనాథ్ దాస్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 722 మంది కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారు. వారందరినీ జూన్ 2017 నుంచి మార్చి 2018 వరకూ పొడిగించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ఆధారంగా మరో 3 నెలలపాటు కాంట్రాక్టు లెక్చరర్లు వారి విధుల్లో కొనసాగుతారు.

కేంద్రంపై ఒత్తిడి తీసుకురండి

న్యూఢిల్లీ- విశాలాంధ్ర బ్యూరో : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన సమస్యల విషయంలో కేంద్రంపై వత్తిడి తీసుకురావాలని కాంగ్రెస్ పార్టీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు డిమాండు చేశారు. ఈ మేరకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కేవీపీ ఒక లేఖ రాశారు. సోమవారం న్యూఢిల్లీలోని ఆయన నివాసంలో ఎంపీ కేవీపీ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఏపీ సీఎంకు రాసిన లేఖను విడుదల చేశారు. విభజన హామీలను అమలు చేయటంలో కేంద్రం తీవ్రంగా విఫలమైందని, ఏపీ సర్కారు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి దీనిపై చర్చించటంతో పాటు అన్ని పార్టీల నేతలను కేంద్రం వద్ద తీసుకువెళ్లి చర్చలు జరపాలని డిమాండు చేశారు. ఏపీలోని అన్ని రాజకీయ పార్టీలు కూడా ఈ విషయంలో సీఎం చంద్రబాబు నాయుడుకు సహకరించటానికి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. కానీ ఏపీ ప్రజలను మోసం చేయాలనుకుంటే మాత్రం చరిత్ర హీనులవుతారని హెచ్చరించారు. విభజన జరిగి నాలుగేళ్ళు గడుస్తున్నప్పటికీ ఇప్పుడు విభజన హామీలపై కోర్టుకు వెళతానని చంద్రబాబు చేస్తున్న వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. విభజన హామీలపై నాలుగేళ్లు మీరు ఏం చేశారంటూ ప్రశ్నించారు. విభజన అశాస్త్రీయంగా జరిగిందని చంద్రబాబు ఇప్పుడే కనిపెట్టారా అంటూ విమర్శలు గుప్పించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని కూడా విభజన చట్టానికి వ్యతిరేకంగా ఏపీ సర్కారు తన చేతిలోకి తీసుకుందన్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కారుపై చంద్రబాబు చేస్తున్న విమర్శలు పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. బీజేపీతో కలిసి 2019 ఎన్నికలకు వెళితే రాష్ట్రంలో అధికారానికి దూరం అవుతామేమో అనే అనుమానంతోనే సీఎం ఇప్పుడు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని కేవీపీ విమర్శలు గుప్పించారు. విభజన హామీలు అమలు చేయని నేరాన్ని బీజేపీపై తోసేసి తనకేమీ తెలియని విధంగా వ్యవహరించటం సరికాదని హితవు పలికారు. హామీల అమలులో జరిగిన నష్టాన్ని చంద్రబాబుగానీ, ఆయన పార్టీగానీ, బీజేపీగానీ పూడ్చలేదన్నారు. ఇకనైనా చంద్రబాబు మేల్కొంటే మంచిదని, లేదంటే ప్రజలే తగిన విధంగా గుణపాఠం

కుంబ్లేతో శాస్త్రికి పోలిక లేదు

సీఓఏ మాజీ సభ్యుడు రామచంద్ర గుహ



న్యూఢిల్లీ: బీసీసీఐ అధికారులు, సెలక్టర్లు, కోచింగ్ సిబ్బంది భారత క్రికెట్ జట్టు సారథి విరాట్ కోహ్లి ముందు మోకరిల్లుతున్నారని విమర్శంచిన బోర్డు పాలకుల కమిటీ మాజీ సభ్యుడు రామచంద్ర గుహ తాజాగా కోహ్లి ఒత్తిడి మేరకే రవిశాస్త్రిని కోచ్‌గా ఎంపిక చేశారన్నారు. తాజాగా ఓ వ్యాసంలో ఆయన బోర్డు అధికారులకు పలు ప్రశ్నలు సంధిస్తూ రవిశాస్త్రి ఎంపికను ఎండగట్టారు. 'భారత క్రికెట్ జట్టు విజయాల్లో కీలకపాత్ర లేని, కోచింగ్‌లో ఏమాత్రం అనుభవం లేని రవిశాస్త్రిని భారత జట్టు ప్రధాన కోచ్‌గా ఎంపిక చేయడానికి ప్రధాన కారణం సారథి విరాట్ కోహ్లినే. శాస్త్రినే కోచ్‌గా తీసుకోవాలని కోహ్లి నుంచి బీసీసీఐకు తీవ్ర ఒత్తిడి వచ్చింది. ఈ ఒత్తిడికి తలొగ్గి రవిశాస్త్రిని ఎన్నుకున్నారు. మాజీ కోచ్ అనిల్ కుంబ్లేకు శాస్త్రి ఏ విషయంలోనూ పోటీ ఇవ్వలేదు. కుంబ్లే జట్టు విజయాల కోసం ఒంటరిగా పోరాడిన సందర్భాలున్నాయి. అతని కారణంగా భారత జట్టు మరపురాని విజయాలు సాధించిన సంగతి తెలిసిందే. అలాంటి ఆటగాడిని కాదని కోచ్‌గా ఏమాత్రం అనుభవం లేని శాస్త్రికి పట్టంకట్టాం. కోచ్ పదవి కోసం ఆసీస్ మాజీ ఆటగాడు టామ్ మూడీ కూడా దరఖాస్తు చేసుకున్నాడు. అతనికి కోచ్‌గా చాలా అనుభవం ఉంది. అతన్ని సైతం కాదని రవిశాస్త్రినే ఎంచుకోవడానికి కారణం ఏమిటి?. బీసీసీఐ క్రికెట్ సెలక్షన్ కమిటీపై కోహ్లి తీసుకువచ్చిన ఒత్తిడే. స్వదేశంలో బలహీన జట్లతో భారత్ ఆడినప్పుడు ఈ తప్పుడు నిర్ణయం తాలుకు ప్రభావం కనిపించలేదు' అని గుహ ఓ వ్యాసంలో పేర్కొ న్నారు. ప్రస్తుత దక్షిణాఫ్రికా సిరీస్ గురించి మాట్లాడుతూ.. 'జట్టులో ఎవరు ఆడినా ఆడకపోయినా, శ్రీలంకతో ఆడటం మాని రెండు వారాల ముందు మన జట్టు సఫారీ గడ్డపై అడుగుపెట్టి ఉంటే ఫలితాలు వేరుగా ఉండేవి' అని గుహ తెలిపారు.

ఫెదరర్ ఘనత



సిడ్నీ: ప్రతిష్టాత్మక ఆస్ట్రేలియన్ ఓపెన్-2018లో ప్రపంచ మాజీ నంబర్ వన్, స్విస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ అరుదైన ఘనతను అందుకున్నాడు. టోర్నీలో భాగంగా ప్రిక్వార్టర్స్‌లో జరిగిన మ్యాచ్‌లో విజయం సాధించిన ఫెదరర్ తుది ఎనిమిదిమందిలో చోటు దక్కించుకున్నాడు. దీంతో 1977 తర్వాత ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వార్టర్స్ చేరుకున్న పెద్ద వయస్కుడిగా ఫెదరర్ నిలిచాడు. ప్రస్తుతం ఫెదరర్ వయసు 36ఏళ్లు. 1977లో ఆస్ట్రేలియాకు చెందిన కెన్ రోస్‌వాల్ తర్వాత క్వార్టర్ ఫైనల్ చేరుకున్న పెద్ద వయస్కుడు ఫెదరరే కావడం విశేషం. ప్రిక్వార్టర్స్‌లో భాగంగా ఫెదరర్.. హంగేరీ ఆటగాడు మార్టన్ ఫసోవిక్స్‌పై 6-4, 7-6, 6-2 తేడాతో విజయం సాధించాడు. క్వార్టర్స్‌లో రెండో సీడ్ ఫెదరర్ 19వ ర్యాంకు ఆటగాడు టోమస్ బోర్డిచ్(చెక్ రిపబ్లిక్)తో తలపడనున్నాడు. ఫెదరర్ టైటిల్ ఫేవరేట్లలో ఒకడిగా దూసుకుపోతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్ కూడా క్వార్టర్స్ చేరుకున్నాడు. ఈ టోర్నీలో నాదల్ క్వార్టర్స్ చేరుకోవడం ఇది పదోసారి. నాదల్-ఫెదరర్ పోరు కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఆస్ట్రేలియా ఓపెన్‌లో సంచలనం



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఓపెన్‌లో దక్షిణ కొరియాకు చెందిన అన్‌సీడెడ్ ఆటగాడు చుంగ్ హెయన్ సోమవారం సంచలన విజయం సాధించాడు. హోరాహోరీగా జరిగిన మూడు సెట్ల మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ జకోవిచ్‌కు షాకిచ్చాడు చుంగ్. 7-6, 7-5, 7-6 తేడాతో జకోవిచ్‌ను మట్టికరిపించాడు. దీంతో దక్షిణ కొరియా నుంచి ఓ గ్రాండ్‌స్లామ్‌లో క్వార్టర్ ఫైనల్‌కు చేరిన తొలి ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు చుంగ్. మ్యాచ్ మొత్తంలో 19 అనవసర తప్పిదాలు చేసిన జకో భారీ మూల్యం చెల్లించుకున్నాడు. జకో సర్వీసులను చుంగ్ రెండుసార్లు బ్రేక్ చేయగా.. ఒక్కసారి మాత్రమే చుంగ్ సర్వీసును జకో బ్రేక్ చేశాడు. ఈ ఓటమితో సెర్బియా స్టార్ జకోవిచ్ టోర్నీ నుంచి నిష్క్రమించాడు. జకోవిచ్ కొంతకాలంగా గాయంతో బాధపడుతున్న విషయం తెలిసిందే.

సత్తా చాటిన రైనా

59 బంతుల్లో 126



కోల్‌కతా: టీమిండియా ఒకప్పటి డార్క్‌హార్స్ సురేశ్ రైనా మరోసారి సత్తా చాటాడు. పొట్టి క్రికెట్‌లో అత్యధిక వ్యక్తిగత పరుగులు సాధించిన భారత రెండో ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లోనే అత్యధిక పరుగులతో నిలకడకు మారుపేరైన రైనా రెండేళ్లుగా భారత జట్టుకు దూరంగా ఉన్నాడు. వ్యక్తిగత, ఫిట్‌నెస్ కారణాలతో కోహ్లిసేనకు దూరమయ్యాడు. చాన్నాళ్ల తర్వాత సోమవారం మునుపటిలా ఆడి 59 బంతుల్లోనే 126 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ప్రస్తుతం జరుగుతున్న సయ్యద్ ముస్తాక్ అలీ దేశవాళీ టీ20 టోర్నీలో సురేశ్ రైనా ఆకలిగొన్న బెబ్బులిలా విరుచుకుపడ్డాడు. ఐపీఎల్ కొత్త సీజన్‌కు ముందు 59 బంతుల్లోనే 127 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అతడి ఖాతాలో 13 బౌండరీలు, 7 సిక్సర్లు ఉన్నాయి. స్ట్రైక్‌రేట్ 213.56. బెంగాల్‌తో జరిగిన మ్యాచ్‌లో ఉత్తర్ ప్రదేశ్ సారథైన రైనా ఈ అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. చెన్నై సూపర్ కింగ్స్ తరపున మురళీ విజయ్ (127) రాజస్థాన్ రాయల్స్‌పై 2010 చేసిన రికార్డు అనంతరం అత్యధిక పరుగులు చేసింది రైనానే కావడం విశేషం.

కోహ్లి గొప్ప బ్యాట్స్‌మన్ కాదు : హోల్డింగ్



ముంబై: టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లిపై వెస్టిండీస్ దిగ్గజం మైకెల్ హోల్డింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కోహ్లి గొప్ప బ్యాట్స్‌మన్ కానే కాదని.. ఒకవేళ అది నిరూపించుకోవాలంటే తన ముందున్న ఛాలెంజ్‌ను కోహ్లి అధిగమించాలని హోల్డింగ్ సూచిస్తున్నాడు. "మూడు ఫార్మట్‌లలో కోహ్లి అద్భుతమైన ఆటగాడని అంతా ప్రశంసిస్తుంటారు. కానీ, అది నిరూపించుకోవాలంటే ఇంగ్లండ్ గడ్డపై అతను పరుగులు సాధించాల్సి ఉంటుంది. సౌతాఫ్రికాతో టెస్ట్ సిరీస్ కోల్పోయినప్పటికీ.. సెంచూరియన్‌లో 153 పరుగులు ఇన్నింగ్స్‌తో కోహ్లి ఆకట్టుకున్నాడు. అయితే గతంలో 2014 ఇంగ్లాండ్ సిరీస్ సందర్భంగా కోహ్లి మొత్తంగా విఫలం అయ్యాడు. 10 ఇన్నింగ్స్‌ల్లో మొత్తంగా అతను సాధించిన సగటు కేవలం కేవలం 13.4 మాత్రమే. ఇన్నేళ్లకు కోహ్లికి మళ్లీ అవకాశం దక్కింది. తానేంటో నిరూపించుకోవాలి" అని హోల్డింగ్ తెలిపారు. కోహ్లి మంచి ఆటగాడని మాత్రమే తానూ ఒప్పుకుంటానని.. ఇంగ్లండ్‌పై రాణిస్తే అతన్ని గొప్ప బ్యాట్సమన్‌గా అంగీకరిస్తానని హోల్డింగ్ తేల్చి చెప్పాడు. అదే సమయంలో ఒకవేళ ప్రపంచంలో అత్యుత్తమ బ్యాట్స్‌మన్‌కు జాబితాను తయారు చేస్తే కోహ్లితోపాటు, జోయ్ రూట్, స్టీవ్ స్మిత్ పేర్లను తాను ప్రతిపాదిస్తానని ఈ 63 ఏళ్ల కరేబియన్ బౌలింగ్ దిగ్గజం చెబుతున్నారు. జూలైలో ఇంగ్లండ్ టూర్‌కి వెళ్లనున్న టీమిండియా జట్టు అక్కడ 5 టెస్ట్ మ్యాచ్‌లు ఆడనుంది.

వారిలా మేం తప్పు చేయం : హర్మన్‌ప్రీత్



ముంబై: కోహ్లిసేనలా తప్పులను తాము చేయబోమని.. ప్రాక్టీస్ మ్యాచులు ఆడతామని చెబుతున్నారు భారత మహిళల జట్టు సభ్యులు. త్వరలో మిథాలీ రాజ్ సారథ్యంలోని భారత జట్టు సఫారీ పర్యటనకు వెళ్లనుంది. ఫిబ్రవరి 5 నుంచి ఇరు జట్ల మధ్య 3 వన్డేల సిరీస్ ప్రారంభంకానుంది. ఇందుకోసం ఇప్పటికే ముంబైలోని అకాడమీలో కసరత్తులు మొదలెట్టేశారు. తాజాగా భారత జట్టు వైస్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మాట్లాడుతూ..'సఫారీ గడ్డపై వీలైనంత త్వరగా అడుగుపెట్టాలని చూస్తున్నాం. ఎందుకంటే అక్కడి పరిస్థితులకు అలవాటు పడాలి కదా. ఆతిథ్య జట్టుతో వన్డే సిరీస్‌కు ముందు రెండు ప్రాక్టీస్ మ్యాచులు ఆడుతున్నాం. కోహ్లిసేనను చూసే ముందు వెళ్లాలని నిర్ణయించుకున్నాం. వారు పర్యటనకు ముందు సొంతగడ్డపై చాలా క్రికెట్ ఆడారు. అవసరమైన విశ్రాంతి లేకుండా విదేశీ పర్యటనకు వెళ్లారు. అక్కడి పరిస్థితులకు అలవాటు పడటం అంత సులువు కాదు' అని హర్మన్ తెలిపింది. అందుకే ఇప్పుడు ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఆడాలనుకుంటున్నాం. అప్పుడే పూర్తిస్థాయిలో సన్నద్ధమైనట్లు' అని తెలిపింది.



శ్రమజీవుల పత్రిక విశాలాంధ్ర

విశాలాంధ్ర - మహానంది(కర్నూలు): శ్రమజీవుల హక్కుల సాధనకు కృషి చేసేది వామపక్షాలేనని, ఆ భావాలున్న, ఆ భావజాలం నుంచి ఆవిర్భవించిన విశాలాంధ్ర దినపత్రిక ప్రజా సమస్యలను పాలకుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కారానికి కృషి చేస్తోందనీ, అందుకే ఆ పత్రిక పాఠకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందని మహానంది దేవస్థానం ఈవో సుబ్రహ్మణ్యం శ్లాఘించారు. సోమవారం మహానందిలో జరిగిన విశాలాంధ్ర బ్యూరో ఇన్‌చార్జిల రాష్ట్రస్థాయి సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విశాలాంధ్ర సంపాదకులు ముత్యాల ప్రసాద్, జనరల్ మేనేజర్ హరినాథరెడ్డి, ఏజీఎం మదన్, న్యూస్ ఎడిటర్ చంద్రశేఖర్, నెట్‌వర్క్ ఇన్‌చార్జి కోటేశ్వరరావు, 13 జిల్లాలకు చెందిన బ్యూరో ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

కోడి పందేలపై హైకోర్టు సీరియస్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలను నిలువరించకపోవడంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇందుకు సంబంధించి ఈ నెల 29న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలని ఆదేశాలు జారీ చేసింది. కోడి పందేలను ఆపాలని, పందేలు జరపడానికి వీలులేదని పదే పేద చెప్పినప్పటికీ నిరోధించేందుకు ఎందుకు గట్టి చర్యలు తీసుకోలేదని నిలదీసింది. ఆదేశాలు ఇస్తే వాటిని బేఖాతరు చేస్తారా అని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కోడి పందేలను నిర్వహించరాదని, ఎక్కడికక్కడ వాటిని నిరోధించాలని, దీనికి సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, పోలీసు అధికారులకు రెండు సంవత్సరాలుగా హైకోర్టు స్పష్టం చేస్తూనే ఉంది. ఈ ఏడాది కూడా ఇదే ఆదేశాలను ఇచ్చింది. అయితే కొందరు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. సుప్రీం కోర్టు కూడా హైకోర్టు తీర్పును సమర్థించింది. సంక్రాంతి సందర్భంగా కోనసీమలో భారీఎత్తున కోడిపందేలు నిర్వహించారు. దీనిని హైకోర్టు తీవ్రంగా పరిగణించింది.

'మీ కోసం'లో కలకలం

- పెట్రోల్ పోసుకొని రైతు ఆత్మహత్యాయత్నం
- అడ్డుకున్న అధికారులు, పోలీసులు



విశాలాంధ్ర-గుంటూరు జిల్లాపరిషత్: గుంటూరులోని జిల్లా పరిషత్ కార్యక్రమంలో సోమవారం నిర్వహించిన 'మీ కోసం'లో కలకలం చోటుచేసుకుంది. ఒక రైతు తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. శివప్రసన్నబాబు అనే రైతు తన సమస్యను పరిష్కరించాలని కోరుతూ సంయుక్త కలెక్టర్ కృతికా శుక్లాకు వినతిపత్రం అందజేసి బయటకు వస్తూ అధికారులు చుట్టూ తిరుగుతున్నా తనకు న్యాయం జరగడంలేదంటూ తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ బాటిల్ మూత తీసి మీద పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో అధికారులు గమనించి, అప్రమత్తమై అతన్ని వారించారు. పక్కనే ఉన్న కలెక్టర్ కోన శశిధర్ రైతు శివప్రసన్నబాబును పిలిచి సమస్యను సావధానంగా విన్నారు. తాను 10 ఏళ్ల నుంచి వ్యవసాయం చేస్తున్నా నని, నాలుగేళ్ల నుంచి ఏ పంట వేసినా నష్టం వచ్చి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాననీ, తనను ఆదుకోవాలని కోరాడు. ఆత్మహత్య చేసుకోవడం సమస్యకు పరి ష్కారం కాదని కలెక్టర్ వారించారు. ఉద్యాన శాఖాధికారులతో సంప్రదించి వాణిజ్య పంటలు వేసుకుని ఆర్థికంగా బలపడాలని సూచించారు. అనంతరం రైతు శివప్రసన్న బాబు మాట్లాడుతూ తాను వ్యవసాయంలో నష్టపోతున్నాను, గేదల ఫారం పెట్టుకుంటా నని ముఖ్యమంత్రి చంద్రబాబును కలిస్తే స్పందించిన ఆయన కాపు కార్పొరేషన్ ద్వారా గేదెల ఫారం పెట్టుకోవాలని, రూ.25వేలు ఆర్థిక సాయ చేయమని అధికారులను ఆదేశించారన్నాడు. ఈ విషయంపై గత 4 నెలల నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నా, వారు మాత్రం సమస్యను పట్టించుకోవడం లేదని ఆరోపించాడు. అధికారుల నిర్లక్ష్యానికి నిరసనగానే ఆత్మహత్యాయత్యానికి పాల్పడినట్లు వెల్లడించాడు.

లోయా మృతిపై అభియోగాలు తీవ్రం

- అన్ని పత్రాలను పరిశీలించాల్సి ఉంది
- పిటిషన్లంటినీ మేమే విచారిస్తాం
- ప్రస్తుతానికి సహజ మరణమే.. ఊహాగానాలొద్దు
- సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం



న్యూఢిల్లీ: సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి బీహెచ్ లోయా మృతికి సంబంధించిన ప్రజాప్రయోజన వ్యాజ్యాలలో లేవనెత్తబడిన అంశాలు తీవ్రమైనవని, వాటిన్నింటిని పరిశీలించాల్సి ఉందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. కానీ ఈ కేసులో బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా పేరును ప్రస్తావించిన సీనియర్ న్యాయవాది తీరును న్యాయస్థానం తప్పుబట్టింది. లోయా మరణానికి సంబంధించి అత్యంత తీవ్ర స్వభావం కలిగిన డాక్యుమెంట్లన్నింటినీ పరిశీలించాలని ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని న్యాయమూర్తులు ఎ.ఎం.ఖన్‌విల్కర్, డీవై చంద్రచూడ్‌లతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం నిర్ణయించింది. అలాగే బాంబే హైకోర్టుకు చెందిన నాగపూర్, ముంబై బెంచ్‌ల వద్ద పెండింగ్‌లో ఉన్న మరో రెండు పిటిషన్లను కూడా తామే విచారిస్తామని పేర్కొంటూ ఆ పిటిషన్లను సుప్రీంకోర్టుకు బదిలీ చేసింది. ఇకపై ఈ అంశంపై ప్రజాప్రయోజన వ్యాజ్యాలు (పిల్స్)ను స్వీకరించవద్దని హైకోర్టులను ఆదేశించింది. తదుపరి విచారణ వచ్చే నెల 2న జరుగుతుందని తెలిపింది. జస్టిస్ లోయా మరణానికి సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన డాక్యుమెంట్లను సుప్రీంకోర్టు పరిశీలించింది. తదుపరి విచారణ తేదీ నాటికి ఇందుకు సంబంధించిన డాక్యుమెంట్లన్నిటినీ సమర్పించాలని అన్ని పక్షాలనూ ఆదేశించింది. సొహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసును విచారిస్తున్న సమయంలో జస్టిస్ లోయా మరణించారు. అయితే ఆయన హత్యకు గురయ్యారంటూ పిటిషనర్లు ఆరోపించారు. దీంతో ఈ కేసులో స్వతంత్ర దర్యాప్తు చేపట్టాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసును విచారిస్తున్న జస్టిస్ లోయా 2014, డిసెంబరు 1వ తేదీన నాగపూర్‌లో సహోద్యోగి కుమార్తె వివాహానికి హాజరైనపుడు గుండె పోటుతో మరణించినట్లు ఆరోపణలు వచ్చాయి. విచారణ సందర్భంగా బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా పేరును ప్రస్తావిస్తూ ప్రతీది అతనిని(షా) రక్షించడానికేనంటూ బాంబే న్యాయవాదుల మండలి తరపున హాజరైన సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే ఆరోపించడంపై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. 'ప్రస్తుతానికి లోయాది సహజ మరణం. ఊహాగానాలొద్దు' అని బెంచ్ వ్యాఖానించింది. అయితే మహారాష్ట్ర ప్రభుత్వానికి చెందిన సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే ప్రతి న్యాయవాదిగా ఉన్నారు.

రాష్ట్రపతి కొంగజపం

- ఆప్ ఎమ్మెల్యేలపై వేటు దురదృష్టకరం
- పార్టీ ఫిరాయింపుదారులపై చర్యలేవీ
- బీజేపీ, మోడీ చెప్పినట్లు నడుస్తున్న కోవింద్
- సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ



మాట్లాడుతున్న నారాయణ. పక్కన రామకృష్ణ, జల్లివిల్సన్, జి.ఓబులేసు

విశాలాంధ్రబ్యూరో - అమరావతి: రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ రాజ్యాంగానికి భిన్నంగా వ్యవహరించి 20 మంది ఆప్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడాన్ని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ తీవ్రంగా ఖండించారు. బీజేపీ, దాని మిత్రపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఒకలా, విపక్షాలు అధికారంలో ఉన్నచోట మరోలా కేంద్రం వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్రపతి పైనే విమర్శలు చేయాల్సి రావడం దురదృష్టకరమన్నారు. ఆప్ ఎమ్మెల్యేల వ్యవహారం కోర్టు పరిధిలో ఉండగానే రాష్ట్రపతి అనర్హత వేటు వేయడం న్యాయవ్యవస్థను తక్కువ చేయడమేనన్నారు. విజయవాడలోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం దాసరి భవన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగపదవిలో ఉన్న కోవింద్ ప్రధాని నరేంద్ర మోడీకి కొంగజపం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో మోడీ ఉండగానే ఆప్ 67 అసెంబ్లీ స్థానాలు కైవసం చేసుకోవడంతో, ఆ ప్రభుత్వంపై కత్తి కట్టారన్నారు. పార్లమెంటరీ కార్యదర్శులుగా ఉన్నారనే నెపంతో 20 మంది ఆప్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడం శోచనీయమన్నారు. రాష్ట్రపతి వద్ద అనేక అంశాలు పెండింగ్‌లో ఉండగా, కేవలం ఢిల్లీ ఆప్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడంపై అత్యుత్సాహం చూపించారని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు మంత్రులుగా అధికార దర్పాన్ని అనుభవిస్తున్నా పట్టించుకోని ఎన్నికల సంఘం, రాష్ట్రపతి... ఆప్ ఎమ్మెల్యేలపై వెంటనే ఎలా నిర్ణయం తీసుకున్నాయని ప్రశ్నించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పార్టీ ఫిరాయింపుదారులపై ఇప్పటి వరకు చర్యలే లేకపోవడం శోచనీయమన్నారు. పార్లమెంటరీ కార్యదర్శుల హోదాలో ఉన్నప్పటికీ జీతాలు తీసుకోవడం లేదని ఎమ్మెల్యేలు వివరణ ఇచ్చినా దానిని పరిగణనలోకి తీసుకోలేదని చెప్పారు.

అన్ని వ్యవస్థల్లోనూ మోడీ జోక్యం

అన్ని వ్యవస్థల్లోనూ మోడీ జోక్యం మితిమీరుతోందని విమర్శించారు. హిందూత్వ, బీజేపీ, మోడీని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు నారాయణ తెలిపారు. దేశంలో న్యాయవ్యవస్థ పూర్తిగా సంక్షోభంలో పడిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) మిశ్రాపై నలుగురు సీనియర్ న్యాయమూర్తులు తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారన్నారు. దేశంలో అతి పెద్ద మెడికల్ కుంభకోణానికి సీజేఐ మిశ్రా కారణమనే ఆరోపణలున్న నేపథ్యంలో సుప్రీం విచారణకు వచ్చిన కేసునూ తన ధర్మాసనానికి బదలాయించుకోవడం ఎంత వరకు సమంజసమన్నారు. పీఎంఓ కార్యాలయం, సుప్రీం కోర్టు న్యాయమూర్తుల నుంచి వచ్చిన ఒత్తిళ్లను తాళలేక అరుణాచలప్రదేశ్ సీఎం ఆత్మహత్యకు పాల్పడగా, సీబీఐ కోర్టు జస్టిస్ లోయా అనుమానాస్పదస్థితిలో మృతి చెందారన్నారు. ప్రధాన న్యాయమూర్తే వివాదస్పదం కావడంతో, న్యాయమూర్తులు బహిరంగంగా ప్రజలకు వాస్తవాలను వివరించారన్నారు. ఈ వివాదాన్ని రాజీ చేసుకునేందుకు పీఎంవో రాయబారం నడుపుతోందని, నలుగురు న్యాయమూర్తులు వ్యక్తపరిచిన ఐదు ప్రధాన అంశాలపై పారదర్శకంగా ప్రజలకు వివరణ ఇవ్వాల్సిన బాధ్యత సుప్రీంపై ఉందని డిమాండు చేశారు.

దేశంలో నేరపూరిత పాలన

ఆర్ఎస్ఎస్ నేత ప్రవీణ్ తొగాడియా సాక్షాత్తు మోడీ తనను ఎన్‌కౌంటర్ చేయిస్తారనే భయాందోళన వ్యక్తం చేయటం చూస్తే... దేశంలో నేరపూరిత వ్యవస్థ పాలన సాగుతోందని నారాయణ వ్యాఖ్యానించారు. న్యాయవ్యవస్థ, సీబీఐ, ఎన్నికల సంఘాల స్వయం ప్రతిపత్తికి కేంద్రం విఘాతం కలిగిస్తోందని విమర్శించారు. రెండు తెలుగు రాష్ట్రాల సీఎంలకు గవర్నర్ నరసింహన్ భజన చేస్తున్నారని విమర్శించారు. ఏపీ సీఎం చంద్రబాబు రాజకీయంగా సమస్యలు పరిష్కరించుకోలేక కోర్టుకు వెళతాననడం గమనార్హమన్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకునేకంటే ముందుగానే బీజేపీకి దండం పెట్టడం మంచిదని సలహా ఇచ్చారు.

ప్రైవేటుకు రాజధాని భూములు : రామకృష్ణ

రాజధాని నిర్మాణం కోసం రైతులు ఇచ్చిన భూములను చంద్రబాబు ప్రైవేటు సంస్థలకు ధారాదత్తం చేయడాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తప్పుపట్టారు. రాజధానిలో ఏడు మెడికల్ కాలేజీల ఏర్పాటుకు స్థలం కేటాయించే నిర్ణయంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజధాని నిర్మాణానికి కేంద్రం నుంచి నిధులు తేలేక ప్రపంచ బ్యాంక్ రుణం తీసుకోవడం శోచనీయమన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు తెచ్చుకోలేని స్థితిలో చంద్రబాబు ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ ఏడో తేదీ నుంచి తొమ్మిది వరకు కడపలో జరగనున్న సీపీఐ రాష్ట్ర 26వ మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని చెప్పారు. సీపీఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు జీ ఓబులేసు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.